www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 10-1-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 266 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి ఉ. 10.20 తదుపరి ద్వాదశి; నక్షత్రం: కృత్తిక మ. 1.45 తదుపరి రోహిణి; వర్జ్యం: తె. 4.54-6.25; దుర్ముహూర్తం: ఉ. 9.03-9.48, మ. 12.44-1.28; అమృతఘడియలు: ఉ. 11.29-12.59, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6.51, సూర్యాస్తమయం: 5.53 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టీసీఎస్ లాభం రూ.12,380 కోట్లు

క్యూ3లో 12% వృద్ధి నమోదు

రూ.63,973 కోట్లకు కంపెనీ ఆదాయం ● ఒక్కో షేరుకు మొత్తం రూ.76 డివిడెండ్


కృతివాసన్

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25).. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) దేశీయ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ రూ.12,380 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదు చేసిన రూ.11,058 కోట్ల లాభంతో పోలిస్తే 11.95 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.6 శాతం వృద్ధితో రూ.63,973 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికానికి రాబడి రూ.60,583 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ3లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ 24.5 శాతానికి పెరిగింది. గత క్యూ3లో ఇది 24.1 శాతంగా ఉంది. బీఎస్ఈలో టీసీఎస్ షేరు ధర గురువారం 1.72 శాతం తగ్గి రూ.4,036.65 వద్ద స్థిరపడింది.

1,020 కోట్ల డాలర్ల కొత్త ఆర్డర్లు: ఉత్తర అమెరికా సహా పాశ్చాత్య మార్కెట్లకు క్రిస్మస్ సెలవుల సీజన్ కావడంతో సాధారణంగానే క్యూ3లో ఐటీ రంగ పనితీరు బలహీనపడుతుంది. కానీ, ఈ డిసెంబరు త్రైమాసికంలో టీసీఎస్ 1,020 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంది. గత ఆర్థిక సంవత్సరపు క్యూ3లో లభించిన 810 కోట్ల డాలర్ల కాంట్రాక్టులతో పోలిస్తే 25.93 శాతం అధికవిది. అంతేకాదు, గత ఐదేళ్లలో మూడో త్రైమాసికానికి కంపెనీ నమోదు చేసిన అత్యధిక కొత్త ఆర్డర్ల విలువ ఇదే.

ప్రణాళికకు అనుగుణంగా ప్రాంగణ నియామకాలు

ఫ్రెషర్ల ప్రాంగణ నియామకాలు (క్యాంపస్ హైరింగ్) ప్రణాళికకు అనుగుణంగా సాగుతున్నాయని టీసీఎస్ మానవ వనరుల చీఫ్ మిలింద్ లక్కడ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా 40,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు కంపెనీ గతంలోనే ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో మరిన్ని అధిక ప్రాంగణ నియామకాలు చేపట్టేందుకు కంపెనీ సిద్ధమవుతోందని లక్కడ్ అన్నారు. అలాగే, ముున్ముందు త్రైమాసికాల్లో ఉద్యోగుల వలసలు తగ్గుముఖం పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ.10 మధ్యంతర, రూ.66 ప్రత్యేక డివిడెండ్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.66 ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించింది. అంటే, ఒక్కో షేరుకు మొత్తం రూ.76 డివిడెండ్ లభించనుంది. ఇందుకు అర్హులైన వాటాదారులను ఈ నెల 17న రికార్డు చేసి, వచ్చే నెల 3న చెల్లింపులు చేపట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి, రెండో త్రైమాసికాల్లో (క్యూ1, క్యూ2)నూ కంపెనీ ఒక్కో షేరుకు రూ.10 చొప్పున మొత్తం రూ.20 మధ్యంతర డివిడెండ్ చెల్లించింది.

ఉద్యోగుల్లో 5,370 మంది తగ్గుదల: క్యూ1, క్యూ2 ట్రెండ్‌కు భిన్నంగా టీసీఎస్‌లో ఉద్యోగులు మళ్లీ తగ్గారు. క్యూ3లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 5,370 తగ్గి 6,07,354కు పరిమితమైంది. గత త్రైమాసికానికి కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13 శాతానికి పెరిగింది. క్యూ2 అట్రిషన్ రేటు 12.3 శాతంగా ఉంది.

25,000 మందికి ప్రమోషన్లు: గడిచిన మూడు నెలల్లో 25,000 మందికి పైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చినట్లు టీసీఎస్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1.10 లక్షల మందిని పైస్థాయికి ప్రమోట్ చేయడం జరిగిందని కంపెనీ వెల్లడించింది. ఈ సంఖ్య మొత్తం సిబ్బందిలో దాదాపు 20 శాతానికి సమానం.

అన్ని మార్కెట్ల నుంచి సమృద్ధిగా ఆర్డర్లు

గడిచిన త్రైమాసికంలో అన్ని రంగాలు, మార్కెట్ల నుంచి సమృద్ధిగా ఆర్డర్లు లభించాయని, కంపెనీ దీర్ఘకాలంలో మెరుగైన వృద్ధి కనబరిచేందుకు ఇది దోహదపడనుందని టీసీఎస్ సీఈఓ కే కృతివాసన్ అన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), కన్స్యూమర్ వ్యాపారాలు మళ్లీ పుంజుకుంటున్నాయని, కొన్ని వ్యాపార విభాగాల్లో ఐటీ వ్యయాలు మళ్లీ పెరుగుతున్నాయన్న ప్రాథమిక సంకేతాలున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండు అంశాలతోపాటు స్థానిక మార్కెట్లో బలమైన పనితీరు కొనసాగడం కంపెనీ భవిష్యత్‌పై ధీమాను పెంచిందన్నారు.

బెంగళూరులో రూ.1,625 కోట్లకు భారీ స్థలం కొనుగోలు: ఐటీ హబ్ బెంగళూరులో భారీ స్థలాన్ని తమ గ్రూప్‌నకు చెందిన కంపెనీ నుంచి రూ.1,625 కోట్లకు కొనుగోలు చేసినట్లు టీసీఎస్ తెలిపింది.

కృత్రిమ మేధతో మరిన్ని ఉద్యోగాలు: కృత్రిమ మేధ (ఏఐ) మరిన్ని ఉద్యోగాలు సృష్టించనుందని టీసీఎస్ సారథి కృతివాసన్ అన్నారు. ఈ ఆధునిక సాంకేతికత కారణంగా ప్రస్తుత ఉద్యోగాల్లో కొన్ని క్రమంగా కనుమరుగైనప్పటికీ, సరికొత్త విధులతో కూడిన కొత్త ఉద్యోగాలు భారీ సంఖ్యలో పుట్టుకురానున్నాయని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఎలీ లిల్లీ జీసీసీ

1,000కి పైగా నియామకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్టు ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ ప్రకటించింది. డిజిటల్ వ్యూహాన్ని పటిష్ఠం చేసుకుని మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా 1,000కి పైగా నియామకాలు చేపట్టనున్నట్టు తెలిపింది. లిల్లీ క్యాపబిలిటీ సెంటర్ ఇండియాగా (ఎల్‌సీసీఐ) వ్యవహరించే ఈ కేంద్రం ప్రపంచవ్యాప్తంగా తమ అవసరాలకు అనుగుణంగా ఆటోమేషన్, కృత్రిమ మేధ, సాఫ్ట్‌వేర్ ప్రోడక్ట్ ఇంజనీరింగ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లో తమ సామర్థ్యాలు విస్తరించేందుకు కృషి చేస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఏడాది మధ్య కాలానికి ఈ జీసీసీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని పేర్కొంది. కాగా నియామకాల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. ప్రస్తుతం కంపెనీ బెంగళూరులో ఒక ఎల్‌సీసీఐ నిర్వహిస్తోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతి తీవ్రమైన ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాలు చూపే ఆధునిక టెక్నాలజీలు, సాధనాలు తయారు చేయగల వివిధ రంగాలకు చెందిన ఇంజనీర్లను ఎల్‌సీసీఐ హైదరాబాద్ సమీకరిస్తుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డియోగో రౌ చెప్పారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో పెరుగుతున్న హైదరాబాద్ ప్రాబల్యానికి ఈ పెట్టుబడి నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

ఫిలిప్పీన్స్ జేవీకి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ గుడ్‌బై

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫిలిప్పీన్స్‌లో మెగావైడ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ (జేవీ) సంస్థ మెగావెడ్ జీఎంఆర్ కన్‌స్ట్రక్షన్ జేవీ నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ తప్పుకుంది. ఈ జేవీ ఈక్విటీలో తన అనుబంధ కంపెనీ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇంటర్నేషనల్ బీవీ (జీఏఐబీవీ)కి ఉన్న 50 శాతం వాటాను భాగస్వామ్య సంస్థ మెగావైడ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్‌కు 13.65 లక్షల డాలర్లకు (సుమారు రూ.11.71 కోట్లు) విక్రయించినట్టు తెలిపింది. గత నాలుగేళ్లుగా ఈ జేవీకి ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేకపోవడంతో జీఎంఆర్ గ్రూప్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఎంఎస్ఎంఈల కోసం కొత్త పరపతి హామీ పథకం

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) రుణ అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం త్వరలో కొత్త పరపతి హామీ పథకం తీసుకురాబోతోంది. ఈ పథకం ద్వారా ఎంఎస్ఎంఈలకు ఎలాంటి హామీ లేకుండా రూ.100 కోట్ల వరకు రుణాలు లభిస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) కార్యదర్శి నాగరాజు చెప్పారు. ఈ పథకం కింద తీసుకునే రుణాలు రూ.100 కోట్లు మించినా, రూ.100 కోట్ల వరకు ఈ పరపతి హామీ పథకం కింద, వాటి రుణ చెల్లింపులకు హామీ లభిస్తుంది. అయితే రుణం తీసుకునేటప్పుడే ఆ ఎంఎస్ఎంఈ కొంత హామీ ఫీజుగా చెల్లించాలి. ఆ తర్వాత ఏటా మిగిలిన రుణ చెల్లింపునకు హామీ ఫీజు చెల్లిస్తుండాలి.

తెలుగు రాష్ట్రాల్లో ఈవీ చార్జింగ్ సదుపాయాల్లో వృద్ధి

భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఎలక్ట్రిక్ కార్లు, ద్విచక్ర వాహన విక్రయాలు ప్రధాన నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో గణనీయంగా పెరుగుతున్నాయి. ఇదే సమయంలో 2023-24లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో చార్జింగ్ నెట్‌వర్క్ ఏకంగా 98 శాతం పెరిగిననట్లు భారీ పరిశ్రమల శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు టాటా ఈవీ కూడా ఈ నగరాల్లో చార్జింగ్ సదుపాయాల అభివృద్ధి కోసం వ్యూహాత్మక భాగస్వామ్యాలు కుదుర్చుకుంటోంది. తెలంగాణలో 2022-23లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు కేవలం 32గా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి వరకు ఇవి ఏకంగా 927కి చేరుకున్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ స్టేషన్ల సంఖ్య 64 నుంచి 440కి పెరిగాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	116
వరంగల్	114	గుంటూరు	115
కరీంనగర్	114	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	95
కర్నూలు	114	నెల్లూరు	100
విశాఖపట్నం	107	అనంతపురం	100
గోదావరి	116		

బీ న్యూలో సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ సంస్థ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్.. సంక్రాంతి సందర్భంగా పలు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. మొబైల్స్‌తో పాటు గృహోపకరణాలపై కూడా ఆఫర్లు అందుబాటులో ఉంటాయని సంస్థ సీఈఓ వై సాయి నిఖిలేష్ తెలిపారు. ల్యాప్‌టాప్, టీవీలపై రూ.20,000 వరకు క్యాష్‌బ్యాక్ సహా ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50 శాతం వరకు, యాక్సెసరీస్‌పై 80 శాతం వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే బజాజ్ ఫైనాన్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ కొనుగోలు చేస్తే రూ.5,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను ఇవ్వనున్నట్లు నిఖిలేష్ తెలిపారు. ఐఫోన్ కొనుగోలుపై భారీ డిస్కౌంట్‌తో పాటు రూ.5,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చని తెలిపారు. జీరో డౌన్ పేమెంట్, నో కాస్ట్ ఈఎంఐ విధానంలో స్మార్ట్‌ఫోన్‌ను తమ షోరూమ్స్‌లో కొనుగోలు చేయవచ్చన్నారు. సంక్రాంతి ప్రత్యేక ఆఫర్ కింద ప్రతి కొనుగోలుపై ఒక ఈఎంఐ ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని 150కి పైగా ఉన్న బీ న్యూ షోరూమ్స్‌లో సంక్రాంతి ఆఫర్లు అందుబాటులో ఉంటాయని సంస్థ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి తెలిపారు.

ప్రత్యేక యాప్ ద్వారా ఇన్‌స్టామార్ట్ సేవలు

న్యూఢిల్లీ:ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవల ప్లాట్‌ఫామ్ స్విగ్గీ.. తన క్విక్ కామర్స్ సేవల విభాగమైన ఇన్‌స్టామార్ట్ కోసం ప్రత్యేక యాప్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపింది. కంపెనీ క్విక్ కామర్స్ సేవల విస్తరణ ప్రయత్నాల్లో స్విగ్గీకి ఇది కీలక మైలురాయి కానుంది. భవిష్యత్‌లో స్విగ్గీ ఫుడ్ డెలివరీ సేవలను ఇన్‌స్టామార్ట్ మించిపోవచ్చని స్విగ్గీ వ్యవస్థాపకులు, సీఈఓ శ్రీహర్ష మాజేటి ధీమా వ్యక్తం చేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,200 ▲	72,600 ▲	1,00,000 ▲
విజయవాడ	80,200 ▲	75,500 ▲	92,500 ▲
విశాఖపట్నం	78,350 ▲	71,820 ▲	91,820 ▲
రాజమండ్రి	79,200 ▲	72,600 ▲	92,300 ▲
ప్రొద్దుటూరు	79,300 ▲	73,430 ▲	92,100 ▼
ముంబై	77,618 ▲	71,098 ▲	89,800 ▲

అమ్మకాల హోరుతో మార్కెట్ డౌన్

ముంబై: డిసెంబరు త్రైమాసిక ఆదాయాల వృద్ధిపై నెలకొన్న భయాల కారణంగా మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ కౌంటర్లలో జరిగిన భారీ అమ్మకాలు మార్కెట్‌ను కుంగదీశాయి. చైనా విడుదల చేసిన ద్రవ్యోల్బణం గణాంకాలు, అమెరికా బాండ్లలో భారీ అమ్మకాలు, ఆసియా మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలు కూడా గురువారం మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. దీంతో సెన్సెక్స్ 528.28 పాయింట్లు నష్టపోయి 77,620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్ల నష్టంతో 23,526.50 వద్ద ముగిసింది. అమెరికాలో 10 సంవత్సరాల బాండ్ల రాబడులు 2024 ఏప్రిల్ తర్వాత గరిష్ఠ స్థాయిలకు చేరాయని, దీనివల్ల అమెరికా ఫెడ్ రిజర్వ్ తక్కువ సార్లు మాత్రమే వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న భయాలు బాండ్లలో అమ్మకాలను ప్రేరేపించాయని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

లెన్స్‌కార్ట్ రూ.8,500 కోట్ల ఐపీఓ: కళ్లద్దాల విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న స్టార్టప్ కంపెనీ లెన్స్‌కార్ట్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇష్యూ ద్వారా 100 కోట్ల డాలర్లు (రూ.8,500 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరికి స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ కావాలని, అప్పటికి 700 కోట్ల నుంచి 800 కోట్ల డాలర్ల (రూ.59,500 నుంచి 68,000 కోట్లు) విలువ సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 20 కోట్ల నుంచి 30 కోట్ల డాలర్ల విలువ గల సెకండరీ షేర్ల అమ్మకాలు పూర్తి చేసినట్టయితే కంపెనీ విలువ 20 శాతం పెరిగి 600 కోట్ల డాలర్లకు చేరుతుందని గత నవంబరులో అంచనా వేశారు. కంపెనీ ఇప్పటికే ఫిడెలిటీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, టెమాసెక్ నుంచి 20 కోట్ల డాలర్లు సమీకరించింది. 2010 సంవత్సరంలో స్థాపించిన లెన్స్‌కార్ట్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2000 స్టోర్లను నిర్వహిస్తోంది.

స్పోర్ట్స్

అమ్మాయిలూ... అదరగొట్టండి!

ఉ. 11 నుంచి స్పోర్ట్స్-18లో

- మంధాన కెప్టెన్సీలో దూకుడుగా భారత్
- ఐర్లాండ్‌తో తొలి వన్డే నేడు


గాబీ లూయిస్
మంధాన

రాజ్‌కోట్: వెస్టిండీస్ సిరీస్‌లో అదరగొట్టిన భారత మహిళల జట్టు.. అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. ఐర్లాండ్‌తో తొలి ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా.. శుక్రవారం జరగనున్న మొదటి వన్డేలో డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన నేతృత్వంలో భారత్ బరిలోకి దిగనుంది. వరల్డ్‌కప్ నేపథ్యంలో యువ క్రికెటర్లను పరీక్షించడానికి మేనేజ్‌మెంట్‌కు ఇదో సువర్ణావకాశం. విండీస్‌తో టీ20 సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకొన్న భారత్.. వన్డే సిరీస్‌ను 3-0తో దక్కించుకొంది. ఈ రెండు ఫార్మాట్లలోనూ పరుగుల వరద పారించిన మంధాన అదే ఫామ్‌ను కొనసాగించాలనుకొంటోంది. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు విశ్రాంతినివ్వడంతో.. మిడిలార్డర్‌లో హర్లీన్ డియోల్, ప్రతీక, జెమీమా కీలకంగా మారారు. విండీస్‌తో వన్డే సిరీస్‌లో డియోల్ సెంచరీ నమోదు చేసింది. ఓపెనర్‌గా ప్రతీక మెరుగ్గా రాణిస్తోంది. అయితే, పేసర్ రేణుకా సింగ్ గైర్హాజరీలో టిటాస్ సాధు, సైమా ఠాకూర్‌పై భారం పడనుంది. దీప్తి శర్మ, ప్రియా మిశ్రా, తనూజ కన్వర్‌తో స్పిన్ విభాగం బలంగానే ఉంది. ఆల్‌రౌండర్లు రాఘవి బిస్త్, సయాలిపై అందరి దృష్టి ఉండే అవకాశం ఉంది. మరోవైపు గాబీ లూయిస్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న ఐర్లాండ్‌కు భారత్‌ను ఎదుర్కోవడం సవాలే. ఈ రెండు జట్లు వన్డేల్లో 12 సార్లు తలపడగా ఐర్లాండ్ ఒక్కసారి కూడా గెలవలేదు. అయితే, ఈసారి గెలిచి సత్తాచాటుతామని గాబీ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఆల్‌రౌండర్ ఓర్లా పెండర్‌గాస్ట్‌కు బిగ్‌బాష్‌లో ఆడిన అనుభవం ఉంది.



క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ


ప్రణయ్ పరాజయం

కౌలాలంపూర్: భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి మలేసియా సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. అయితే పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ పోరాడి ఓడాడు. గురువారం జరిగిన డబుల్స్ రెండో రౌండ్‌లో సాత్విక్/చిరాగ్ జంట 21-15, 21-15తో స్థానిక ద్వయం అజ్రిన్/టాన్‌పై గెలుపొందింది. హోరాహోరీగా సాగిన సింగిల్స్ రౌండ్-16 పోరులో ప్రణయ్ 8-21, 21-15, 21-13తో లి షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో మాళవికా బన్సోడ్ 18-21, 11-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. ఇక మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జంట 21-15, 19-21, 19-21తో చైనా ద్వయం జియాయి/జాంగ్ షు చేతిలో పోరాడి ఓడిపోయింది. మిక్స్‌డ్‌లో సతీష్ కరుణాకరన్/ఆద్య 10-21, 17-21తో నాలుగో సీడ్ సూన్/షెవాన్ (మలేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు.


బుమ్రా సంగతేంటి?

షమికి అవకాశం

చాంపియన్స్ ట్రోఫీ జట్టుపై ఊహాగానాలు


బుమ్రా

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ప్రాతినిధ్యంపై సస్పెన్స్ కొనసాగుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో విశేషంగా రాణించిన అతడు సిడ్నీ టెస్టులో గాయపడిన విషయం తెలిసిందే. దీంతో ముందు జాగ్రత్తగా ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌ల్లో విశ్రాంతినిస్తారని భావిస్తున్నారు. కానీ వచ్చే నెల 19 నుంచి పాక్, దుబాయ్‌లో చాంపియన్స్ ట్రోఫీ జరుగబోతోంది. ఈ మెగా టోర్నీకి బుమ్రా అందుబాటులో ఉంటాడా? లేడా? అనేది ఉత్కంఠగా మారింది. ఈ ఆదివారం లోపు టీమిండియా ప్రాథమిక జట్టును ప్రకటించాల్సి ఉంది. ఈ జట్టులో ఎలాగూ మార్పులు చేసుకునే సౌలభ్యం ఉండడంతో 15 మందితో కూడిన టీమ్‌లో బుమ్రా పేరును చేర్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇక టోర్నీ ఆరంభం నాటికి అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించి బౌలింగ్ చేయగలిగితే.. తుది జట్టులో ఉంటాడు. ప్రస్తుతానికైతే బుమ్రా గాయం తీవ్రతపై బీసీసీఐ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఒకవేళ అతడి గాయం గ్రేడ్ 3 విభాగంలో ఉంటే మాత్రం కోలుకునేందుకు మూడు నెలల సమయం పడుతుంది. అదే జరిగితే ఇంగ్లండ్‌తో సిరీస్‌లతోపాటు చాంపియన్స్ ట్రోఫీ, ఐపీఎల్‌లో ఆడేది కూడా సందేహంగా మారుతుంది. ఈనేపథ్యంలో భారత బౌలింగ్ విభాగం బలహీనంగా మారుతుంది.



షమి ఖాయమే..

బుమ్రా మాదిరే మరో వెటరన్ పేసర్ మహ్మద్ షమి రీఎంట్రీ గురించి కూడా ఆసక్తికర చర్చ జరుగుతోంది. అతను అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఏడాదికి పైగా అవుతోంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో గాయపడ్డాక షమి జాతీయ జట్టుకు ఆడలేకపోయాడు. ప్రస్తుతం దేశవాళీల్లో విశేషంగా రాణిస్తుండడం అతడికి సానుకూలాంశం కానుంది. ఆసీస్ టూర్‌కు వెళ్తాడని భావించినా అతడి మోకాలు వాపునకు గురి కావడంతో సాధ్యం కాలేదు. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతూ ఫిట్‌నెస్ నిరూపించుకుంటున్నాడు. అటు సెలెక్టర్లు కూడా షమిని జాగ్రత్తగా గమనిస్తున్నారు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నుంచి తుది అనుమతి లభిస్తే షమి టీమిండియాలోకి రావడం సులువవుతుంది. ఒకవేళ బుమ్రా అందుబాటులో లేకపోయినా షమి రాకతో పేస్ విభాగం జట్టుకు అండగా ఉంటుంది.

కివీస్ వైద్యుడిని సంప్రదించిన బుమ్రా

ప్రస్తుతం వెన్నునొప్పితో బాధపడుతున్న బుమ్రా న్యూజిలాండ్‌కు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ రోవన్ స్కౌటెన్‌ను సంప్రదించినట్టు సమాచారం. 2023లో అతనే బుమ్రాకు చికిత్స చేశాడు. అలాగే బీసీసీఐ మెడికల్ టీమ్ తోనూ సర్జన్ టచ్‌లో ఉన్నట్టు, ఏ విషయం సెలెక్టర్లకు త్వరలోనే తెలుపుతారని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.

13 నుంచి ఖో-ఖో వరల్డ్ కప్

- 20 పురుషుల, 19 మహిళల జట్లు
- లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు



న్యూఢిల్లీ: మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్ ఈనెల 13 నుంచి 19 వరకు ఇక్కడి ఇందిరా గాంధీ స్టేడియంలో జరగనుంది. భారత ఒలింపిక్ సంఘం పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న ఈ మెగా టోర్నమెంట్‌లో..20 పురుషుల, 19 మహిళల జట్లు పాల్గొంటున్నాయి. తొలుత గ్రూపు మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అనంతరం నాకౌట్ దశ పోటీలు జరుగుతాయి. ఒక్కో గ్రూపులో తొలి రెండు స్థానాలలో నిలిచే జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

భారత కెప్టెన్లు ప్రతీక్, ప్రియాంక: ఖోఖో ప్రపంచ కప్‌లో తలపడే భారత పురుషులు, మహిళల జట్లను గురువారం ప్రకటించారు. పురుషుల జట్టుకు ప్రతీక్ వైకర్, మహిళల జట్టుకు ప్రియాంక ఇంగ్లే సారథ్యం వహించనున్నారు.

మహిళలు: గ్రూప్-ఎ: భారత్, ఇరాన్, మలేసియా, దక్షిణ కొరియా; గ్రూప్-బి: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెన్యా, ఉగాండా, నెదర్లాండ్స్; గ్రూప్-సి: నేపాల్, భూటాన్, శ్రీలంక, జర్మనీ, బంగ్లాదేశ్; గ్రూప్-డి: దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పోలెండ్, పెరూ, ఇండోనేసియా; **పురుషులు:** గ్రూప్-ఎ: భారత్, నేపాల్, పెరూ, భూటాన్, బ్రెజిల్ ;గ్రూప్-బి: దక్షిణకొరియా, ఘనా, అర్జెంటీనా, నెదర్లాండ్స్, ఇరాన్ గ్రూప్-సి: బంగ్లాదేశ్, శ్రీలంక, దక్షిణకొరియా, అమెరికా, పోలెండ్; గ్రూప్-డి: ఇంగ్లండ్, జర్మనీ, మలేసియా, ఆస్ట్రేలియా, కెన్యా.

క్వార్టర్స్‌కు రాజస్థాన్, హరియాణా

విజయ్ హజారే ట్రోఫీ

వడోదర: అభిజిత్ తోమర్ (111) అదిరే శతకంతో.. రాజస్థాన్ విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో రాజస్థాన్ 19 పరుగుల తేడాతో తమిళనాడుపై గెలిచింది. తొలుత రాజస్థాన్ 47.3 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ చక్రవర్తి 5 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో తమిళనాడు 47.1 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. ట్రోఫీ చరిత్రలో తమిళనాడుపై రాజస్థాన్ గెలవడం ఇదే తొలిసారి.

షమి 3 వికెట్లు పడగొట్టినా.. : మరో ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో హరియాణా 72 పరుగుల తేడాతో బెంగాల్‌ను చిత్తు చేసింది. తొలుత హరియాణా 298/9 స్కోరు చేసింది. నిశాంత్ (64, 2/36), పార్థ్ (62, 3/33) అర్ధ శతకాలు సాధించారు. షమి 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో బెంగాల్ 43.1 ఓవర్లలో 226 పరుగులకు ఆలౌటైంది.

భిన్న పార్శ్వాలలో సిన్నర్, జొకో

ఆస్ట్రేలియన్ ఓపెన్ డ్రా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ డ్రాలను గురువారం ప్రకటించారు. డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్, 10 సార్లు విజేత నొవాక్ జొకోవిచ్ వేర్వేరు పార్శ్వాలనుంచి బరిలోకి దిగుతున్నారు. ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఈనెల 12న ఇక్కడ ప్రారంభం కానుంది. సిన్నర్, జొకో వేర్వేరు పార్శ్వాలనుంచి తలపడుతున్న దరిమిలా..గత ఏడాది మాదిరిగా వీరిద్దరూ ఈసారి సెమీఫైనల్లో పరస్పరం ఢీకొనే అవకాశాలు లేవు. తొలి రౌండ్‌లో నికోలస్ జారీని ఎదుర్కోనున్న సిన్నర్ తదనంతరం టేలర్ ఫ్రిట్జ్, బెన్ షెల్టన్, మెద్వెదెవ్‌తో అమీతుమీ తేల్చుకుంటాడు. ఇక.. జొకోవిచ్ మొదటి రౌండ్‌లో భారత మూలాలున్న అమెరికా ఆటగాడు నిషేష్ బసవా రెడ్డిని ఢీకొంటాడు. తన గ్రూపులోనే ఉన్న ప్రపంచ మూడో ర్యాంకర్ అల్కారజ్‌తో జొకో క్వార్టర్‌ఫైనల్లో తలపడే చాన్సుంది. ఈ మ్యాచ్ విజేత వరల్డ్ నెం.2 జ్వెరెవ్‌ను ఢీకొనే అవకాశముంది. మహిళల విభాగంలో నిరుటి చాంపియన్ అర్యానా సబలెంక మొదటి రౌండ్‌లోనే కఠినమైన ప్రత్యర్థితో తలపడాల్సి వస్తోంది. 2017 యూఎస్ ఓపెన్ చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్‌ను ఈ రౌండ్‌లో సబలెంక ఢీకొననుంది. అంచనాలకు అనుగుణంగా టోర్నీ సాగితే సబలెంకకు సెమీఫైనల్లో మూడో సీడ్ కొకొ గాఫ్ ఎదురుపడనుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మాజీ చాంపియన్ సోఫియా కెనిన్ మొదటి రౌండ్‌లో గాఫ్‌కు సవాలు విసరనుంది.

చెక్ ఆటగాడితో నగాల్ ఢీ: భారత అత్యుత్తమ సింగిల్స్ ఆటగాడు సుమిత్ నగాల్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన వరల్డ్ నెం. 26 టోమస్ మకాక్‌తో తలపడనున్నాడు. నగాల్ ప్రస్తుతం ఏటీపీ ర్యాంకుల్లో 96వ స్థానంలో ఉన్నాడు.



ఎవరీ బసవారెడ్డి?

ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్‌లో దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్‌తో తలపడబోయే ఆటగాడు తెలుగు మూలాలున్న 19 ఏళ్ల అమెరికా టెన్నిస్ ఆటగాడు నిషేష్ బసవారెడ్డి. ర్యాంకింగ్స్‌లో 133వ స్థానంలో ఉన్న ఈ కుర్రాడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వైల్డ్‌కార్డ్ ద్వారా బరిలోకి దిగుతున్నాడు. నెల్లూరుకు చెందిన నిషేష్ తల్లిదండ్రులు 1999లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో తరలి వెళ్లారు. తన ఆరాధ్య ఆటగాడైన జొకోవిచ్‌తో తలపడనుండడం ఎంతో సంతోషంగా, ఉద్వేగంగా ఉందన్నాడు నిషేష్. ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మాజీ విద్యార్థి అయిన నిషేష్ గత ఏడాదే ప్రొఫెషనల్‌గా మారాడు. కాగా డబుల్స్‌లో భారత మూలాలున్న మరో ఆటగాడు రాజీవ్‌రామ్ తనకు మార్గదర్శనం చేశాడని నిషేష్ చెప్పాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వారానికి 90 గంటలు

పనిచేయాలి

అవసరమైతే ఆదివారాలూ బాధ్యతలు..

ఎంతసేపని భార్యలను చూస్తూ ఉంటారు?

ఎల్‌అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు

నెట్టింట వైరల్.. తీవ్రంగా విమర్శలు

12

శుక్రవారం | 10-1-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

చైర్మన్ X ఈవో: వాగ్యుద్ధం..

చైర్మన్: చైర్మన్‌గా వచ్చినప్పటి నుంచీ నన్ను చిన్నచూపు చూస్తున్నారు. నాకేమీ చెప్పడం లేదు.

ఈవో: నీకేం చెప్పడం లేదు? చెబుతూనే ఉన్నాం కదా! (తీవ్ర స్వరంతో)

చైర్మన్: ఏం చెప్పావ్? రేపు వైకుంఠ ఏకాదశి. ఈ రోజు నుంచే హడావుడి ఉంది. మీరు ఏం చేస్తున్నారో ఆ విషయాలు ఏమైనా చెప్పావా? నేను చైర్మన్‌గా ఉండి ఇక్కడ ఏం చేస్తున్నట్లు? (తీవ్ర ఆగ్రహంతో)

ఈవో: నువ్వు మాకు అన్నీ చెప్పే చేస్తున్నావా? మాకు చెప్పే ప్రకటిస్తున్నారా? శ్రీవాణి ట్రస్టు విషయంలో నువ్వేం చేశావు? నాతో మాట్లాడకుండానే ప్రెస్‌మీట్ పెట్టి నీకు నచ్చింది చెప్పేశావు. దాని వల్ల మాకు ఎంత ఇబ్బంది అవుతుందో నీకేమైనా తెలుసా?

ముఖ్యమంత్రి ముందే మాటకు మాట



మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు పక్కన చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావు

తీవ్రంగా వాదులాడుకున్న టీటీడీ ఈవో, చైర్మన్

ఈవోపై ఫిర్యాదు చేసిన బీఆర్ నాయుడు

తనకేమీ చెప్పడంలేదని ఆగ్రహం.. చెప్పనిదేంటంటూ ఈవో ధ్వజం

సీఎం, మంత్రుల ముందే ఇద్దరి రచ్చ.. తొలుత మంత్రి అనగాని జోక్యం

ఆపై విరుచుకుపడ్డ చంద్రబాబు.. ఇదేం పద్ధతి... ఇద్దరూ ఆపండి

సమన్వయంతో పని చేయలేరా? అంటూ ఇద్దరికీ సీఎం హెచ్చరిక

ఎవరికి వారే!

చైర్మన్, ఈవో, అదనపు ఈవో మధ్య సమన్వయ లోపం

వైకుంఠ ఏకాదశిపై 15 సమావేశాలు

ఈవో, చైర్మన్ కలిసి పాల్గొన్నది ఒక్క భేటీలోనే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అది... స్వయంగా ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న సమీక్ష. టీటీడీ చరిత్రలోనే పెను విషాదం చోటు చేసుకున్న సందర్భం. ఇలాంటి సమయంలో టీటీడీ చైర్మన్, ఈవో సంయమనం కోల్పోయారు. విచక్షణ మరిచారు. ముఖ్యమంత్రి ముందే వాదులాడుకున్నారు. 'నువ్వు నాకేం చెప్పడంలేదు' అని చైర్మన్ బీఆర్ నాయుడు... 'అన్నీ చెబుతూనే ఉన్నాం' అని ఈవో శ్యామలరావు పరస్పరం వాదనకు దిగారు. కొద్దిసేపు సంయమనం వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. తర్వాత వారిద్దరిపై మండిపడ్డారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట బాధితులను పరామర్శించి, పరిస్థితిని సమీక్షించేందుకు చంద్రబాబు గురువారం తిరుపతి వెళ్లారు. పరామర్శల

మిగతా 11వ పేజీలో...

పెను విషాదానికి 'తెరిచిన గేటు'



ఇది పద్మావతి పార్కు ప్రధాన గేటు! దీని నుంచి బయటికి రాగానే టోకెన్ల జారీ క్యూలలోకి ప్రవేశించవచ్చు. అస్వస్థతకు గురైన ఓ మహిళను బయటికి పంపేందుకు పోలీసులు దీనిని కొద్దిగా తెరవగానే.. భక్తులు ఒక్కసారిగా క్యూలోకి వెళ్లేందుకు ముందుకు రావడమే తొక్కిసలాటకు కారణమైంది.

బైరాగిపట్టెడలో తొక్కిసలాటకు ప్రధాన కారణం అదే

టోకెన్ల కోసం వచ్చిన భక్తులంతా పార్కులోకి!.. అస్వస్థతకు గురైన మహిళ కోసం ప్రధాన గేటు తెరిచిన పోలీసులు

టోకెన్లు ఇస్తున్నారంటూ ఒక్కసారిగా భక్తుల పరుగులు

ఉవ్వెత్తున మీద పడటంతో నిస్సహాయంగా పోలీసులు

2 చిన్నగేట్లు తెరిస్తే ప్రమాదం తప్పేది



పద్మావతి పార్కుకు మరోవైపున ఉన్న రెండు చిన్న గేట్లలో ఇదొకటి! ఆ మహిళను వీటి ద్వారా బయటకు పంపి ఉంటే, పెను విషాదం తప్పేది.

(తిరుపతి రూరల్/ఎంఆర్‌పల్లె - ఆంధ్రజ్యోతి)

ఒక భక్తురాలికి అస్వస్థత... పోలీసుల అనాలోచిత చర్య... భక్త సమూహంలోని కొందరి అత్యుత్సాహం, ఆతృత! ఈ మూడూ కలిశాయి! టీటీడీ చరిత్రలోనే మాయని మచ్చలాగా మిగిలే పెను విషాదానికి దారి తీశాయి. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీకోసం తిరుపతి బైరాగిపట్టెడలోని రామానాయుడు మునిసిపల్ స్కూలు ఈ ఘోరానికి వేదికగా మారింది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు, అధికార వర్గాల కథనం ప్రకారం... బుధవారం రాత్రి ఏం జరిగిందంటే...

వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేసేందుకు బైరాగిపట్టెడలోని రామానాయుడు మునిసిపల్ స్కూల్ కేంద్రానికి బుధవారం ఉదయం 9గంటల

మిగతా 10వ పేజీలో...



తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భర్తను కోల్పోయిన మణికుమారిని ఓదారుస్తున్న హోం మంత్రి అనిత



ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



తొక్కిసలాట ప్రాంతాన్ని మంత్రులు, అధికారులతో కలిసి పరిశీలిస్తున్న సీఎం

బాధ్యత లేదా?

అధికారులపై సీఎం సీరియస్

తమాషా అనుకుంటున్నారా? అంటూ తీవ్ర స్వరం

డీఎస్పీ, టీటీడీ గోశాల డైరెక్టర్ల సస్పెన్షన్ 11

ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, విజిలెన్స్ అధికారి శ్రీధర్ తక్షణ బదిలీ

సమగ్ర విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి

ప్రమాదస్థలి పరిశీలన.. బాధితులకు పరామర్శ

చైర్మన్, మంత్రులతో కలిసి పరిస్థితిపై సమీక్ష

అక్కడికక్కడే ఐదుగురిపై వేటు

మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం

తీవ్రంగా గాయపడ్డ ఇద్దరికి 5 లక్షల సాయం

గాయపడిన 33 మందికి 2 లక్షల సాయం

సీసీ కెమెరాలు పరిశీలించి విచారణ

నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవు: హోంమంత్రి అనిత 10



ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

టీటీడీలో ప్రక్షాళన జరగాలి

వీఐపీ సంస్కృతి నుంచి బయటపడాలి

సామాన్య భక్తులే ప్రాధాన్యం కావాలి

అధికారుల వైఫల్యం వల్లే తొక్కిసలాట

ఈవో, ఏఈవోలు బాధ్యత తీసుకోవాలి

పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది

తప్పునకు పూర్తి బాధ్యత వహిస్తున్నాం

క్షమాపణ చెబుతున్నా: డిప్యూటీ సీఎం పవన్

తిరుపతిలో క్షతగాత్రులకు పరామర్శ

తిరుపతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలక మండలికి సామాన్య భక్తులే ప్రాధాన్యం కావాలని, సమూలంగా ప్రక్షాళన జరిగితేనే అది సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తొక్కిసలాట ఘటనపై విచారణ జరుగుతోందని, భవిష్యత్తులో ఏ ఆలయంలోనూ ఇలాంటివి జరగకుండా చర్యలు చేపడతామన్నారు. టీటీడీలో

మిగతా 11వ పేజీలో...



విజయ్‌పాల్



తులసిబాబు

సునీల్‌కుమార్‌తో నీకు సంబంధమేంటి? 7

ఆ రోజు సీఐడీ ఆఫీసులో ఎందుకున్నావ్?

అగ్రిగోల్డ్ నిధులు ఎలా మళ్లించారు?

రఘురామకు చిత్రహింసల కేసులో..

తులసిబాబుపై పోలీసుల ప్రశ్నలవర్షం

విజయ్‌పాల్‌తో కలిపి విచారణ

నలుగురు ముసుగు మనుషులపై ఆరా

బాలకృష్ణ, అనిత, మంద కృష్ణపైనే

పోస్టులు పెట్టా

మిగతా పోస్టులు, ఫోన్ల గురించి తెలియదు

అర కొర సమాధానాలతో సరిపెట్టిన వర్రా 7

పోస్టులు, కాల్ లిస్ట్ చూపి ప్రశ్నించిన పోలీసులు

ముగిసిన పోలీసు కస్టడీ.. మరోసారి పిలిచే చాన్స్

ఏవియేషన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ IV

డ్రోన్ హబ్‌గా మన ఓర్వకల్లు

డీప్ టెక్నాలజీతో స్వర్ణాంధ్ర విజన్-2047 సాధ్యం

విమాన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

కొత్త ఆలోచనలతో వస్తే స్టార్టప్‌గా ప్రోత్సాహం

విశాఖ డీప్ టెక్నాలజీ సదస్సులో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

జీవో 117 రద్దు!

విద్యారంగంలో సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన గత వైసీపీ ప్రభుత్వం

జగన్ అనాలోచిత నిర్ణయంతో ఉరి బడికి ఉరి

జీవోకు స్వస్తి చెప్పడానికి కూటమి ప్రభుత్వ కార్యాచరణ

సన్నాహక మార్గదర్శకాలు జారీ.. 2 నెలలు క్షేత్రస్థాయి అధ్యయనం

ఫిబ్రవరి చివరినాటికి జీవో రద్దు.. కొత్త జీవో ప్రకారం టీచర్ల బదిలీలు

ఇకపై 5 రకాలుగా పాఠశాలలు.. ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు

కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూళ్లు.. వాటిలో ప్రతి తరగతికీ ఒక టీచర్

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా మారిన జీవో 117కు స్వస్తి పలికేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ వివాదాస్పద జీవోను రద్దు చేస్తామని ఇప్పటికే ప్రకటించగా, దాన్ని ఉపసంహరించిన తర్వాత ప్రత్యామ్నాయం తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ

మిగతా 7వ పేజీలో...



లాస్ ఏంజెలెస్ కౌంటీలో కార్చిచ్చును ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది యత్నాలు


లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు..

₹ 5 లక్షల కోట్ల నష్టం

ఐదుగురి దుర్మరణం.. 1.37 లక్షల మంది తరలింపు.. బైడెన్ కుమారుడి నివాసం కూడా దగ్ధం

హాలీవుడ్‌కు ముప్పు.. ఆస్తులు కోల్పోయిన స్టార్లు.. ఆస్కార్ వేడుకపై నీలినీడలు.. క్రీడా టోర్నీలు రద్దు

12



శ్రీశైలంలో గేట్ల కంటే దిగువకు చేరిన నీటిమట్టం

శ్రీశైలం ఖాళీ!

859.80 అడుగులకు పడిపోయిన జలాశయం నీటి మట్టం

అయినా తెలంగాణ విద్యుదుత్పత్తి

తాజాగా 19,070 క్యూసెక్కులు దిగువకు విడుదల

రాయలసీమ రైతాంగం ఆందోళన.. ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరద

1,622 టీఎంసీల ప్రవాహం.. ఇందులో విద్యుదుత్పత్తి పేరిట

558 టీఎంసీలు సాగర్‌కు.. ప్రస్తుత నిల్వల నుంచే రబీలో సాగునీరివ్వాలి

జూలై వరకు తాగునీటికి ఇవ్వాలి.. అడవుల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చాలి

90 టీఎంసీలకు తగ్గకుండా నిల్వ కొనసాగించాలి

కృష్ణా బోర్డుపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలి.. సాగునీటి నిపుణుల వినతి

కర్నూలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం జలాశయంలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరద జలాలు చేరాయి. రాయలసీమ ప్రాంతానికి వేసవిలో సాగు, తాగునీటి కష్టాలు ఉండవని రైతులు భావించారు. కానీ ఇప్పటికే విద్యుదుత్పత్తి రూపంలో తెలంగాణ 358.94 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 199.38 టీఎంసీలను (మొత్తం 558.32 టీఎంసీలు) దిగువ నాగార్జునసాగర్‌కు వదిలేశాయి. రబీ పంటలు చేతికి రావాలంటే ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలి. ఆ తరువాత వేసవి తాగునీటి అవసరాలు సరేసరి. మరోవైపు నల్లమల అభయారణ్యంలో వన్య ప్రాణుల మనుగడ కోసం అవసరమైన మేరకు జలాశయంలో నిల్వలు ఉండేలా చూడాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. డ్యాంలో నీటి నిల్వ 105.39 టీఎంసీలకు

మిగతా 10వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యూరప్ హెచ్చరిక!

'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అని ట్రంప్ నినదించడం వెనుక అంతరార్థాలు, అంతిమలక్ష్యాలు ఏమిటో ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. ఉన్న అమెరికాను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం కంటే దురాక్రమణలతో ఆయన ఈ విడత మిగతా దేశాలను భయపెట్ట బోతున్నాడని అర్థమవుతోంది. పనామా కాలువ మీదా, గ్రీన్‌ల్యాండ్స్ మీదా కన్నేసిన ఆయనను విలేఖరులు మంగళవారం ఓ కీలకమైన ప్రశ్నవేశారు. వాటిని సొంతం చేసుకోవడానికి సైన్యాన్ని వాడతారా? అన్నది ఆ ప్రశ్న. మరోమరో నాయకుడైతే ఈ ప్రశ్నకు తత్తరపడే వారేమో. డోనాల్డ్ ట్రంప్ తన సమాధానంలో సైనికదాడి అవకాశాన్ని తోసిపుచ్చలేదు. అమెరికా ఆర్థిక, రక్షణపరమైన ప్రయోజనాల పరి రక్షణకు ఆ కాలువ, ఆ మంచుఖండమూ అత్యంత ముఖ్యమని ఆయన మరోమారు ఉద్ఘాటించారు. అతిజాగ్రత్తగా మాట్లాడాలన్న తాపత్రయం ట్రంప్‌లో ఉండదు కనుక, ఆయన ఎజెండా స్పష్టంగా అర్థమవుతుంది. ఆర్థికంతో తెగనప్పుడు, ఆయుధాల వాడకానికి కూడా ఆయన సిద్ధంగా ఉంటాడు. అమెరికా పుట్టుకకు ముందే నామకరణం జరిగిపోయిన గల్ఫ్ ఆఫ్ మెగ్జికోను తాను గద్దెనెక్కగానే గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చేస్తానని ప్రకటించే సాహసం ట్రంప్ మాత్రమే చేయగలరు. వందలాది సంవత్సరాలకు ముందు మొత్తం ఉత్తర అమెరికా అసలు పేరు మెగ్జికన్ అమెరికా గనుక అలా పిలుచుకుంటే మరింత తియ్యగా ఉంటుందని ఆ దేశాధినేత ట్రంప్‌కు కాస్తంత వెటకారంగా సమాధానం ఇచ్చారు.

గ్రీన్‌ల్యాండ్‌కోసం సైనికశక్తిని ఉపయోగించడం మీద నిర్దిష్టంగా ఏ హామీ ఇవ్వబోనని మరో పదిరోజుల్లో అమెరికా అధ్యక్షపదవిలో కూచో బోతున్న వ్యక్తి వ్యాఖ్యానించిన తరువాత కూడా మాట్లాడకపోతే యూరప్‌కు అప్రదిష్టే. ఐరోపా దేశాల సరిహద్దుల సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ప్రయత్నాలను సహించేది లేదని ఫ్రాన్స్ వ్యాఖ్యా నించింది. డెన్మార్క్‌లో ఆరువందలేళ్ళుగా అంతర్భాగంగా ఉన్న గ్రీన్ ల్యాండ్‌ను అమెరికా దురాక్రమించుకుంటుందంటే నమ్మడం కష్టం, కానీ, కాలానుగుణంగా మనమూ మారినప్పుడే ఇటువంటి విపత్తు లను తట్టుకొని నిలబడగలం అని ఫ్రాన్స్ విదేశాంగమంత్రి నర్మగ ర్భంగా వ్యాఖ్యానించారు. గ్రీన్‌ల్యాండ్ యూరప్ భూభాగం, దాని జోలికి ఎవరు వచ్చినా ఊరుకొనేది లేదు, దాడికి ఎంతపెద్ద దేశం ప్రయ త్నించినా వదిలేది లేదు అని ఘాటుగా సమాధానం ఇచ్చారాయన. ట్రంప్ యుద్ధకండూతిని తప్పుబడుతూ, యూరోపియన్ యూనియన్ ఒక్కటిగా నిలవాలి, బలోపేతం కావాలన్నారు ఆయన. జర్మన్ చాన్సలర్ కూడా గట్టిగానే సమాధానం చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలు ఈయూ నేతలందరిలోనూ ఆందోళన కలిగించాయని, మనమంతా ఐకమత్యంగా ఉండాలని అన్నారాయన. గ్రీన్‌ల్యాండ్ జోలికి వస్తే పరస్పర రక్షణ సహకార ఒప్పందాన్ని అమలుచేయాల్సివస్తుందని యూరోపియన్ కమిషన్ కూడా గుర్తుచేసింది. ట్రంప్ దెబ్బకు జస్టిన్ ట్రూడోను సాగనంపిన కెనడా నేతలు కూడా ఆయన పలుమార్లు యాభైఒకటవ రాష్ట్రంగా తమదేశాన్ని అభివర్ణించడం భరించలేకపో తున్నారు. మీ జోకులు ఆపకుంటే ఊరుకొనేది లేదు అని గట్టిగా విరు చుకుపడుతున్నారు. అమెరికాలో విలీనమైతే కెనడాకు ఆర్థికంగానూ, భద్రతాపరంగానో ఎంత లాభమో వివరిస్తూ, కెనడాను స్వాధీనం చేసుకోవడం ఖాయమంటూ ఆయన ఇటీవలే మరోమారు ఉద్ఘాటిం చారు. మిగతా దురాక్రమణలకు ఆయుధాలనీ, సైన్యాన్ని వాడతానని అంటున్న అమెరికా అధ్యక్షుడు కెనడా విషయంలో మాత్రం ఆర్థిక శక్తిని ప్రయోగిస్తానని కాస్తంత మినహాయింపు ఇచ్చారు.

సుంకాలను ఆయుధంగా మార్చి ట్రంప్ మిగతావారిని బెదిరిస్తు న్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను ఇవ్వకపోతే అత్యధిక సుంకాలతో డెన్మార్క్‌ను దెబ్బతీస్తానని, ఆయుధ ప్రయోగంతో దానిని స్వాధీనం చేసుకుంటా నని బెదిరిస్తున్నాడు. పనామా కాలువ, గ్రీన్‌ల్యాండ్, కెనడా వంటివి ఉపరితలంలో కనిపిస్తున్నాయి కానీ, తనకు గిట్టని, దారికి తేవాలను కుంటున్న దేశాలన్నింటిపైనా ఆయన ఇదే అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. రేపు అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఒత్తిడి విధానాలు ఇంత కంటే బలంగా అమలవుతాయనడంలో సందేహం అక్కరలేదు. చిన్నా చితకా దేశాలను, దీవులను, మంచుఖండాలను కలిపేసుకుంటే ఆర్థికంగానూ, సైనికపరంగానూ బలపడవచ్చునని, రాయితీలు, మినహాయింపులు ఇస్తున్న దేశాలను మోయడం కంటే విలీనం చేసు కోవడం ఉత్తమమని ట్రంప్ ఆలోచన. ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' ఈ మారు ఆధిపత్య విస్తరణవాదాలతో మరింత ప్రమాద కరంగా పరిణమించబోతున్నది.

మేధో విరాణ్మూర్తి మన్మోహన్



■ సునీతా నారాయణ్

మట్టివాసన

మా సాహచర్యం విచిత్రమైనది, విశేషమైనది కూడా. ఇటీవల కీర్తిశేషుడు అయిన భారతదేశ ఆర్థిక సంస్కరణల పథనిర్దేశకుడు, ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మార్కెట్ శక్తులకు ప్రాధాన్యమిచ్చే అర్థశాస్త్ర విద్వత్తుతో ప్రభవించిన నవపథగామి. నిరుపమాన పర్యావరణవాది అనీల్ అగర్వాల్. పర్యావరణ భద్రతే ఆయన తొలి, మలి, తుది, ఏకైక లక్ష్యం. 1991లో మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి, భారత్‌ను స్వేచ్ఛా విపణిగా రూపొందించినప్పుడు నిస్సంకోచంగా హర్షించిన వారిలో అనీల్ గానీ, నేను గానీ లేనేలేము. కొత్త ఆర్థిక పథం పర్యావరణ భద్రతకు భరోసానివ్వగలదా? అన్నదే మా ప్రశ్న. జాతి ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధీకరించే సంస్థలు ప్రభావశీలంగా లేనప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయడం మన పర్యావరణ వ్యవస్థలకు మేలు చేస్తుందా?

ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఇవి ఇబ్బందికరమైన ప్రశ్నలే. అయితే ఆయన మా ప్రశ్నలను కొట్టివేయలేదు. ఈ విశాల దృక్పథం, నిష్పాక్షిక వైఖరే ఆయన్ను మిగతా రాజకీయ నాయకుల నుంచి విభిన్నంగా, సమున్నతంగా నిలబెట్టింది. పర్యావరణ సంబంధిత అంశాలపై మాతో ఆయన సమాలోచనలు జరిపారు. అంతమాత్రాన మా అభిప్రాయాలు, సూచనలను ఆయన అంగీకరించారని నేను చెప్పబోవడం లేదు. ఆర్థికాభివృద్ధి వ్యవహారాలను పర్యావరణ దృక్కోణం నుంచి చూడవలసిన అవసరాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. మరింత విపులంగా తెలుసు కోవడానికి ప్రయత్నించారు. పర్యావరణ వ్యవస్థలను పటిష్ఠపరిచి, వాటి సమతౌల్యతను నిలబెట్టేందుకు చేయ వలసిందేమిటో ఆయన సమాలోచించారు.

2004లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయిన సందర్భంలో అనీల్ అగర్వాల్ ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' నిర్వహణ బాధ్యతలు నేను చేపట్టాను. అప్పటికి పర్యావరణ అధ్యయనాలు, పరిశోధనలలో నాకు పెద్దగా అనుభవం లేదు. అయితే నేను ఆ బాధ్యతల నిర్వహణకు సరిపోని వ్యక్తిననే భావాన్ని మన్మోహన్ సింగ్ ఎప్పుడూ నాకు కలిగించలేదు. ప్రధానమంత్రి కార్యాలయానికి వెళ్లి ఆయనతో మాట్లాడే అవకాశాన్ని నాకు కల్పించారు. జలవనరుల సంరక్షణ నుంచి వాతావరణ మార్పు దాకా వివిధ పర్యావరణ అంశాలపై నేను చెప్పే విషయాలను మన్మోహన్ సావధానంగా వినేవారు. వినడమేకాదు, వివిధ సమస్యలకు పరిష్కారాలను సూచించమని కూడా నన్ను ప్రోత్సహించేవారు. 'ఏమి చేయాలి?' అన్నదాని పైనే ఆయన దృష్టి సదా ఉండేది.



డాక్టర్ మన్మోహన్ సింగ్ విలక్షణమైన వ్యక్తి, విభిన్నమైన రాజకీయవేత్త. విశిష్ట ప్రజాస్వామికవాది. కొత్త భావాలను ఆహ్వానించేవారు. వాటి వెలుగులో తన భావాలు పరిశీలించుకుని అవసరమైతే మార్చుకునేవారు. ఇతరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు సమంజసమైనవి అయితే వాటిని అంగీకరించేందుకు సంకోచించేవారు కాదు. తన అధికారాలను పూర్తిగా ప్రజల శ్రేయస్సుకే వినియోగించిన మంచి మనిషి మన్మోహన్ సింగ్.

పులుల సంరక్షణ విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక కమిటీకి సారథ్యం వహించమని 2005లో మన్మోహన్ నన్ను కోరారు. అంగీక రించాను. ఆ కమిటీలోని ఇతర సభ్యులు వన్య ప్రాణుల, ముఖ్యంగా పులుల సంరక్షణ వ్యవహా రాలలో బాగా పలుకుబడి ఉన్న అనుభవజ్ఞులు. ఆ కమిటీకి నేతృత్వం వహించడమనేది ఒక క్లిష్ట బాధ్యత. పైగా పలు విధాల అదొక కష్ట కాలం. సరిస్కా టైగర్ రిజర్వ్‌లోని పెద్దపులులు అంతరించిపోయాయి. పులుల సంరక్షణ ఎజెండాను ఎలా రూపొందించాలి? అదే సమ యంలో అటవీ హక్కుల చట్టంపై పార్లమెంటు లోపలా బయటా పెద్ద చర్చ నడుస్తోంది. ఆది వాసీలకు చారిత్రకంగా జరిగిన, ఇంకా జరుగు తున్న అన్యాయాలను అరికట్టి అటవీ భూములపై వారికి హక్కులు కల్పించాలన్న డిమాండ్‌పై తీవ్ర తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఆదివాసీలు నివసిస్తున్న అటవీ భూముల పరిధిలో జాతీయ ఉద్యానవనాలు, వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రాలు సైతం ఉన్నాయి. పులులతో సహా వన్య ప్రాణుల సంరక్షణకు ప్రాధాన్య మివ్వాలా లేక ఆదివాసీల జీవన భద్రత, జీవనా ధారాల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలా? ఇదొక సంఘర్షణాత్మక ఎజెండా. ఎందుకంటే రెండూ ముఖ్యమే. పులులు సంరక్షణకు ప్రాధాన్య మిస్తున్న వారితో పాటు ఆదివాసీలకు ప్రాధాన్య మివ్వాలనే వారి వాదానలనూ మన్మోహన్ శ్రద్ధగా వినేవారు. ఆ వాద ప్రతివాదాల మధ్య ఒక సమతౌల్యం సాధించేందుకు ఆయన ప్రయత్నించారు.

మా కమిటీ నివేదికలోని అంశాలపై మన్మోహన్‌తో నేను విపులంగా చర్చించాను. ముఖ్యంగా సమ్మిళిత సంరక్షణ నమూనాను అనుసరించాల్సిన ఆవశ్యకత గురించి ఆయనకు చెప్పాను. ఆ ఎజెండా అమలులో ఎదురయ్యే సమస్యల గురించి ఆయన ప్రశ్నించారు. వన్యప్రాణుల సంరక్షణ వ్యవహారాలతో సంబంధమున్న వారందరూ సహకరిస్తారా అని ఆయన అడిగారు. అది కష్టమేగానీ అసాధ్యం కాబోదని వివరించాను. మా నివేదిక 'జాయినింగ్ ది డాట్స్' ప్రజలకు నివేదించి పులుల సంరక్షణ ఆవశ్యకతపై వారికొక స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరమున్నదని చెప్పాను. సంబంధిత విధానాలలో మార్పులకు ఇది దోహదం చేయగలదని స్పష్టం చేశాను. మా నివేదికకు, సాధారణంగా ప్రభుత్వ కమిటీల నివేదికలకు పట్టే గతే పడుతుందని భయపడ్డాను. నా భయం నిరాధార మైనదని నాకు త్వరలోనే తెలిసివచ్చింది. మా కమిటీ సిఫారసులను మన్మోహన్ ఆమోదించారు. వాటి అమలుకై సత్వర చర్యలకు ఆదేశించారు. దేశంలో పులుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పులుల జనాభా గణన పద్ధతులు బాగా మెరుగుపడ్డాయి. ఇప్పుడు చాలవరకు కాలి జాడల ఆధారంగా కాకుండా, ప్రత్యక్ష పరిశీలన ద్వారా పులుల సంఖ్యను లెక్కిస్తున్నారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ విలక్షణమైన వ్యక్తి, విభిన్నమైన రాజకీయవేత్త. విశిష్ట ప్రజా స్వామికవాది. వర్తమాన ప్రపంచంలో అటువంటి విశాల దృక్పథమున్న వ్యక్తులు, నాయకులు అరుదు. తాను ఏకీభవించని వారిని సైతం ప్రోత్సహించే ఉదారుడు మన్మోహన్. విద్వజ్జుడు అయిన మన్మోహన్‌కు వివిధ అంశాలపై పాఠ్యగ్రంథాలు, స్వీయ అనుభవాల ప్రాతిపదికన ఏర్పరచుకున్న భావాలు, అభిప్రాయాలు ఉండేవి. అయితే ఆయనలో మేధో నిజాయితీ ఉండేది. కొత్త భావాలను ఆహ్వానించేవారు. వాటి వెలుగులో తన భావాలు పరిశీలించుకుని అవసరమైతే మార్చుకునేవారు. ఇతరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు సమంజసమైనవి అయితే వాటిని అంగీకరించేందుకు సంకోచించేవారు కాదు. ఆయన మృదు స్వభావి. మూర్తీభవించిన మేధో నిజాయితీ. తన అధికారాలను పూర్తిగా ప్రజల శ్రేయస్సుకే వినియోగించిన మంచి మనిషి మన్మోహన్ సింగ్.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

చట్టబద్ధ మద్దతు ధర ఎండమావేనా?





■ యోగేంద్ర యాదవ్

వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అన్న భావనను అమలుపరచాల్సిన సమయమాసన్నమవలేదా? చట్టబద్ధ ఎమ్ఎస్‌పికై పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ గత నవంబర్ 26 నుంచి చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష ఇంకా కొనసాగుతూనే ఉన్నది. రైతుల ఉద్యమం మళ్లీ ప్రారంభమైన తరువాత వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, పశు పోషణపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఒకటి 'చట్టబద్ధంగా కట్టుబడి ఉండే' కనీస మద్దతు ధరను రైతులకు సమకూర్చాలని సిఫారసు చేసింది. కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన మద్దతు ధరకు హామీ ఇవ్వాలనే డిమాండ్‌ను పరిశీలించేందుకు సైతం నిర్ద్వంద్వంగా నిరాకరిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదే పదే 'ఎమ్ఎస్‌పి హై ఔర్ రహేగా' అంటున్నప్పటికీ ఆందోళన చేస్తున్న రైతులతో చర్చలు ప్రారంభించేందుకు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. రైతులకు కొత్త సంవత్సర కానుకగా పంటల బీమా కొనసాగింపు, ఎరువులపై రాయితీని ప్రధానమంత్రి ప్రకటించారు. కనీస మద్దతు ధరను పూర్తిగా ఉపేక్షించారు.

ఎమ్ఎస్‌పి డిమాండ్‌పై నెలకొన్న ప్రతిష్టంభన కొన సాగుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాజస్థాన్‌లో పెసర ఒక ప్రధాన ఖరీఫ్ పంట. దానికి అధికారికంగా ప్రకటించిన ఎమ్ఎస్‌పి క్వింటాల్‌కు రూ.8,682. అయితే ఆ రాష్ట్రంలోని ప్రధాన వ్యవసాయ మార్కెట్ అయిన మెర్టాలో గత డిసెంబర్‌లో దానికి లభించిన ధర రూ.6,467 మాత్రమే. రైతు తాము పండించిన పెసలను క్వింటాల్‌కు రూ.2,215 నష్టానికి విక్రయించుకోవల్సి వచ్చింది. తత్ఫలితంగా ఆ ఒక్క మార్కెట్‌లో ఒక్క నెలలో ఒక్క పంట విషయంలో రైతులు కోల్పోయిన మొత్తం ఆదాయం రూ.10 కోట్లకు పైగా ఉంటుంది. మహారాష్ట్రలోని జాల్నా మార్కెట్‌లో గత డిసెంబర్‌లో క్వింటాల్ జొన్నలకు లభించిన సగటు ధర రూ.2,456. అయితే ఆ పంట అధికారిక ఎమ్ఎస్‌పి రూ.3,371. అంటే రైతులు క్వింటాల్‌కు రూ.915 చొప్పున నష్టపోయారు. మొక్కజొన్నకు అధికారిక ఎమ్ఎస్‌పి రూ.2,225 కాగా మధ్యప్రదేశ్ మార్కెట్లలో ఆ పంటకు లభించిన ధర కేవలం రూ.1980 మాత్రమే. సోయాబీన్‌కు ప్రకటించిన ఎమ్ఎస్‌పి రూ.4,892 కాగా అక్టోబర్, డిసెంబర్‌ల మధ్య మహారాష్ట్రలో ఆ పంటకు లభించిన మార్కెట్ ధర రూ.4,076 కాగా మధ్యప్రదేశ్‌లో రూ.4,892 మాత్రమే.

కేంద్ర ప్రభుత్వం ఏటా 23 పంటలకు చాలా ఆర్భాటంగా కనీస మద్దతు ధర ప్రకటిస్తుంది. రైతులకు ప్రభుత్వం చాలా మేలు చేస్తుందని ప్రజలు విశ్వ సించేలా పాలకులు వ్యవహరిస్తారు. అయితే వాస్తవంగా రైతులకు ఆ కనీస మద్దతు ధర సమకూరేందుకు ప్రభుత్వం కనీస మాత్రంగానైనా చేస్తుంది ఏమీ లేదు! సంబంధిత పంటలకు మార్కెట్‌లో లభిస్తున్న ధర ప్రకటిత ఎమ్ఎస్‌పి కంటే తక్కువగా ఉన్నప్పుడు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు. మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉంటే 'కనీస', 'మద్దతు' అనే మాటలు అర్థరహితమైనవే. కచ్చితంగా లభిస్తుందనే హామీ లేని ఎమ్ఎస్‌పి అసలు ఎమ్ఎస్‌పినే కాదు. ప్రభుత్వం తన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలని రైతులు గట్టిగా కోరుతున్నారు. కనీస మద్దతు ధర విషయమై రైతుల డిమాండ్ చర్చకు వచ్చినప్పుడల్లా ప్రధాన స్రవంతి మీడియాలో ఆ విషయమై తీవ్ర వాదోపవాదాలు జరగడం పరిపాటి అయింది. ఎమ్ఎస్‌పి అనేది ఒక హేతు విరుద్ధ డిమాండ్ అనీ, అది ఆచరణ సాధ్యం కానిదని, ద్రవ్య సంక్షోభానికి అది దారితీస్తుందని ఎమ్ఎస్‌పి వ్యతిరేకులు గట్టిగా వాదిస్తున్నారు. వాస్తవ మేమిటి? చట్టబద్ధంగా కట్టుబడి ఉండే కనీస మద్దతు ధర తార్కికంగా సుసంగతమైనది, ఆచరణ సాధ్యమైనది. అదెలా సాధ్యమో విపులంగా చూద్దాం.

ఇంతకూ చట్టబద్ధంగా కట్టుబడి ఉండే కనీస మద్దతు ధర అంటే ఏమిటి? ప్రభుత్వం అన్ని పంటల సమస్త దిగుబడులను విధిగా కొనుగోలు చేసి తీరాలని, లేదూ, అధికారిక ఎమ్ఎస్‌పి కంటే తక్కువ ధరకు విక్రయమవుతున్న పంటల దిగుబడులను కొనుగోలు చేసి తీరాలన్న నిబంధనగా అర్థం చేసుకోకూడదు. అలా కొనుగోలు చేయడం సాధ్యమూ కాదు, అదసలు తప్పనిసరి కూడా కాదు. చట్టబద్ధంగా కట్టుబడిన ఎమ్ఎస్‌పి మౌలిక సూత్రం చాలా సరళమైనది. కనీస మద్దతు ధర అనేది రైతుల హక్కు.. అది రైతులకు లభించేలా చూడడమనేది ప్రభుత్వ శాసన విహిత బాధ్యత.

ఈ మౌలిక సూత్రంలోని ప్రధాన విషయమేమిటంటే రైతులు తమ దిగుబడులకు చట్ట బద్ధమైన ధర పొందేలా ప్రభుత్వం పూచీ వహించడం. రైతుల ఉత్పత్తులను తప్పనిసరిగా కొనుగోలు చేయడం కాదు. అదేవిధంగా పంట దిగుబడులను ఎవరు కొనుగోలు చేస్తున్నారనే దానితో నిమిత్తం లేకుండా చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను రైతులు పొందాలి, పొంది తీరాలి.

ఈ మౌలిక సూత్రాన్ని మూడు పద్ధతుల ద్వారా అమలుపరచవచ్చు: విస్తృత సేకరణ, ప్రభావశీల మార్కెట్ జోక్యం, లోటు చెల్లింపులకు హామీ. ప్రస్తుత ధాన్య సేకరణ పద్ధతులను విస్తరింప పరచాలి. వాటి లోని లోటుపాట్లను సరిదిద్దాలి. చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలను భారీ స్థాయిలో సేకరించాలి. ఆహార భద్రతా పథకాలలో వాటిని భాగం చేయాలి. దీనివల్ల ధాన్య సేకరణలో ప్రస్తుత అసమతౌల్యతను తొలగించేందుకు తోడ్పడుతుంది. రెండో పద్ధతి మార్కెట్ జోక్యాలు. ఇవి వివిధ రూపాలలో ఉండవచ్చు. ధరలు ఎమ్ఎస్‌పి కంటే తక్కువకు పడిపోతున్నప్పుడు పరిమిత స్థాయిలో కొనుగోలు చేయడం, మార్కెటింగ్ కేంద్రాలలో ఎమ్ఎస్‌పికి నిర్వహించే వేలం పాటల్లో కనిష్ఠ ధర నిర్ణయించడం, అంతర్జాతీయ వాణిజ్య విధానంలో మార్పులు చేర్పులు చేయడం గోదాంలను మెరుగుపరచడం, సన్నకారు చిన్నకారు రైతులు తమ దిగుబడులకు మంచి ధర లభించేంతవరకు వాటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు గాను రైతుల ఉత్పత్తిదారు సంఘాలను పటిష్ఠపరచడం మొదలైన చర్యలు అవశ్యం చేపట్టాలి. ఈ పద్ధతులేవీ మార్కెట్ ధరను కనీస మద్దతు ధరకు సమానస్థాయి లోను లేదా అంతకంటే హెచ్చు స్థాయిలోను ఉంచడంలో విఫలమయిన పక్షంలో ప్రభుత్వం ఎమ్ఎస్‌పికి, సగటు మార్కెట్ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విధిగా చెల్లించి తీరాలి. ఈ 'లోటు ధర చెల్లింపు' అనేది రైతుల ఎమ్ఎస్‌పి హక్కును చట్టబద్ధమైన హక్కుగా చేస్తుంది.

చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను అమలుపరి చేందుకు అవసరమైన ఆర్థిక వనరులు ప్రభుత్వానికి ఉన్నాయా? రైతులకు శాసన విహితంగా మద్దతు ధరను సమకూర్చేందుకు రూ.14 లక్షల కోట్లు అవసర మవుతాయని ఎమ్ఎస్‌పిని వ్యతిరేకిస్తున్న వాణిజ్య వర్గాలు లెక్కలు కడుతున్నాయి. ఇంత ఆర్థిక భారం దృష్ట్యా చట్టబద్ధ ఎమ్ఎస్‌పి ఒక హాస్యాస్పద, అసాధ్య డిమాండ్ అని ఆ వర్గాలు ఘోషిస్తున్నాయి. ఇది ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవపట్టించే ప్రయత్నమే, సందేహం లేదు. ఎమ్ఎస్‌పి వర్తించే ప్రతి పంట దిగుబడుల్లో ప్రతి క్వింటాల్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయవలసిన అవసరముందని భావించి వేసిన అంచనాలవి. మనం ముందే చూసినట్టు ప్రతి పంట దిగుబడిని ఎటువంటి మినహాయింపు లేకుండా కొనుగోలు చేసి తీరాలన్నది రైతుల డిమాండ్‌లో భాగం కానేకాదు. అంతే కాక మరో వాస్తవాన్ని కూడా పరిగణ నలోకి తీసుకోవాలి: ప్రభుత్వం పంట దిగుబడులను కొనుగోలుకు ఇచ్చిన నిర్దిష్ట ధర, కొన్న పంటను విక్రయిం చిన ధరకు మధ్య ఉన్న వ్యత్యాసం ఎంత ఉన్నదనేదే ఎమ్ఎస్‌పిని అమలు పరిచేందుకు ప్రభుత్వానికి వాస్తవంగా అయ్యే వ్యయంగా పరిగణించాలి. అన్ని వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో సహాయక జోక్యం అవసరం ఉండదు; మార్కెట్ ధర ఎమ్ఎస్‌పి కంటే తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే రైతుకు న్యాయం చేసేందుకు ప్రభుత్వ జోక్యం అవసరమవు తుంది. నిజానికి అది తప్పనిసరి కూడా.

15 ప్రధాన పంటలకు (ఎమ్ఎస్‌పిని ప్రకటించిన పంటల మొత్తం విలువలో వీటి వాటా 95 శాతానికి పైగా ఉంటుంది) 2022–23 మార్కెటింగ్ సంవత్సరంలో చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను సమకూర్చేందుకు అయ్యే వ్యయాన్ని మేము లెక్కకట్టాము: ప్రకటిత ఎమ్ఎస్‌పి కంటే తక్కువ ధరకు విక్రయమైన అన్ని పంటలకు సంబంధించిన మొత్తం లోటు రూ. 26,469 కోట్లు. ఇది, పాక్షిక వ్యయం భావన ప్రాతిపదికన ప్రభుత్వం ప్రకటించిన ఎమ్ఎస్‌పి రేట్ల ప్రకారం నిర్ధారిత మైన లోటు. రైతులు డిమాండ్ చేస్తున్న ఎమ్ఎస్‌పి (లేదా స్వామినాథన్ సిఫారసు చేసిన ఎమ్ఎస్‌పి)ని కూడా పరిగణనలోకి తీసుకుని కూడా లెక్కలు కట్టాం. సమగ్ర వ్యయం ప్రాతిపదికన కట్టిన లెక్కల ప్రకారం ఈ లోటు రూ. 2,00,710 కోట్లుగా ఉన్నది. సకాలంలో మార్కెట్ జోక్యంతో పాటు పైన ప్రస్తావిత ఇతర చర్యలు అన్నీ తీసుకున్న పక్షంలో మార్కెట్ ధరలు వాటికవే కనీస మద్దతు ధరకు దగ్గరగా ఉంటాయి. తద్వారా ప్రస్తావిత లోట్లు గణనీయంగా తక్కువ స్థాయిలో ఉండేందుకు అవకాశమున్నది.

ప్రస్తుత ధరల ప్రకారం చట్టబద్ధంగా వాగ్దానం చేసిన కనీస మద్దతు ధరను సమకూర్చేందుకు అయ్యే వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 0.5 శాతంగా ఉంటుంది. రైతులు డిమాండ్ చేసే అధిక ధరలు పరిగణనలోకి తీసుకున్నా సంబంధిత మొత్తం వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 4.2 శాతంగా, స్థూల దేశీయోత్పత్తిలో 0.6 శాతంగా ఉండగలదు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించినప్పుడు వారి కొనుగోలు సామర్థ్యం మరింతగా పెరుగుతుంది. ఈ అదనపు కొనుగోలు సామర్థ్యం ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు విశేషంగా దోహదం చేస్తుంది. ఈ దృష్ట్యా చట్టబద్ధ కనీస మద్దతు ధర సమకూర్చేందుకు అయ్యే వ్యయం పూర్తిగా సమర్థనీయమైనది. పైగా న్యాయసమ్మత మైనది. మరి రైతులోకానికి అటువంటి ఆర్థిక చేయూత నివ్వాలి. ఇందుకు రాజకీయ సంకల్పం అవసరం. మన దేశ పాలకులలో అది కొరవడిందని మరి చెప్పనవసరం లేదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

(కవితా కురుగంటి, విస్సా కిరణ్‌కుమార్ సహకారంతో)

> చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను సమకూర్చేందుకు అయ్యే వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 0.5 శాతంగా ఉంటుంది. రైతులు డిమాండ్ చేసే అధిక ధరలు పరిగణనలోకి తీసుకున్నా సంబంధిత మొత్తం వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 4.2 శాతంగా, స్థూల దేశీయోత్పత్తిలో 0.6 శాతంగా ఉండగలదు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కుటుంబాలకు ఈ మేరకు ఆర్థిక సహాయాన్ని సమకూర్చినప్పుడు వారి కొనుగోలు సామర్థ్యం మరింతగా పెరుగుతుంది. ఈ దృష్ట్యా చట్టబద్ధ కనీస మద్దతు ధర సమకూర్చేందుకు అయ్యే వ్యయం పూర్తిగా సమర్థనీయమైనది.

'నిమ్మల' సమాధానం చెబుతారా?

గాలేరు – నగరి సుజల స్రవంతి (జి.ఎన్.ఎస్.ఎస్), హంద్రీ–నీవా సుజల స్రవంతి (హెచ్.ఎన్.ఎస్.ఎస్), ప్రాజెక్టుల అనుసంధాన పథకం ఒక అక్రమ ప్రాజెక్టు కాదా! దాని ద్వారా జగన్, పెద్దిరెడ్డి అక్రమార్జనకు పాల్పడ్డారా, లేదా?; ఈ పథకంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే విధించిందా, లేదా?; నాడు చంద్రబాబు నాయుడుపై అంగళ్ళ వద్ద రాళ్ళ దాడి ఎందుకు జరిగింది?

గాలేరు–నగరి, హంద్రీ–నీవా ప్రాజెక్టుల అనుసంధాన పథకంగా చెప్ప బడే ఒక అక్రమ పథకంపై కూటమి ప్రభుత్వానికి ఉన్న మక్కువ ఎన్టీఆర్ మానస పుత్రిక గాలేరు–నగరి సుజల స్రవంతి, 2,25,000 ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టు ఉన్న రెండవ దశ నిర్మాణంపై ఎందుకు లేదు? దాన్ని ఎందుకు అటకెక్కించారు? దాన్ని సత్వరం నిర్మిస్తామని రాజంపేట ఎన్నికల సభలో చంద్రబాబు నాయుడు వాగ్దానం చేశారా, లేదా? ఈ ప్రశ్నలకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.

– టి.లక్ష్మీనారాయణ
ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక

'మైసిన్' మందుల మాంత్రికుడు 'యల్లాప్రగడ'

బహుళ ప్రజాదరణ పొందిన టెట్రా'మైసిన్' మందును కనుగొన్నది మన తెలుగువాడయిన డా. యల్లాప్రగడ సుబ్బారావు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 1895, జనవరి 12న నిరుపేద సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యంలో అనేక కష్టాలను అధిగమించి చదువుకుని, విదేశీ వైద్య పరిశోధనల నిమిత్తం కాకినాడ 'సత్యలింగం నాయికర్ ట్రస్ట్' వారి ఉపకార వేతనం పొందారు. అమెరికాలో రాత్రీ పగలు కష్టపడుతూ తన ప్రతిభా పాటవాలతో 'స్కాలర్‌షిప్'లు సంపాదిస్తూ వైద్య పరిశోధ నలు కొనసాగించారు.



1922లో నోబెల్ బహుమతి అందుకున్న సిద్ధాంతాన్ని సుబ్బారావు పరిశోధనాత్మకంగా పరిశీలించి, అర్థవంతంగా లేదని రుజువు చేశారు. ఆ సిద్ధాంతంపైనే మళ్లీ పరిశోధన సాగించి, దిగ్భ్రాంతి గొలిపేలా సరికొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆ సిద్ధాంతమే 'డా. ఫిస్కే–సుబ్బారావు మెథడ్'గా నేటి వైద్య కళాశాలల్లో పాఠ్యాంశంగా ఉంది. ఇది ప్రపంచ వైద్య పరిశోధనా రంగంలో ఒక అనూహ్యమైన చారిత్రాత్మక సంఘటన.

'న్యారోస్పెక్ట్రమ్ యాంటి బయాటిక్స్– పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్ వంటి మందులు కనుగొన్న వారికి నోబెల్ బహుమతులు లభించాయి. కానీ వాటికన్నా శ్రేష్ఠమైన, ప్రపంచంలో తొలి బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటి బయాటిక్ టెట్రా'మైసిన్' మాతృక టెట్రా'సైక్లిన్' మందును కనుగొన్న డా. యల్లాప్రగడకు నోబెల్ బహుమతి ఇవ్వకపోవడం శోచనీయం. అయితే నోబెల్ బహుమతిని ఎంపిక చేసే 'స్టాక్‌హోమ్' నగరంలోని వారి ప్రధాన కార్యాలయంలో సుబ్బారావు తైలవర్ణ చిత్రం దర్శనమిస్తుంది. బహుశా నోబెల్ బహుమతి ఇవ్వనందుకు ప్రాయశ్చిత్తంగా ఆ చిత్రాన్ని అక్కడ ఉంచారేమో!

గతంలో ప్లేగు మహమ్మారి ప్రపంచ మానవాళిని చుట్టపెట్టి నప్పుడు టెట్రామైసిన్ మందు ప్రాణరక్షక ఔషధంగా కాపాడింది. ఇటీవల భూగోళాన్ని భయభ్రాంతులకు గురిచేసిన కరోనా వ్యాధిని డాక్స్'సైక్లిన్', అజిత్రో'మైసిన్' వంటి మందులు కీలకపాత్ర వహించి ప్రజలను కాపాడాయి. ఈ మందుల సృష్టికర్త డా. యల్లాప్రగడ సుబ్బారావు. ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్‌కి కీమోథెరపిలో తొలితరం ఔషధం మెథాట్రాక్సిన్ మందును, క్షయ వ్యాధికి 'ఐసోనెక్స్', బోదకాలు, ఐస్నోఫీలియాకు హెట్రజన్ మందును ఆయన కనుగొన్నారు.

ప్రపంచ మానవాళిని గడగడలాడించిన ప్రాణాంతక ఉష్ణమండల–'స్ప్రూ' వ్యాధికి దివ్యౌషధం 'ఫోలిక్ ఆసిడ్' పోషకాన్ని డా. యల్లాప్రగడ 1945 జూలై 20న కనుగొన్నారు. తద్వారా ఆ వ్యాధి కోరలు ఊడబెరికి భూగోళం నుండి పారద్రోలారు. ఈ స్ప్రూ వ్యాధి ఒకటి ఉన్నదని నేటి తరం వారికి అసలు తెలియనే తెలియదు. తన సోదరుని మరణానికి కారణమైన ఈ వ్యాధికి కనిపెట్టిన ఆనాటి 'ఫోలిక్ ఆసిడ్–పోషక విటమిన్' ఈ రోజు గర్భిణులకు సంజీవని లాగాను, పుట్టబోయే బిడ్డల ఆరోగ్యానికి 'వెన్ను' దన్నుగాను పనిచేస్తున్నది. అంతేగాక క్యాన్సర్, గుండెజబ్బులు, మానసిక వ్యాధులు, పక్షవాతం మొదలైన వాటిని నియంత్రించడంలో 'కల్పతరువులా–యాంటి ఆక్సి డెంట్'గా ఉపయోగపడుతోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంటే ఆయన వైద్య పరిశోధనా ఫలితాలు ఎంతటి మహత్తరమైనవో కదా!

కనుగొన్న స్వల్పకాలానికే నిరుపయోగమవుతున్న మందులున్న ఈ రోజుల్లో కూడా డా. యల్లాప్రగడ కనుగొన్న ఆనాటి మందులు బహుళ ప్రయోజన ఔషధాలుగా పనిచేస్తున్నాయి. తాను కనుగొన్న మందుల ద్వారా ప్రపంచ మానవాళికి ఒక 'శాశ్వత ఆరోగ్యకవచం' అందించిన క్రాంతదర్శి అపర ధన్వంతరి డా. యల్లాప్రగడ సుబ్బారావు. మనకు చరిత్ర తెలియక నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు అన్నీ విదేశీయులు, ఇంగ్లీషు శాస్త్రవేత్తలు కనిపెట్టినవే అనుకుంటున్నాం. ఇప్పుడున్న మందుల షాపుల్లో స్థిరమైన మందులు ఎక్కువగా మన తెలుగువాడు డా. సుబ్బారావు కనిపెట్టినవే!

గతంలో డా. సుబ్బారావు అమెరికా వెళ్లి తిరిగి రాలేదని కొందరు భావించారన్న వార్తలు వినవచ్చాయి. 1948లో అమెరికా నుంచి ఒక సారి స్వదేశం వచ్చిన ఆయన మద్రాస్ మెడికల్ కాలేజీలో ఒక వైద్య సదస్సులో పాల్గొన్నారు. ఆ సభలో తాను తిరిగి రావడంలో 'డా. లక్ష్మీపతి ఆయుర్వేద వైద్య కళాశాలలో 'అనాటమీ లెక్చరర్'గా పనిచేసి, ఆయు ర్వేదంపై అధ్యయనం చేసి, ఆ అనుభవంతో 'ప్రాచీన ఆయుర్వేదం పునాదిపై ఆధునిక అల్లోపతి వైద్యశాస్త్ర సమన్వయంతో నా వైద్య పరి శోధనలలో సత్ఫలితాలు సాధించాను' అని తెలియజేశారు. కాబట్టి మన దేశంలో ఆయుర్వేదం, అల్లోపతి–ఆంగ్లవైద్యం సమన్వయంతో 'ఇంటిగ్రేటెడ్ మెడికల్ కాలేజీ' ఏర్పాటు చేయాలని, 'క్యాన్సర్ పరిశోధన హాస్పిటల్' ఏర్పాటుచేసి ప్రజలకు తన వైద్యసేవలు అందించాలని' ఆనాటి సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన తెలిపినట్లు కథనం ఉంది.

డా. యల్లాప్రగడ సుబ్బారావు 1948 ఆగస్టు 9న నిద్రలోనే గుండె జబ్బుతో కన్నుమూశారు. ఆయన కనిపెట్టిన ఆరామమైసిన్ దివ్యౌషధాలు ప్రపంచ మానవాళి శ్వాసలో శాశ్వతంగా నిలిచి పోతాయి. భావితరాలకు వీరి జీవిత చరిత్రను అందించడానికి ప్రభుత్వం ఒక పరిశోధన కమిటీని ఏర్పాటు చేయాలి.


ఇంతటి సాటిలేని ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త పేరును ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఖరారు చేయడం ముదావహం. డా. యల్లాప్రగడ సుబ్బారావు స్మారక అవార్డులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి. ఆయన జీవిత చరిత్రను అన్ని ప్రాంతీయ భాషల విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. తద్వారా విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించాలి.

• డా. ఎస్. శ్రీనివాస్
యల్లాప్రగడ శతజయంతి స్మారక పురస్కార గ్రహీత, బాపట్ల

(జనవరి 12: యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి)

మండే అక్షరాలు ఆయన కవితలు!

పల్లెల్లో జనం మాట్లాడే మాటలను కవిత్వం చేసి బయటకు విసిరిన విలుకాడు మద్దూరి. ఏ కవిత్వం రాసినా తన అలగాజనం కోసమే. అక్షరాలు పల్లె జనం తినే గొడ్డుకారపు ముద్దలా భగభగ మండుతుంటాయి. తెలుగు సాహిత్యం ఒక్కసారిగా మద్దూరి వైపు చూడ టానికి కారణం ఆయన కవిత్వం సూటిగా, వాడిగా ఉండటమే. కవిత్వంలో తన జాతి బతుకులను కళ్ళకు కట్టి చూపెట్టిన కవి నగేష్ బాబు. అందుకే మద్దూరి నగేష్ కవిత్వం ఇంకా ప్రజల్లో చిరస్థాయిగా ఉంది.




అతను రాసిన ప్రతి కవిత దళితుల బతుకులను చూపె డుతూ, వెలివేయబడిన జనాల గుండెలోతుల్లో కసు క్కున దిగబడుతుంది, కుల వ్యవస్థను సమర్థించే వారి గుండెల్లో గునపంలా దిగబడుతుంది. నగేష్ కవిత్వం రాసిన తరువాత తెలుగు సాహిత్యంలో దళిత సాను భూతి కవులు బయటకొచ్చారు. మిరేపూట్లు, వెలివాడ, రచ్చబండ, నరలోక ప్రార్థన, గోదావరి, లోయ, పట్ట కవితా సంపుటాలు మద్దూరి నగేష్ బాబు కలం నుంచి లావాలా బయటకు వచ్చాయి. మద్దూరి కథలు కూడా సంచలనంగా ఉంటాయి. తక్కువ వయస్సులో చనిపో యినా, తన తరంలో ఒక స్ఫూర్తి నింపి, రాబోయే తరా లకు తన కవిత్వం ద్వారా దిక్సూచిలా మారాడు మద్దూరి నగేష్ బాబు. ఆయన తన కవిత్వంతో నిత్యం పొద్దు పొడిచే సూర్యుడులా వెలుగొందుతున్నాడు. తన దళిత జనాల కవిత్వం నల్లజెండా ఎగరేసిన మద్దూరి నగేష్ బాబు 1964 ఆగస్టు 15న జన్మించాడు.

– తంగిరాల సోని

(నేడు మద్దూరి నగేష్‌బాబు 20వ వర్ధంతి)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
శుక్రవారం 10 జనవరి 2025







● విజ్ఞాన వీచిక

- పుస్తక మహోత్సవానికి సందర్శకుల రద్దీ
- భారీగా వస్తున్న పాఠశాలల విద్యార్థులు

4లో



● వైకుంఠ వేడుక

- నేటి ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు
- ముస్తాబైన వైష్ణవాలయాలు

4లో





● కల్యాణ వేదిక

ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం నేతృత్వంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల గ్రౌండ్స్‌లో గురువారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకకు హాజరైన భక్తులకు చినజీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఫిబ్రవరి మొదటివారంలో సీతానగరంలోని విజయకీలాద్రిపై 35 అడుగుల ఆంజనేయస్వామి ఏకశిలావిగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు.

4లో

అయ్యో తల్లీ..

- ఎనికేపాడు వద్ద రోడ్డు ప్రమాదం
- ఐదు నెలల గర్భిణీ దుర్మరణం

ప్రసాదంపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : 'అమ్మా..' అనే మాట కోసం ఆమె ఎంతో ఆరాటపడింది. మరో నాలుగు నెలల్లో ఊపిరిపోసుకోనున్న కన్నపేగు కోసం ఆశగా ఎదురుచూసింది. విధి ఎంత బలీయమైందో.. ఆమె కలలను కల్లలు చేసింది. తల్లి సహా గర్భస్థ శిశువునూ బలితీసుకుంది. హృదయవిదారకమైన ఈ ఘటన ఎనికేపాడు జంక్షన్ వద్ద గురువారం జరిగింది. పటమట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎనికేపాడుకు చెందిన యర్రంశెట్టి సుష్మ (20)కు చీమలపాడుకు చెందిన గుర్రం సతీష్‌కుమార్‌తో గత మార్చిలో వివాహమైంది. సతీష్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో 5 రోజుల క్రితం సుష్మ ఎనికేపాడులోని పుట్టింటికి వచ్చింది. పండుగ సమీపించడంతో సుష్మాను చీమలపాడు తీసుకెళ్లడానికి మామ శ్రీనివాసరావు గురువారం ఎనికేపాడుకు వచ్చారు. మధ్యాహ్న సమయంలో ద్విచక్రవాహనంపై ఎనికేపాడు జెండా సెంటర్ నుంచి రామవరప్పాడు వైపు వెళ్లడానికి జంక్షన్ వద్ద వారు ఆగారు. అదే సమయంలో రామవరప్పాడు నుంచి కానూరు వంద అడుగుల రోడ్డు వైపు వెళ్లేందుకు టిప్పర్ లారీ జంక్షన్ వద్ద ఆగింది. యూటర్న్ తీసుకునేటప్పుడు లారీ ముందు చక్రం శ్రీనివాసరావు నడుపుతున్న ద్విచక్రవాహనానికి తగలడంతో వాహనంపై ఉన్న సుష్మ వెనుక చక్రాల కింద పడిపోయింది. సుష్మ చేతిపైకి లారీ చక్రాలు ఎక్కడంతో చేయి నుజ్జునుజ్జైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో సుష్మ అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీనివాసరావు ఎడమ కాలు విరిగింది. స్థానికులు అంబులెన్స్ సాయంతో క్షతగాత్రుడిని కొత్త ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలిని మార్చురీకి తరలించామని సీఐ వల్లభనేని పవన్‌కిషోర్ తెలిపారు. టిప్పర్ లారీడ్రైవర్, లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



సుష్మ (ఫైల్)

బియ్యం కేసులో ముగ్గురికి రెండు రోజుల కస్టడీ

మచిలీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి పేర్ని నానికి చెందిన గోడౌన్‌లో సీఎంఆర్ బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతి ఇస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గోడౌన్ మేనేజర్ మానసతేజ, మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీడ్రైవర్ బొట్ల మంగారావును రెండు రోజులు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించనున్నారు. మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముగ్గురు నిందితులను పోలీస్ కస్టడీకి ఇస్తూ న్యాయమూర్తి అనుమతి ఇవ్వగా, ఏడు గంటల విచారణ అనంతరం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేశారు.

రద్దీవేళ.. రద్దుల పర్వం

- విజయవాడ-విశాఖ మార్గంలో నాలుగు రైళ్ల రద్దు
- పండగ ముందు రైల్వే నిర్వాకం

6లో

ఆర్టీసీ ఫుల్

పండుగ ముందు, తర్వాత వందశాతం బుకింగ్

- 11, 12, 13, 16, 17, 18, 19 తేదీలకు డిమాండ్
- టికెట్ బుక్ చేసుకోని వారికి ప్రయాణం కష్టమే
- తిరుగు ప్రయాణ టికెట్లు కూడా ఫుల్
- ఈనెల 20 నుంచి మాత్రమే అందుబాటులో టికెట్లు



పీఎన్‌బీఎస్‌లో ప్రయాణికులు

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. పండుగ ముందు, తర్వాత కూడా వందశాతం బుకింగ్ పూర్తయింది. శనివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకూ బస్సులేవీ ఖాళీ లేకపోవడంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే ప్రయాణికుల పరిస్థితి సందిగ్ధంలో పడింది. చాలామంది క్యాబ్‌లు, ప్రైవేట్ బస్సులవైపు చూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సంక్రాంతి ప్రయాణాలకు ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరికే పరిస్థితి లేకుండాపోయింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చే బస్సులన్నీ హౌస్‌ఫుల్ అయిపోయాయి. ఈ రూట్‌లోని మన బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్ పూర్తైపోయింది. షెడ్యూల్ బస్సుల్లో అయితే రెండు వారాల కిందటే రిజర్వేషన్ అయిపోయింది. ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులకు రిజర్వేషన్ ప్రారంభించిన వెంటనే 80 శాతం బుకింగ్ జరిగిపోవడం విశేషం. రెండు రోజుల కిందట మిగిలిన 20 శాతం సీట్లు కూడా బుక్ అయిపోయాయి. హైదరాబాద్ నుంచి వచ్చే తెలంగాణ బస్సుల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. దీంతో అక్కడి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ అధికారులు మరిన్ని స్పెషల్స్ నడిపేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు సొంతూర్లకు రావటం కోసం బస్సులు బుక్ చేసుకోని వారెవరైనా ఉంటే వారికి సీటు దొరకటం దుర్లభమే అవుతుంది. తెలంగాణ ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులు నడిపితే తప్ప సీటు దొరికే పరిస్థితి ఉండదు. ఇప్పటికే టీఎస్‌ఆర్టీసీ అధికారులు పెద్ద ఎత్తున స్పెషల్ ఆపరేషన్ చేపట్టినా బస్సులు చాలట్లేదు. పండక్కి ముందు అంటే.. శని, ఆదివారాల్లో హైదరాబాద్ నుంచి బస్సు దొరకటం గగనమే. ఇలాంటి వారంతా 33 సొంత వాహనాల్లో కానీ, క్యాబ్‌లలో కానీ రావాల్సిందే. ఇప్పటికే షెడ్యూల్ బస్సులతో పాటు స్పెషల్ బస్సులన్నీ నిండిపోయాయి. దీనిని బట్టి చూస్తే తిరుగు ప్రయాణం కూడా కష్టంగా ఉండబోతోంది. ఈనెల 16 నుంచి 19 వరకు సీటు దొరికే పరిస్థితి లేదు. తిరుగు ప్రయాణాలు చేసుకునే వారికి 20వ తేదీ నుంచి మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రయాణం.. ప్రయాస

- దుర్లభంగా మారిన పండుగ ప్రయాణం
- డిమాండ్‌కు తగినంతగా ఆర్టీసీ బస్సులు నిల్
- దసరాలో ఇబ్బందులుపడిన ప్రయాణికులు
- గత సంక్రాంతి పరిస్థితి కూడా అంతే..
- రోజుకు 3 లక్షల మంది వచ్చే అవకాశం
- బస్సులు, రైళ్లు, విమానాల్లో 2 లక్షల్లోపు సామర్థ్యమే
- సొంత వాహనాలు, క్యాబ్‌ల్లో వచ్చే వారికి కష్టాలు
- జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు

4లో



పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు

హైటెక్ బరులు రెడీ

జిల్లాలో కోడి పందేల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు

6



నచ్చినవారు వచ్చేవరకు రద్దే..!

ఇరిగేషన్ పనుల్లో ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం

- గుడివాడ, పామర్రు ఇరిగేషన్, డ్రెయినేజీ టెండర్లు రద్దు
- ఎమ్మెల్యేల జోక్యంలేని చోట్ల పనులు షురూ
- కొన్ని నియోజకవర్గాల్లో 39 శాతం లెస్‌కు టెండర్లు

నీటిపారుదల శాఖలో టెండర్లంటే కాసుల వర్షమే. కాల్వల్లో పూడికతీత, వాటి నిర్వహణ వంటి పనుల్లో భారీగా డబ్బు విగులుతుండటంతో టెండర్లను దక్కించుకునేందుకు విపరీతమైన పోటీ ఏర్పడింది. అయితే, తమకు కమీషన్లు ఇచ్చేవారికి.. తమకు అనుకూలురుకు ఈ టెండర్లను కట్టబెట్టేందుకు ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో చేసేది లేక అధికారులు ప్రతిసారీ టెండర్లను రద్దు చేసేస్తున్నారు. వైసీపీ హయాంలోని ఈ జాడ్యాన్ని కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులూ కొనసాగిస్తుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



నందివాడ దగ్గర నీటిపారుదల శాఖ కాల్వ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గత ఏడాది నవంబరులో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గుడివాడ డివిజన్ పరిధిలో ఉన్న నాలుగు సెక్షన్లలో రూ.5.74 కోట్లతో 29 పనులకు టెండర్లను పిలిచారు. గత ఏడాది నవంబరు 11న పిలిచి 25న తెరిచేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. రాజకీయ ఒత్తిళ్లతో నవంబరు 25న కాకుండా డిసెంబరు 2వ తేదీ వరకు టెండరు దాఖలకు సమయాన్ని పొడిగించారు. తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు రావడంతో డిసెంబరు 7న వాటిని రద్దు చేశారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో రూ.3.84 కోట్లతో 26 పనులు చేపట్టేందుకు నవంబరు 11న టెండర్లు పిలిచారు. వీటిని డిసెంబరు 9న రద్దు చేశారు. ఆ తర్వాత మళ్లీ టెండర్లు పిలిచారు. డిసెంబరు 30న వీటిని తెరవాల్సి ఉంది. కానీ, కొన్ని నియోజకవర్గాల పరిధిలోని టెండర్లను మాత్రమే ఓకే చేసి.. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని టెండర్లను మళ్లీ రద్దు చేస్తున్నట్లు గురువారం అధికారులు ప్రకటించారు.

అయినవారి కోసమే..

నీటిపారుదల శాఖలో పనుల్లో 'గిట్టుబాటు' ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ఈ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున పోటీ పడుతుంటారు. అదే స్థాయిలో లెస్‌కూ టెండర్లు వేస్తుంటారు. ఉదాహరణకు.. వెంట్రప్రగడ సెక్షన్‌లో దోసపాడు చానెల్‌ను సుమారు 4.5 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేసి నిర్వహించేందుకు రూ.19.18 లక్షలతో టెండర్ పిలవగా, 32 శాతం లెస్‌కు రూ.13.47 లక్షలకే పనులు చేస్తామని కాంట్రాక్టర్ టెండర్ వేశారు. అలాగే, ఆత్కూరు యూటీ మీడియం డ్రెయిన్ మరమ్మతులు, నిర్వహణకు రూ.25.49 లక్షలతో పనులు పిలవగా, సుమారు 39 శాతం

మిగతా 4లో..



గ్రంథాలయాల పునరుజ్జీవనానికి ఉద్యమించాలి

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల పునరుజ్జీవనానికి పౌరులు ఉద్యమించాలని, దీనికోసం పౌరుల ఉద్యమించాలని, తెలుగువారిలో భాషా సంస్కృతి, చైతన్యాన్ని పునరుజ్జీవింపజేయడానికి గ్రంథాలయ ఉద్యమం తప్పనిసరని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో గురువారం రామోజీరావు సాహితీ వేదికపై గ్రంథాలయ పునర్వికాస సదస్సు నిర్వహించారు. తెలుగు జాతి చైతన్యానికి, తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటానికి గ్రంథాలయ ఉద్యమమే కారణమని చెప్పారు. పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందింపజేసే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. పుస్తకాలు చదివించడం విద్యావిధానంలో భాగం కావాలని ఆకాంక్షించారు. నేటితరం పిల్లలు తెలుగు చదవలేకపోవడం విషాదకరమన్నారు. దేవాలయాల వ్యవస్థకు, గ్రంథాలయ వ్యవస్థకు ప్రభుత్వాలు న్యాయం చేయలేకపోతున్నాయని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయాలకు స్వయం సమృద్ధి కల్పించేందుకు చదువరులు ఉద్యమించాలని, ప్రభుత్వాలను నిలదీయాలని ఆయన ఆకాంక్షించారు. కొత్త రాష్ట్రంలో జాతికి గర్వకారణమయ్యే రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షుడు ఎస్.వెంకటనారాయణ మాట్లాడుతూ, గ్రంథాలయ వ్యవస్థ నిర్వీర్యం అయిపోవడం సమాజానికి మంచిది కాదన్నారు. సాహిత్య అకాడమి సభ్యుడు ఎమెస్కో విజయకుమార్ మాట్లాడుతూ, సమాజానికి గ్రంథాలయాల అవసరముందని ఆలోచనాపరులంతా కలసి నిరూపించాల్సిన తరుణం ఆసన్నమయ్యిందన్నారు. సమాజంలో పుస్తక పాఠకులున్నారని నిరూపిస్తేనే రాజకీయ వ్యవస్థ గ్రంథాలయాల పునర్వికాసానికి మద్దతునిస్తుందన్నారు. సాంప్రదాయిక ప్రచురణరంగానికి రచయితల మీద పట్టు తగ్గిపోయిందన్నారు. దీనివల్ల రచయితల్లో ఐక్యమత్యం తగ్గిందన్నారు. వీటన్నిటి వల్ల ప్రభుత్వాల మీద వత్తిడి చేసే వ్యవస్థలు ఏర్పడలేదన్నారు. వివిధ రంగాలతో తెలుగు ప్రచురణరంగానికి అనుబంధం తగ్గిపోతోందన్నారు. చదువరులంతా కలిసి వ్యవస్థల మీద ఒత్తిడి తెచ్చేలా ప్రజాగళాన్ని చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. తప్పుల్లేకుండా తెలుగు రాయగల సమూహాలను వృద్ధి చేయాలని ఆకాంక్షించారు. వికీపీడియా కార్యకర్త రెహ్మాన్ మాట్లాడుతూ, గ్రంథాలయాలను ఎలా వినియోగించుకోవాలన్న అవగాహన నేటితరానికి కరువయ్యిందన్నారు. అందువల్లే అవి క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయన్నారు. గ్రంథాలయాలను సాంస్కృతిక కేంద్రాలుగా, సామాజిక కార్యక్రమాలకు కూడళ్లుగా మార్చాలన్నారు. ఆధునిక పరిస్థితులకు తగినట్టు గ్రంథాలయాల చట్టానికి మార్పులు చేయాలన్నారు. సాంకేతిక సౌకర్యాలను వాడి అంతర్జాలంలోని సమాచారం అందరికీ అందుబాటులోకి తేవాలన్నారు. క్రియేటివ్ కామన్స్ శ్రీపతి మాట్లాడుతూ, పుస్తకాలకు సంబంధించి కాపీరైట్స్‌ను సరళీకరించాలని ఆకాంక్షించారు. మనసు ఫౌండేషన్ బాధ్యుడు మన్నెం రాయుడు మాట్లాడుతూ, పఠనాసక్తి తగ్గిపోవడం గ్రంథాలయాల సమస్యకు మూలకారణమన్నారు. వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో మౌలిక వసతి, సౌకర్యాల లేమి పాఠకులు వారికి దూరం అయ్యేలా చేస్తోందన్నారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును పూర్తిగా గ్రంథాలయాల అభివృద్ధికే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాశక్తి లక్ష్మయ్య, విశాలాంధ్ర మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

పోరాట యోధుడు చలం



నవలలు ఆవిష్కరిస్తున్న రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మి

విజయవాడ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పోరాట యోధుడు చలం సమాజం అరసికత మీద అనుక్షణం పోరాడాడని ప్రముఖ రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మి అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవం గురువారం గుడిపాటి వెంకట చలం రచించిన అమీనా, వివాహం, అరుణ, దైవమిచ్చిన భార్య నవలలను ఆమె ఆవిష్కరించారు. ఆయన మాటలు కుంచెం, కత్తి, తుఫానులాంటి మాటలతో సమాజాన్ని మార్చేందుకు ప్రయత్నించాడని చెప్పారు. ఆయన రచనలు చదువుతుంటే శరీరంలోకి కొత్త నెత్తురు ఎక్కుతున్నట్లు ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ సమాజానికి చలం రచనలు ఎప్పటికీ అవసరమేనన్నారు. చలం జీవితంలో ఒక రకమైన సమస్యకో, ఒక రంగానికో పరిమితమైనవాడు కాదన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ చలం రచనలను అధ్యయనం చేయడం, వాటి గురించి మాట్లాడుకోవడం ఒక ఉత్తేజకరమైన కార్యక్రమమన్నారు. రచయిత్రి గోటేటి లలితాశేఖర్ సభలో పాల్గొన్నారు.

విశ్వం అధ్యయనం ఆసక్తికరం

విజయవాడ కల్చరల్ : విశ్వం అధ్యయనం ఆసక్తికరమని, భూమిచుట్టూ ఆవరించుకుని దానికి ఆలంబనగా నిలిచిన అంతరిక్షాన్ని, దానితో కూడిన విశ్వాన్ని అధ్యయనం చేయడం, ఆదిమానవుడి నుంచి నేటి వరకూ చాలా ఆసక్తికరమైన విషయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవం గురువారం గంటా సత్యకుమార్ రచించిన 'విశ్వం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. విశ్వం, అంతరిక్షంపై నేటి తరానికి దగ్గర చేయడానికి, మూఢనమ్మకాలను దూరం చేయడానికి ఈ రచన ఉపయోగపడుతుందన్నారు. సృజనాత్మకత, సాంస్కృతిక సమితి అధ్యక్షురాలు తేజస్విని మాట్లాడుతూ విద్యార్థులకు ఖగోళం, విశ్వంపై ఆసక్తి కలిగించి సైంటిస్టులయ్యేలా చేస్తుందన్నారు. విశ్రాంత అధ్యాపకుడు గుమ్మా సాంబశివరావు పుస్తకాన్ని పరిచయం చేస్తూ విశాల విశ్వానికి సంబంధించిన ఖగోళ వివరాలను సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా ఈ రచన సాగిందన్నారు. తెలుగు అధ్యాపకుడు కప్పగంతు రామకృష్ణ, గోళ్ల నారాయణరావు, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు రేగుళ్ల మల్లికార్జునరావు, విశ్రాంత అధ్యాపకుడు గంటా రామప్రసాద్ పాల్గొన్నారు.

3డీ పుస్తకాలొచ్చేశాయ్..



విజయవాడ సిటీలైఫ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : 3డీ.. ఎక్కువగా ఇంగ్లీష్ సినిమాల్లో వినిపించే పదం. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించడానికి థియేటర్లలో ప్రత్యేకంగా 3డీ కళ్లజోళ్లు ఇస్తారు. తెరపై కనిపించే బొమ్మ ప్రేక్షకుల కళ్లెదుటే కదులుతున్న అనుభూతి కలుగుతుంది. ఇలాంటి చిత్రాలను చిన్నారులు బాగా ఇష్టపడతారు. సినిమాల్లో 3డీ అనుభూతిని ఇప్పుడు పుస్తకాల్లో చూపిస్తున్నారు ప్రచురణకర్తలు. పిల్లల కోసం ప్రత్యేకంగా 3డీ పుస్తకాలు ముద్రిస్తున్నారు. పుస్తకాలను చూసేందుకు వాటితోపాటు ఒక కళ్లజోడును ఇస్తున్నారు. ఈ 3డీ పుస్తకాలు స్టాల్ నంబర్ 36లో అందుబాటులో ఉన్నాయి. ది యానిమల్ కింగ్‌డమ్, ది వండర్స్ ఆఫ్ ది సీ వరల్డ్ పుస్తకాలు 3డీలో ముద్రించారు. ఒక్కో పుస్తకం ఖరీదు రూ.125గా నిర్ణయించారు.

చిన్నారుల కోసం 'చిన్న' పుస్తకాలు..



వయస్సుతో సంబంధం లేకుండా పుస్తకాల మోతను ఇస్తోంది ప్రస్తుత విద్యా విధానం. రెండో తరగతి, మూడో తరగతి చదివే విద్యార్థులు పెద్ద పెద్ద బ్యాగ్‌లతో పుస్తకాలను మోయాల్సిన పరిస్థితి. అటువంటి వారి కోసం తేలిగ్గా మోయ గలిగే చిన్న పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టాల్ నంబర్ 36లో ఉన్న ముంబైకి చెందిన నవనీత ఎడ్యుకేషనల్ లిమిటెడ్‌లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో పుస్తకం ఖరీదు రూ.60లుగా నిర్ణయించారు. నర్సరీలో ఇంగ్లీష్ పద్యాలు, కలర్స్, షేప్స్, వెహికల్స్, వైల్డ్ యానిమల్స్, వెజిటబుల్స్, అపోజిటింగ్ పుస్తకాలను చిన్నారులకు తగ్గట్టుగా రూపొందించారు. దీనితోపాటు బాల గణేష్ అండ్ హిజ్ ఫ్రెండ్స్ వంటి బుల్లి పుస్తకాలను చిన్నారులు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

'అత్తగారి కథలు'



అత్తాకోడళ్ల మధ్య అనుబంధాలు ఒక రకం. గొడవలు, పంతాలు మరో రకం. ఈ రెండు వేర్వేరు అంశాలకు సంబంధించి కథా రూపాన్ని ఇచ్చారు సినీనటి భానుమతీ రామకృష్ణ. వివిధ చిత్రాల్లో అత్తగా అనేక పాత్రలు పోషించిన ఆమె 'అత్తగారి కథలు' పేరుతో పుస్తకాన్ని రాశారు. అత్తగారు ఆవకాయ, అత్తగారు ఆవు నంబరు 23, అత్త-తోడుకోడలీయం వంటి కథలకు ఆమె జీవం పోశారు. ఈ పుస్తకానికి రాష్ట్ర సాహిత్య అకాడమి పురస్కారం దక్కింది. ఈ పుస్తకాలు స్టాల్ నంబరు 208లో ఉన్న అన్వేక్షికి పబ్లిషర్స్‌లో అందుబాటులో ఉన్నాయి.

వాడుక భాషలో రామాయణ, భాగవతాలు

రామాయణం, భాగవతం, మహాభారతం ఈ ఇతిహాసాలన్నీ పద్యాలతో కూడి తెలుగులో ఉంటాయి. నేటి చదువుల్లో ఉన్న వారికి గ్రాంధికం భాష చదవడం కాస్త కష్టంగానే ఉంటుంది. నాయకని కృష్ణమూర్తి వాటికి వాడుక భాషలో అక్షరరూపాన్నిచ్చారు. ఈ పుస్తకాలు స్టాల్ నంబర్ 31లో ఉన్న విజయవాణి ప్రింటర్స్‌లో అందుబాటులో ఉన్నాయి. వాటితోపాటు మధురాంతకం నరేంద్ర రాసిన 'నిశ్శబ్దపు చప్పుడు', కార్టూనిస్టు జయదేవ్ రాసిన 'గ్లాచ్యూమీచ్యూ -1, 2', 'జయదేవ్ జోక్స్', వేమూరి సత్యనారాయణ రాసిన 'ఎనభైలో ఇరవై' కథల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

భూ రీ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడండి

- రెవెన్యూ అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 20 నుంచి భూమి రీ సర్వే ప్రారంభమవుతుందని, ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లా సర్వే విభాగం ఆధ్వర్యంలో కృష్ణా వర్సిటీ ఆడిటోరియంలో గురువారం ఉయ్యూరు, మచిలీపట్నం డివిజన్ రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లు, వీఆర్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, వందేళ్ల తర్వాత జరుగుతున్న భూమి రీసర్వేను పూర్తి స్థాయి వివరాలతో నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా రీ సర్వే చేయాలన్నారు. తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, భూ రీ సర్వే ప్రక్రియలో సమస్యలున్న భూముల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, అనుభవదారులు, హక్కుదారులు, ప్రైవేట్, ప్రభుత్వ భూములు, భూసేకరణలో ఉన్న భూముల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. భూ యజమానులు స్థానికంగా లేకుంటే వారికి సమాచారం తెలియజేయాలని, వారిని సర్వే జరిగే సమయంలో అక్కడ ఉండేలా చూడాలన్నారు. విదేశాల్లో ఉన్నవారికి సమాచారం తెలియజేసి వారు సూచించిన వ్యక్తుల సమక్షంలో రీసర్వేను చేయాలన్నారు. రీ సర్వే ప్రారంభించే ముందు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ముందస్తుగా రైతులకు సమాచారం తెలియజేయాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఉయ్యూరు, మచిలీపట్నం ఆర్డీవోలు హేలాషారోన్, కె.స్వాతి, తహసీల్దార్‌లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పోర్టు పనుల్లో జాప్యమేల!

- ఏపీ మేరిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య

మచిలీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టుపనులు వేగవంతం చేయాలని, సరైన ప్రణాళికలు, యంత్రాలు లేకుండా ఎంతకాలంపాటు ఈ పనులను సాగదీస్తారని ఏపీ మేరిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్‌ఆదిత్య అసహనం వ్యక్తం చేశారు. పోర్టు పనులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెర్తులు, బ్రేక్‌వాటర్, పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతంలో డ్రెడ్జింగ్, అంతర్గత రహదారులు, వాటికి సంబంధించిన ప్రణాళికలు, నమూనాలు, పనులు చేసేందుకు అవసరమైన యంత్రసామగ్రి ఎంతమేర ఉంది తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. యంత్రాలు, వాటి సామర్థ్యం అడిగి తెలుసుకున్నారు. పనులకు సరిపడా యంత్రాలు లేకుండా ఎంతకాలం సాగదీస్తారని ఆయన మేరిటైమ్‌బోర్డు అధికారులను నిలదీశారు. పోర్టువద్ద అంతర్గత రహదారులకు సంబంధించి నమూనాలు ఇంకా సిద్ధం చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పోర్టు నిర్మాణంలో డ్రెడ్జింగ్ ప్రక్రియ కీలకమని, డ్రెడ్జర్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకుంటే ఎలాగని ఆయన అన్నారు. జాతీయరహదారి 216-ఎ నుంచి పోర్టువరకు రోడ్‌కం రైలు మార్గాలకు సంబంధించి భూసేకరణలో ఉన్న ఇబ్బందులు ఎప్పటిలోగా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. బిల్లులు చేసి పంపుతున్నా.. ఇక్కడ అంతమేర పనులు జరగలేదని తన పరిశీలనలో స్పష్టమవుతోందన్నారు. అధికారులు బిల్లులుచేసే అంశంలో ఉన్న శ్రద్ధ పనులు చేయించడంలో లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు కాంట్రాక్టర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఇదే పద్ధతి కొనసాగితే అధికారులందరికీ బదిలీలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 11న ఏపీ మేరిటైమ్, రైట్స్‌సంస్థ, పోర్టుపనులు చేస్తున్న మెఘా కాంట్రాక్టుసంస్థ అధికారులతో అత్యున్నత స్థాయి సమావేశం ఉంటుందని, అప్పటికి పోర్టుపనులకు సంబంధించి పూర్తిస్థాయి వివరాలను నివేదిక రూపంలో ఇవ్వాలని ఆయన ఏపీ మేరిటైమ్ బోర్డు ఈఈ పల్లారావును ఆదేశించారు. అధికారుల పనితీరుపై పలు ఆరోపణలు వస్తున్నాయని, వారు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

ప్రయాణం.. ప్రయాస

- దుర్లభంగా మారిన పండుగ ప్రయాణం
- డిమాండ్‌కు తగినంతగా ఆర్టీసీ బస్సులు నిల్
- దసరాలో ఇబ్బందులుపడిన ప్రయాణికులు
- గత సంక్రాంతి పరిస్థితి కూడా అంతే..
- హైదరాబాద్ నుంచి రోజుకు 3 లక్షల మంది వచ్చే అవకాశం
- బస్సులు, రైళ్లు, విమానాలు కలిపినా 2 లక్షల్లోపు సామర్థ్యమే
- సొంత వాహనాలు, క్యాబ్‌ల్లో వచ్చే వారికి కష్టాలు
- జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పండక్కి సంక్రాంతి ప్రయాణం దుర్లభంగా మారింది. సెలవులకు వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు రావడంతో పాటు ఇక్కడి నుంచి వారివారి స్వస్థలాలకు తీసుకెళ్లడంలో, పండుగ అనంతరం తిరుగు ప్రయాణంలోనూ సమస్యలు వస్తూనే ఉన్నాయి. దసరా సమయంలో ఇలాంటి లోపాలే కనిపించాయి. ఈ సంక్రాంతికి అలా జరగకుండా ఆర్టీసీ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. గత ఏడాది సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు రావడం ఒక ఎత్తయితే, ఇక్కడి నుంచి సొంతూర్లకు వెళ్లడం మరో ఎత్తుగా మారింది. భోగికి ముందు మూడు రోజుల్లో రోజుకు హైదరాబాద్ నుంచి విజయవాడకు 3 లక్షల మందికి పైగా బయల్దేరారు. దీంతో బస్సుల కొరత వేధించింది. అటు తెలంగాణకు చెందిన బస్సులు కానీ, ఇటు ఏపీకి చెందిన బస్సులు కానీ డిమాండ్‌కు తగ్గట్టుగా లేకపోవటంతో ఈ సమస్య ఏర్పడింది. దీంతో చాలామంది సొంత వాహనాలు, క్యాబ్‌ల్లో బయల్దేరారు. గంటలకొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుని మరీ ప్రయాణించారు.

అదనపు బస్సులు అవసరం

గత ఏడాది పరిస్థితులను పరిశీలిస్తే.. ఆర్టీసీ అధికారులు మొత్తం 1,310 బస్సులు నడిపారు. వీటిద్వారా లక్షలోపే ప్రయాణికులు వచ్చారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, రైళ్లు, విమానాలు.. అన్నీ కలిపినా కూడా భోగి ముందు మూడు రోజుల వరకు కూడా 1,85,000 మంది ప్రయాణికులు మాత్రమే విజయవాడకు వచ్చారు. మరో 1,25,000 మంది సొంత వాహనాలు, క్యాబ్‌ల్లో వచ్చారు. ఈ అదనంగా వచ్చిన వారిని కూడా తీసుకొచ్చే పరిస్థితులు ఈ పండక్కి అయినా ఆర్టీసీ, రైల్వేకు ఉన్నాయా అంటే లేదనే చెప్పాలి. దీంతో ఆ ప్రయాణికులు కార్లు, క్యాబ్‌లు, సొంత వాహనాలపై ఆధారపడితే తప్ప ఇక్కడకు రాలేని పరిస్థితి. దీంతో ఈసారి ఎన్‌హెచ్-65పై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముంది. కాగా, దాదాపు 230 బస్సులను ఆర్టీసీ అధికారులు రిజర్వులో ఉంచారు. ఇవి కూడా సరిపోకపోతే మాత్రం ప్రయాణికులకు కష్టాలు తప్పవు.

ముందే వచ్చిన సంక్రాంతి

- గోదాదేవి కల్యాణోత్సవంలో చినజీయర్ స్వామి అనుగ్రహ భాషణం
- ఫిబ్రవరిలో విజయకీలాద్రిపై ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ


విజయవాడ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అసమానతల సమాజాన్ని సంస్కరించే గట్టి ప్రయత్నం వెయ్యేళ్ల క్రితం సమతామూర్తి రామానుజాచార్యులు చేశారని త్రిదండి చినశ్రీమన్నారాయణ రామానుజజీయర్ స్వామి అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం నేతృత్వంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల గ్రౌండ్స్‌లో గురువారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అనంతరం చినజీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేస్తూ దేశమంతటా భోగినాడు గోదా, శ్రీరంగనాథుల కల్యాణం జరగడం ఆనవాయితీ అని, సిద్ధార్థ యాజమాన్యం ముందుగానే ఆ కల్యాణోత్సవం జరిపించడంతో సంక్రాంతి వాతావరణం వచ్చిందన్నారు. డాక్టర్ మేడసాని మోహన్ భాగవత సప్తాహాన్ని సిద్ధార్థ కళాపీఠం ఏర్పాటుచేయడం శుభకరమన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో సీతానగరంలోని విజయకీలాద్రిపై 35 అడుగుల ఆంజనేయ స్వామి ఏకశిలావిగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితాప్రసాద్, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ మేకా రమేశ్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

15 నిమిషాలు ఆలస్యమైందని..

- ప్రయాణికుడిని అనుమతించని ఎయిరిండియా సిబ్బంది
- చార్జీలు తిరిగి చెల్లించిన విమానాశ్రయ అధికారులు

గన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయంలో ఎయిరిండియా సిబ్బంది, ప్రయాణికుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అమెరికా వెళ్లేందుకు విద్యార్థి విమానాశ్రయానికి గురువారం ఉదయం 7.45 గంటలకు వచ్చాడు. అయితే విమానం బయలుదేరేందుకు 45 నిమిషాలు ముందు వచ్చిన అతడి లగేజ్‌ను విమానంలోకి పంపించేందుకు ఎయిరిండియా సిబ్బంది నిరాకరించారు. గంటముందు రావాల్సి ఉండగా 45 నిమిషాల ముందు రావటంతో ఎయిరిండియా సిబ్బంది టైమ్ అయిపోయిందని చెప్పారు. దీంతో ప్రయాణికుడికి, ఎయిరిండియా సిబ్బంది వద్ద వాగ్వివాదం చోటుచేసుకుంది. తాను ముందుగానే విమానాశ్రయం లోపలికి వచ్చానని కావాలనే డిలే చేసి విమానం వెళ్లిపోయిందని సిబ్బంది చెప్పటంతో విద్యార్థి ఆందోళన చెందాడు. వీరి మధ్య గొడవ జరుగుతున్న సమయంలోనే విమానం వెళ్లిపోయింది. దీంతో ప్రయాణికుడు అతడి తల్లిదండ్రులు, బంధువులు సిబ్బందిపై గొడవకు దిగారు. ఎయిరిండియా సిబ్బంది ప్రయాణికుడిపై దురుసుగా వ్యవహరించటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విమానం వెళ్లిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి జోక్యంతో సదరు ప్రయాణికుడికి టిక్కెట్ ధరను తిరిగి చెల్లించేందుకు ఎయిరిండియా సిబ్బంది అంగీకరించటంతో వివాదం సద్దుమణిగింది.

వైకుంఠ ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు



- భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు
- ఈవోలతో నిరంతరం సమీక్ష : కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుతో కలిసి వివిధ ఆలయాల ఈవోలు, దేవదాయ, రెవెన్యూ, పోలీసు తదితర సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు సులభంగా దర్శనాలు జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వేదాద్రి నరసింహస్వామి ఆలయం, విజయవాడ బ్రాహ్మణ వీధి, లబ్బీపేట వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద క్యూలైన్లు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎస్‌ఐ తదితర క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో వైకుంఠ ఏకాదశి దర్శనాల ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. భక్తులకు ఏర్పాట్లపై ప్రముఖ ఆలయాల ఈవోలతో నిరంతరం సమీక్షిస్తున్నామని, దేవదాయ, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా వుండాలని, ఎప్పటికప్పుడు ఆలయాలను సందర్శించి పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామని కలెక్టర్ చెప్పారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రసాదాల కౌంటర్లు తదితరాల విషయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా దేవదాయ అధికారి వి.సీతారామయ్య, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్, వివిధ ఆలయాల ఈవోలు, అధికారులు పాల్గొన్నారు.

లారీని అడ్డుకున్నారని..

- ఇసుక కార్మికులపై కేసు నమోదు
- నార్తువల్లూరు క్వారీలో తవ్వకాలు నిలిపివేత

తోట్లవల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో ధర్నా నిర్వహించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇసుక కార్మికులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.అర్జునరాజు గురువారం తెలిపారు. నార్తువల్లూరు క్వారీనుంచి బుధవారం ఇసుక లోడుతో వస్తున్న లారీని తోట్లవల్లూరులో రేవులో నిలిపివేసి రాత్రి 9 గంటల వరకు ధర్నా, ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో లారీని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తుండగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు 20 మందికి పైగా కార్మికులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. సీజ్ చేసిన ఇసుక లారీ విజయవాడకు చెందిన శ్రీధర్‌కు చెందినదిగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. కాగా ఇసుక కార్మికుల ధర్నా, ఆందోళన నేపథ్యంలో నార్తువల్లూరు క్వారీలో గురువారం తాత్కాలికంగా ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. కార్మికులు, క్వారీ నిర్వాహకులు చర్చించుకుని సమస్య పరిష్కరించుకోనున్నట్టు తహసీల్దార్ ఎం.కుసుమకుమారి చెప్పారు. అలాగే తోట్లవల్లూరు రీచ్‌లో అనుమతి లేని క్వారీని గురువారం నిలిపివేశారు.

కృష్ణుడే జగద్గురు

- డా.మేడసాని మోహన్
- సిద్ధార్థ కళాపీఠం భాగవత సప్తాహం ముగింపు

విజయవాడ కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : కృష్ణుడు మాత్రమే జగద్గురువని, అర్జునుడితో పాటు ఉద్ధవుడికి ధర్మప్రబోధం చేశాడని, కుచేలుణ్ణి సమాదరించి మిత్రత్వం చాటుకున్నాడని, కృష్ణావతారం ఒక్కటే సంపూర్ణ అవతారమని పంచ సహస్రావధాని మహాపండితుడు డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో వారం రోజులుగా సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న మేడసాని భాగవత సప్తాహ ప్రవచనం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ ఈ సందర్భంగా డాక్టర్ మేడసాని మోహన్‌ను ఘనంగా సత్కరించారు.

నచ్చినవారు వచ్చేవరకు రద్దే..!

(3వ పేజీ తరువాయి)

లెస్‌కు రూ.15.59 లక్షలకే పనులు చేస్తామని టెండర్ వేశారు. మిగిలిన పనులకు భారీస్థాయిలో లెస్‌కు టెండర్లు పడ్డాయి. కైకలూరు, గన్నవరం, అవనిగడ్డ వంటి నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల నుంచి ఎలాంటి జోక్యం లేకపోవడంతో టెండర్లను ఓపెన్ చేసి పనులు అప్పగించేశారు.

ఆ మూడు నియోజకవర్గాల్లో..

గుడివాడ, పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల అనుచరుల జోక్యం మితిమీరడంతో అధికారులు పదేపదే టెండర్లను రద్దు చేసే పరిస్థితి ఏర్పడింది. పెనమలూరు నియోజకవర్గానికి సంబంధించి రెండో విడతలో టెండర్లు ఓకే చేశారు. కానీ, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల టెండర్లు మాత్రం ఓ కొలిక్కి రావడం లేదు. తమకు కావాల్సిన వారికి కట్టబెట్టేందుకో, కమీషన్ల కోసమే ఈ టెండర్లను స్థానిక నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి పదేపదే రద్దు చేయిస్తున్నారు. కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి టెండర్లలో పాల్గొనకుండా చేసేందుకు జరిగిన ప్రయత్నాలు విఫలం కావడంతో అధికారులను తమకు అనుకూలంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తూ వస్తున్నారు. రాజకీయఒత్తిళ్లతో అధికారులు మారు మాట్లాడకుండా వారు చెప్పినట్టు చేస్తున్నారు. ఈ రద్దు బాగోతంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టి సారించాలని అధికారులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

తిరుపతి తొక్కిసలాట ఘటన బాధాకరం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే గద్దె

పటమట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జరిగిన తొక్కిసలాట సంఘటన చాలా బాధాకరమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఈ సంఘటనలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. 18వ డివిజన్ రాణిగారితోటకు చెందిన శానిటరీ వర్కర్ శ్రీరాముల కృష్ణకు గద్దె రామ్మోహన్ రూ.10వేలను వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. పడాల గంగాధర్, కేశవరావు, గల్లా శ్రీను, రవీంద్ర, వాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండుగల ప్రాశస్త్యాన్ని తెలపండి

ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే గద్దె సూచన ● విద్యాలయాల్లో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

కృష్ణలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేసి వారిలో పండుగల ప్రాశస్త్యాన్ని తెలియజేయాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంకలోని వంగవీటి మోహనరంగా బాలికోన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, స్కూల్‌ను దత్తత తీసుకున్న ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు, గద్దె, వంగవీటి రాధాకృష్ణలు, ఏబీ వెంకటేశ్వరరావు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పిల్లలు వేసిన రంగవల్లులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువులు చూపరులను అలరించాయి. అనంతరం అతిథులు భోగి మంటలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి రంగారావు, జి.నామేశ్వరరావు, నిమ్మల జ్యోతిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏబీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గద్దె , మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ



వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో...

సుధాకర్స్ ఐడియల్ స్కూల్ ఆవరణలో

స్థానిక పాత పోలీసు స్టేషన్ రోడ్డులోని సుధాకర్స్ ఐడీయల్ స్కూల్ ఆవరణలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బొమ్మల కొలువు, గొబ్బెమ్మలతో రంగవల్లులు వేసి భోగి మంటలు వెలిగించారు. చెరుకు, ధాన్యం, పాడిపంటలు, డూ డూ బసవన్నలతో అలంకరించారు. చిన్నారులు హరిదాసులు, రైతులు, గోదాదేవి అలంకారాలలో అలరించారు.హైస్కూల్ ఛైర్మన్ జామి సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, డీన్ సురేష్‌కుమార్, కరస్పాండెంట్ దేవినేని వరలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నలంద విద్యానికేతన్‌లో ...

గవర్నర్‌పేట: నలంద విద్యానికేతన్‌లో స్కూల్ ప్రాంగణాన్ని బొమ్మల కొలువు, పొలం, పాడిపంటలు, పొంగళ్ళు, రంగవల్లులు, చెరుకు గడలతో అందంగా అలంకరించారు. తల్లిదండ్రులు వారి చిన్నారులతో కలిసి వీటిని వీక్షిస్తూ సందడి చేశారు. పండుగ వేడుకలను కళ్ళకు కట్టినట్లుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకలను ప్రిన్సిపాల్ మాదల పద్మజ ప్రారంభించి వేడుకల ప్రాశస్త్యాన్ని తెలియజేశారు.



నలంద విద్యానికేతన్‌లో

వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో..

మొగల్రాజపురం: స్థానిక వీరమాచనేని పద్దయ్య పబ్లిక్ స్కూలులో ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా రంగవల్లులు, గొబ్బెమ్మలు, చెరుకు గడలు, బొమ్మల కొలువు, భోగి మంటలతో సందడి చేశారు. హరిదాసులు కీర్తనలు, గంగిరెద్దులు, గోదాదేవి కళ్యాణం వంటి పండుగ విశేషాలను పిల్లలు వేషధారణతో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెచ్ఎం సీహెచ్ జయలక్ష్మి చిన్నారులకు భోగిపండ్లు పోశారు. పండగ విశిష్టత వివరించారు.



దాసరి వెంకట గిరిధర్ కుమార్ అవంతి పాఠశాలలో

లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో...

సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు సందడి చేశారు. ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ పిల్లలకు భోగిపండ్లు పోశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఫణిప్రసాద్ ముక్తేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుణదలలో..

భారతీనగర్: గుణదలలోని దాసరి వెంకట గిరిధర కుమార్ అవంతి నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాలలో భోగిమంటలు వేశారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులను ధరించారు. హరిదాసు వేషధారణలో అలరించారు. హెచ్ఎం ప్రశాంతి చిన్నారులకు భోగిపండ్లు పోశారు. చిన్నారులు నృత్యాలు, పాటలతో అలరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల పన్నులు చెల్లించకుంటే చర్యలే

● ఖాళీస్థలాల్లో వీఎంసీ నోటీస్ బోర్డులు ఏర్పాటు



చిట్టినగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఖాళీ స్థలాల పన్నులు చెల్లించని యాజమానులపై చర్యలకు నగరపాలక సంస్థ సిద్ధమైంది. గురువారం నగర పరిధిలో పలుప్రాంతాల్లోని ఖాళీస్థలాల్లో వీఎంసీ రెవెన్యూ సిబ్బంది నోటీస్ బోర్డులు ఏర్పాటు చేశారు. 15 రోజుల్లో బకాయి చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్ని నోటీస్ బోర్డులు పెట్టారు. మొదటి విడతగా ఆయా పరిధిలో సచివాలయాల రెవెన్యూ సెక్రటరీలు పలు ప్రాంతాల్లో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేశారు. 15 రోజులు గడువులోపు చెల్లించాలని బోర్డుపై స్పష్టంగా రాయించారు. ముఖ్యంగా విద్యాధరపురం, దావుబుచ్చయ్యకాలనీ, రామకృష్ణపురం, సింగ్‌నగర్, పాయకాపురం, గుణదల, కరెన్సీనగర్, పటమట పలు ఖాళీ స్థలాల్లో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, డ్రెయినేజీ చార్జీలు పెద్ద మొత్తంలో బకాయి ఉన్నవారికి నీటి, డ్రెయినేజీ సర్వీసులు నిలుపుదల చేసేందుకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు తీసుకొన్న 24గంటల్లోపు పన్నులు చెల్లించనిపక్షంలో వారి ఇంటి నీటి, డ్రెయినేజీ కనెక్షన్లు తొలగించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పీబీ సిద్ధార్థలో పరిశోధనా కేంద్రం ప్రారంభం



మొగల్రాజపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం విశాఖపట్నంకు చెందిన తిలిచో ల్యాబ్స్ సహకారంతో పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలిచో ల్యాబ్స్ వ్యవస్థాపకులు హేమ కిరణ్ మాట్లాడుతూ పీబీ సిద్ధార్థలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, వెబ్ డిజైనింగ్, మొబైల్ అప్లికేషన్ అభివృద్ధి చేయడంలో శిక్షణ ఇచ్చి అరులైన వారికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ సలహాదారులు ఆచార్య ఎల్‌కే మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్ పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



లబ్బీపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బందర్ రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపంలో గురువారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎక్స్‌పో ఈ నెల 13 వరకు ఉంటుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు తదితర వస్త్రాలు 50శాతం వరకు తగ్గింపు ధరలతో అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలో మహారాష్ట్ర పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్ కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ నుంచి చందేరి అండ్ మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ బలూచారి, జమదాని, టాంగైల్, ఢకాయ్ సిల్క్ వస్త్రాలు, లినెన్ కాంతావర్క్ చీరలు, దుప్పట్లు, వివిధ డిజైన్ల సల్వార్ మెటీరియల్స్‌లతో దేశంలో పలు రాష్ట్రాల నుంచి అక్కడి ప్రఖ్యాత వస్త్రాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

జాతీయ క్రీడలకు ఎస్ఆర్ఆర్ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

ప్రభుత్వాసుపత్రి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని గోలరంగి ఇందిరాగాంధీ ఇంటర్నేషన్ స్టేడియంలో స్విమ్మింగ్ పూల్ వద్ద ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 4 వరకు జరగనున్న 38వ జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన బి.బాలగంగాధర్(థర్డ్ ఇయర్ బీకాం)పాల్గొననున్నట్లు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ డాక్టర్ యుగంధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, నాగేశ్వరరావు, ఎం.సుధాకర్, డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, శాంతకుమారి తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎన్ఆర్ఐ విద్యార్థి



వంశీసాగర్‌ను అభినందిస్తున్న ఎన్ఆర్ఐ చైర్మన్ వెంకట్రావు

విజయవాడ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి సమీపంలో వున్న ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ.వంశీసాగర్ ఈనెల 17 నుంచి 19 వరకు పంజాబ్ రాష్ట్రంలోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ జూడో పోటీల్లో పాల్గొంటున్నట్లు ఎన్ఆర్ఐ ప్రిన్సిపాల్ నాగభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన వంశీసాగర్‌ను ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావ్, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, ఏవీఎస్ మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ పి.గౌతు అభినందించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



లబ్బీపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రక్తదానం అనేది ప్రాణదానం లాంటిదని అలాంటి ప్రాణదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ అన్నారు. కళాశాల అవరణలో గురువారం నలంద కళాశాల, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ శ్రీకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక పరిస్థితులను గమనించి సరైన సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నారు. ఈ సందర్భంగా 50మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మదన్‌మోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా, డైరెక్టర్ పూర్ణిమ తదితరులు

మహిళా ఉత్సవ్ కరపత్రం విడుదల

మొగల్రాజపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు తాము ఆర్థికంగా బలోపేతం కావడానికి వీలుగా, తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి వీలుగా మహిళా ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా తెలిపారు. మొగల్రాజపురంలోని కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు, మహిళలకు, యువతకు ఎంతో మందికి ఉపాధి కార్యక్రమాలలో శిక్షణ ఇచ్చి వారిని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసినట్లు తెలిపారు. ఈ కోవలో తమ వద్ద శిక్షణ పొందిన మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి మార్కెటింగ్ చేసుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 8 నుంచి 16 వరకు మొగల్ ఎగ్జిబిషన్ హాలులో మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ, శిక్షకులు పాల్గొన్నారు.



టీటీడీ ఆలయంలో సిద్ధమైన క్యూలైన్లు

ముక్కోటికి టీటీడీ ఆలయంలో ఏర్పాట్లు

లబ్బీపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆలయాలు సిద్ధమయ్యాయి. లబ్బీపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీకి తగినట్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పిస్తామని, తీర్థ ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమైన భద్రత ఏర్పాట్లు పోలీసులు కల్పిస్తున్నారని, వాహనాల పార్కింగ్‌కు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫ్లోరిడా విశ్వవిద్యాలయం యువ ప్రెసిడెంట్ సూర్యకాంత్‌కు సత్కారం



సూర్యకాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీతారామయ్య

పటమట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మొగల్రాజపురం వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి సూర్యకాంత్ ప్రసాద్ ప్రసుత్తం ఫ్లోరిడా విశ్వ విద్యాలయం యువ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఆయన వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సీతారామయ్య 20 ఏళ్ల వయస్సులో ఈ ఘనత సాధించిన సూర్యకాంత్‌కు చిరు సత్కారం నిర్వహించారు. సూర్యకాంత్ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగితే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చునని చెప్పారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ నేషనల్స్ కబడ్డీలో ప్రీ క్వార్టర్స్‌లో ఆంధ్రప్రదేశ్

విజయవాడ స్పోర్ట్సు: ఉత్తరాఖండ్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హరిద్వార్‌లో జరుగుతున్న 50వ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టు సత్తా చాటి గురువారం ప్రీ క్వార్టర్స్‌కు చేరింది. ఆరంభ మ్యాచ్‌లో పూల్ ఎఫ్ నుంచి బరిలో దిగిన ఆంధ్రప్రదేశ్ జట్టు చెమటోడ్చి ఛత్తీస్‌ఘడ్‌పై 55-54తో విజయం సొంతం చేసుకుంది. రేసులో నిలవాల్సిన మ్యాచ్‌లో పొరుగు రాష్ట్రం జట్టు అయిన తెలంగాణపై 41-25 భారీ పాయింట్లతో సత్తా చాటి ప్రీ క్వార్టర్స్‌కు చేరింది. బీహార్‌తో ఇంకో మ్యాచ్ ఆడాల్సి ఉంది. దీని తర్వాత ప్రీక్వార్టర్స్‌లో తలపడే టీమ్ ఎవరనేది తేలనుంది. బాలికల టీమ్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోను పరాజయం పాలైందని ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు.



సత్తా చాటిన ఏపీ కబడ్డీ జట్టు

దిగుబడుల్లేక కుదేలైన పత్తి రైతుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) నుంచి 'మద్దతు' కరువైంది. మద్దతు ధరతో రైతులకు అందుబాటులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు చేయకుండా, ఎంపిక చేసిన జిన్నింగు మిల్లుల వద్దే పత్తి కొనుగోలు చేసింది. పాలకులూ పట్టించుకోకపోవటంతో అయినకాడికి తెగనమ్ముకున్న రైతులు నష్టపోవాల్సి వచ్చింది. వ్యాపారులు, దళారులకు మాత్రమే ఉపయోగపడిన సీసీఐ వల్ల తమకు ఒనగూరిన ప్రయోజనమేంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కంచికచర్ల యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య(ఫైల్)

పత్తి రైతుకు మద్దతు కరువు

- సీసీఐ కొనుగోళ్లలో అధిక శాతం జిన్నింగు మిల్లుల వద్దే
- అలంకారప్రాయంగా వ్యవసాయ మార్కెట్ యార్డులు
- దళారులకు తక్కువ ధరకు అమ్ముకున్న రైతులు

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

ఎన్టీఆర్ జిల్లాలో తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ఈ ఏడాది రైతులు లక్ష ఎకరాలకు పైగా పత్తిసాగు చేశారు. ఆగస్టు చివరి, సెప్టెంబరు మొదటి వారాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు 35 వేల ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నాయి. గూడ, పూత, పిందె రాలిపోయాయి. దీనికితోడు పలు ప్రాంతాల్లో గులాబీ రంగు పురుగు దాడి చేయడంతో ఆశించిన దిగుబడులు రాలేదు. ఎక్కువ మంది రైతులకు ఎకరానికి సగటున ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఎకరానికి పెట్టుబడి రూ.50 వేలకు పైగా అయింది. దీనికితోడు పత్తితీత కూలి ఖర్చు ఎక్కువైంది. చేలు దెబ్బతిని, ఆశించిన దిగుబడులు రాక నిలువునా కుదేలైన పత్తి రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ దోబూచులాడడంతో మద్దతు ధర అందని ద్రాక్షగా మారింది.

నష్టాలు మూటగట్టుకున్న రైతులు

ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7,521 ప్రకటించింది. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు ఏఎంసీ పరిధిలోని గంపలగూడెం, ఎ.కొండూరు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, పత్తి కొనుగోలు చేస్తామంటూ అధికారులు ప్రకటించారు. దీంతో మద్దతు ధర లభిస్తుందని రైతులు ఆశపడ్డారు. మద్దతు ధర సంగతి దేవుడెరుగు? యార్డుల్లో పెద్దగా కొనుగోళ్లు జరపలేదు. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట యార్డుల్లో కొద్దిగా కొని మమ అనిపించారు. 90 శాతం జిన్నింగు మిల్లుల వద్దనే సీసీఐ కొనుగోలు చేసింది. యార్డుల్లో సీసీఐ కొనకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. గుంటూరు జిన్నింగు మిల్లుల వద్దకు తీసుకువెళ్లేందుకు రైతులు అధిక వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. పత్తి బోరాల్లో తొక్కించి, లారీలకు ఎగుమతి చేసి, జిన్నింగు మిల్లులకు తరలించాలి. ఒకటికి రెండు రోజులు వ్యవసాయ పనులు మానుకుని గుంటూరు వెళ్లాలి. అక్కడ పెడుతున్న నిబంధనలతో మద్దతు ధర లభించడం లేదు. యార్డుల్లో కొనకపోవటంతో రైతులు గత్యంతరం లేక వ్యాపారులకు, దళారులకు తక్కువ ధరకు అమ్ముకున్నారు. గిట్టుబాటు ధర రాక నష్టాలు మూటగట్టుకున్నారు.

వ్యాపారులు, దళారులకు మేలు

రైతుల వద్ద క్వింటా రూ.ఆరువేల నుంచి రూ. 6,800కు కొన్న వ్యాపారులు, దళారులు అదే పత్తిని రైతుల పేర్లతోనే సీసీఐకు విక్రయించి లాభపడ్డారు. ఈ క్రాప్ చేసిన రైతుల పత్తిని రూ.6,500 నుంచి రూ.6,800 వరకు కొనగా, ఈ క్రాప్ చేయని వారి పత్తిని రూ.6వేల నుంచి రూ. 6,500 వరకు కొంటున్నారు. రైతులను కార్లలో గుంటూరు తీసుకువెళ్లి, బయోమెట్రిక్ వేయిస్తున్నారు. రైతుల ఖాతాలో సొమ్ములు జమ కాగానే, తమ ధర ప్రకారం రైతులకు లెక్కగట్టి, రైతులకు పోనూ మిగతా సొమ్మును వ్యాపారులు, దళారులు తీసుకుంటున్నారు.

యార్డుల్లో కొన్నది 8,447 క్వింటాళ్లే..

ఈనెల ఆరో తేదీ వరకు జిన్నింగ్ మిల్లుల వద్ద 4,10,142 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. ఇందులో అద్దెకు తీసుకున్న జిన్నింగు మిల్లుల వద్ద 4,01,695 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కేవలం 8,447 క్వింటాళ్లే కొన్నది. ఇది కూడా కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట యార్డుల్లోనే..మైలవరం, తిరువూరు యార్డుల్లో కిలో కూడా కొనలేదు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి..పట్టించుకోని పాలకులు

యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, హామీలు గుప్పించిన పాలకులు ఆ తర్వాత పట్టించుకోలేదు. మద్దతు ధర లభించకపోయినా, యార్డుల్లో కొనుగోళ్లు జరగపోయినా చూస్తూ ఊరుకున్నారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కూడా యార్డుల్లో కొనుగోళ్లకు పెద్దగా ప్రయత్నించలేదు. అధికారుల దృష్టంతా మార్కెట్ సెస్ పైన ఉంది. యార్డుల్లో కొంటే, ఆ పత్తిని గుంటూరు మిల్లులకు తరలించేందుకు రవాణా ఖర్చును యార్డులు భరించాలి. దీంతో అధికారులు మౌనంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- వారి సమస్యలన్నీ పరిష్కరిస్తాం: ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



అవనిగడ్డ డిపోలో మూడు నూతన బస్సులను ప్రారంభిస్తున్న కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఆర్టీసీ యాజమాన్యం పని చేస్తోందని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. బుధవారం అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి మూడు కొత్త బస్సులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. 'ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన తర్వాత కొన్ని సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటికి పరిష్కారం చూపుతాం. మెరుగైన వైద్యసేవల కల్పన, పెన్షన్ల పెంపునకు ప్రాధాన్యమిస్తాం. త్వరలోనే వారి సంక్షేమానికి చర్యలు చేపడతాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అవనిగడ్డ డిపోకు 11 నూతన బస్సులు సమకూర్చాం. దూరప్రాంత సర్వీసులన్నీ నడుస్తున్నాయి. డిపోలో రూ.12 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తాం. అమరావతి ప్రాంతానికి ఈ నెల 22 నుంచి సర్వీసు ప్రారంభిస్తాం.' అని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. రాజధానిలో కోర్టు, సచివాలయ పనులు పూర్తి చేసుకునేందుకు వీలుగా అమరావతికి అన్ని డిపోల నుంచి బస్సులను నడపాలని కొనకళ్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. అవనిగడ్డ డిపోకు ఆరు నెలల్లో 13 కొత్త బస్సులు ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ ఈడీ జి.విజయరత్నం, ఈఈ రాజశేఖర్, డీపీటీవో వాణిశ్రీ, డీఎం కె.వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ చార్జీలు పెంచబోం: కొనకళ్ల నారాయణ

సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం వేయబోమని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. అందుకోసం 7,200 బస్సులను అదనపు చార్జీలు లేకుండా స్పెషల్ సర్వీసులుగా నడుపుతామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు మంత్రుల బృందం తెలంగాణ, కర్ణాటకలో పర్యటించి పథకం అమలుపై అధ్యయనం చేసిందన్నారు. ఉచిత ప్రయాణం అమలు ద్వారా పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా కొత్త బస్సులు, అదనపు సిబ్బంది నియామకం చేస్తామని ఆయన తెలిపారు. ఆర్టీసీలో పది వేల ఎలక్ట్రికల్ బస్సులు ఉండాలన్నదే ఆర్టీసీ యాజమాన్యం లక్ష్యమని, 1,000 ఎలక్ట్రికల్ బస్సులకు ఇప్పటికే ఆర్డర్ పెట్టిందని కొనకళ్ల తెలిపారు.

ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు

- నికె హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో మంత్రి సవిత



రాట్నం తిప్పుతున్న మంత్రి సవిత

కృష్ణలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రతినెలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు. గురువారం విజయవాడలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్‌పోను మంత్రి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎక్స్‌పోను వారం పాటు నిర్వహిస్తున్నామన్నారు. సంక్రాంతికి ప్రజలంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని ఆమె పిలుపునిచ్చారు. గడిచిన 6 నెలల్లో మూడు ఆప్కో షోరూంలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరికొన్ని ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 10 క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు ఆదిత్య బిర్లా గ్రూపు సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాలతో నేతన్నలకు 365 రోజులు పాటు పని కల్పించేలా టాటా సంస్థతో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. త్వరలో 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటామన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని మంత్రి తెలిపారు. ఆప్కో ఎండీ పావనమూర్తి, వీవర్స్ సర్వీస్ సెంటర్ డీడీ సాహు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ముఖేశ్‌కుమార్ మీనా



రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనాకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

వన్‌టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను గురువారం రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్ మీనా కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఈవో రత్నరాజు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని డిప్యూటీ ఈవో రత్నరాజు అందజేశారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు.

30 నుంచి పారా అథ్లెటిక్స్ రాష్ట్ర పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వేదికగా ఆరో బెటాలియన్- ఏపీఎస్పీ మంగళగిరిలో ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న ఏడవ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల బ్రోచర్లను శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరీషా తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఏపీ పారా స్పోర్ట్సు అసోసియేషన్, శాప్ సహకారంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు గిరీషా తెలిపారు. నూతన క్రీడా విధానంలో పారా క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పించామని అవకాశాన్ని పారా క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఏపీ కార్యదర్శి వి.రామస్వామి, గుంటూరు జిల్లా పారాస్పోర్ట్సు అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దేవనబోయిన ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ పి.వెంకటేశ్వర్లు, అంతర్జాతీయ పారా క్రీడాకారిణి శివగంగ దుర్గ, జాతీయ క్రీడాకారుడు గాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శుక్ర,శని, ఆదివారాలు, పండుగ రోజులు, శెలవు దినాల్లో

దుర్గగుడి ఉద్యోగులకు ప్రత్యేక విధులు

- ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు

వన్‌టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్ర, శని, ఆదివారాలు, పండగ రోజులు, శెలవు దినాల్లో రద్దీ దృష్ట్యా ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు ప్రత్యేక విధులు కేటాయిస్తూ దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. వారాంతపు సెలవు దినాలు, పండగ రోజులు, పబ్లిక్ సెలవులు, శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివస్తున్న కారణంగా రద్దీని నియంత్రించేందుకు, భక్తులకు సులభంగా, శీఘ్రంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చూసేందుకు దేవస్థానంలో పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి భక్తుల రద్దీ తగ్గి చివరి భక్తుడు అమ్మవారిని దర్శించుకునేంత వరకు విధులు నిధులు నిర్వహించాలని ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులకు ఉత్తర్వులు జారీచేశారు. వారంతా తమ రోజువారీ విధులతో పాటు అదనపు విధులను నిర్వహించాల్సి ఉంటుందని అందులో స్పష్టం చేశారు. ఎవరైనా ఆదేశాలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలను తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని స్పష్టంచేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు మొత్తం భక్తుల రద్దీని గమనించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో ఆయన సూచించారు.

రద్దీవేళ.. రద్దుల పర్వం

- విజయవాడ - విశాఖ మార్గంలో నాలుగు రైళ్ల రద్దు
- పండుగకు రెండు రోజుల ముందు రైల్వే నిర్వాకం

రద్దయిన రైళ్లు

కాకినాడ పోర్టు -విశాఖపట్నం(ట్రైన్ నెంబర్ 17267), విశాఖపట్నం - కాకినాడపోర్టు(17268), గుంటూరు - విశాఖపట్నం(17239), విశాఖపట్నం - గుంటూరు(ట్రైన్ నెంబర్ 17240)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సంక్రాంతికి స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్టు ఇటీవలే ప్రకటించిన రైల్వే శాఖ తాజాగా విజయవాడ-విశాఖపట్నం మార్గంలో నాలుగు షెడ్యూల్ రైళ్లను వరసగా రెండు రోజుల పాటు రద్దు చేసింది. పండుగ ప్రయాణాల సమయంలో రైల్వే అధికారులు విజయవాడ డివిజన్ పరిధిలో ఆటోమేటిక్ సెక్షన్ పనులు చేపట్టారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు ఇలాంటివి చేయకుండా పండుగ ముగిసే వరకు పనులు వాయిదా వేయాలని 'ఆంధ్రజ్యోతి' ముందుగానే అప్రమత్తం చేసింది. కానీ రైల్వే అధికారులు పండుగ ప్రయాణాల సమయంలోనే ఆటోమేటిక్ సెక్షన్ పనులు చేపట్టారు. దీంతో పండుగకు రెండు రోజుల ముందు ఈనెల 11వ తేదీన 2 రైళ్లు, 12న 2 రైళ్ల చొప్పున రద్దు చేశారు. ప్రస్తుతం విజయవాడ-విశాఖపట్నం మార్గంలో విపరీతమైన రద్దీ నడుస్తోంది. రైళ్లన్నీ కిటకిటలాడుతూ కిక్కిరిసిపోతున్నాయి.

వందేభారత్, స్పెషల్ రైళ్ల కోసమేనా..

సంక్రాంతి రద్దీ సీజన్‌లో పనుల పేరుతో రైళ్లను రద్దు చేయడంలో రెండు రకాల అనుమానాలు రేకెత్తుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా ఇప్పటికే స్పెషల్ రైళ్లను అధికారులు ప్రకటించారు. షెడ్యూల్ రైళ్ల రద్దుతో స్పెషల్ రైళ్లలో అధిక ధరలు చెల్లించి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. దీంతో పాటు విజయవాడ-విశాఖపట్నం మార్గంలో వందే భారత్ రైలుకు మరింత డిమాండ్ తెచ్చేందుకు కూడా విశాఖపట్నం మార్గంలోని రైళ్లను రద్దు చేశారన్న ప్రచారం జరుగుతోంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో డైనమిక్ ఫేర్ అమల్లో ఉంది. తక్కువ సీట్లు ఉంటే చివరి నిమిషంలో ఎక్కువ ధర పలుకుతుంది. సంక్రాంతి పండుగను సొమ్ము చేసుకునేందుకే రైల్వే ఈ తరహా వ్యవహారాలు చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పండుగ ముగిసే వరకైనా రైళ్లను రద్దు చేయొద్దని ప్రయాణికులు కోరుతున్నారు.

మట్టి తరలిస్తున్న 11 టిప్పర్లు స్వాధీనం

- ఏడీసీపీ రామకృష్ణ ఆధ్వర్యంలో దాడులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



జక్కంపూడిలో నిలిపి ఉంచిన పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

వన్‌టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లి ప్రాంతంలో అనధికారికంగా మట్టి తరలిస్తున్న అక్రమార్కులపై నగర పోలీసు ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. అనధికారిక మట్టి తరలింపుపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావటంతో ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు ఆదేశాలతో ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు, దాడులు చేశారు. రహస్యంగా మట్టి లోడు టిప్పర్లను గుణదల, గుంటూరు జిల్లాలకు తరలిస్తుండడంతో ఏడీసీపీ పక్కా ప్లాన్‌తో నిఘా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కొత్తూరు తాడేపల్లి వైపు నుంచి 30 మట్టి లోడు వాహనాలు బయలుదేరాయని సమాచారం అందుకున్న ఏడీసీపీ తమ సిబ్బందితో పాముల కాలువ, పలు సెంటర్ల వద్ద సిబ్బందిని నియమించారు. ఒక టిప్పర్ డ్రైవర్‌కు తెలియకుండా మరో టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కొత్తపేట పోలీసులకు డ్రైవర్లను అప్పగించారు. పోలీసులు వారిని మైన్స్ డిపార్టుమెంట్ అధికారులకు అప్పగించగా వారి పై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్లను ఏడీసీపీ ఆదేశాల మేరకు కొత్తపేట పోలీసులు జక్కంపూడిలోని ఖాళీ స్థలంలో నిలుపుదల చేశారు. పోలీసులు దాడులు చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న మరికొందరు డ్రైవర్లు పరారయ్యారు.

వాహనాల యజమానులకు జరిమానా

వన్‌టౌన్: కొత్తూరు తాడేపల్లి నుంచి అనధికారికంగా మట్టి తరలించిన వాహనాల యజమానులకు జరిమానా విధించినట్లు ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ తెలిపారు. ఎనిమిది రోజుల నుంచి కొత్తూరు తాడేపల్లికి చెందిన బి.రాజు, మరికొందరు అనధికారికంగా పోలవరం కాలువ మట్టి తరలిస్తుండగా బుధవారం రాత్రి సిబ్బందితో 11 వాహనాలను ఏడీసీపీ అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్క వాహనానికి రూ.22,500 జరిమానా విధించారు. ఎనిమిది వాహనాలకు జరిమానా చెల్లించగా, మరో మూడు వాహనాలకు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పోలవరం కాలువ మట్టి అక్రమంగా తరలించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బి.రాజుతో పాటు, మరికొందరిని ఏడీసీపీ హెచ్చరించారు.

పోలవరం కాలువ వద్ద ఏడీసీపీ రామకృష్ణ తనిఖీలు

అక్రమార్కులు మట్టిని తరలిస్తున్న పోలవరం కాలువ ప్రాంతాన్ని తన సిబ్బందితో కలిసి ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలో నిలుపుదల చేసిన యంత్రాలను పరిశీలించారు. వాటి వివరాలపై ఆరా తీశారు. కాగా, కొండపల్లి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు వాహనాలను ఆయన స్వాధీనం చేసుకుని కొత్తపేట పోలీసులకు అప్పగించారు. పాతపాడు, నున్న మధ్య ఉన్న పోలవరం కాలువ మట్టిని తరలిస్తున్న ప్రాంతంలోనూ తనిఖీలు చేసినట్లు తెలిసింది. మట్టిని తరలిస్తున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మర్యాదపూర్వకంగా..



చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీ హంస ప్రతినిధి బృందం

కృష్ణలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రికగ్నిజేషన్ సంఘం ఏపీ హంస ప్రతినిధి బృందం గురువారం చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మారేడుమిల్లిలో జరిగిన ఘటనను సీఎస్‌కు వివరించి ఇటువంటివి మరలా జరగకుండా ఉండేలా చూడాలని కోరారు. రెగ్యులరైజేషన్ ప్రాసెస్‌లో రెగ్యులర్ కాకుండా విగిలిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాలు, ట్రెజరర్ వై.శ్రీనివాస్, జాయింట్ జనరల్ సెక్రటరీ జాన్ హెన్రి, కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ రామకృష్ణ, విజయవాడ సిటీ ప్రెసిడెంట్ జె.సరోజిని పాల్గొన్నారు.

అల్లుడి దాడిలో అత్త మృతి

- పోరంకి ప్రభునగర్‌లో ఘటన..కేసు నమోదు

పెనమలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తన కుమార్తెను పాఠశాలకు వెళ్లకుండా మాన్పించి, షాపింగ్ మాల్‌లో పనికి చేర్పించారంటూ అత్తపై అల్లుడు దాడి చేశాడు. దీంతో అత్త అక్కడికక్కడే మృతి చెందింది. అల్లుడు పరారయ్యాడు. ఈఘటన పోరంకి ప్రభునగర్ శ్రీనగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తన భర్త నరేష్(తెలంగాణ)తో విభేదాల కారణంగా నారబోయిన స్వర్ణలత పోరంకి ప్రభునగర్ శ్రీనగర్ కాలనీలోని తన తల్లి రాణి వద్ద రెండేళ్లుగా ఉంటోంది. కుమార్తెను ఉయ్యూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివించేవారు. కొంతకాలం క్రితం చదువు ఇష్టంలేదని కుమార్తె బడికి వెళ్లడం మానేసి, తల్లి స్వర్ణలత, అమ్మమ్మ రాణితో కలిసి ఇంటివద్దనే ఉంటోంది. దీంతో నరేష్ తన కుమార్తెను చదువు మాన్పించి పనిలో పెడతారా అంటూ అనేకసార్లు ఇంటికి వచ్చి గొడవ పడుతుండేవాడు. గురువారం తెల్లవారుజామున అత్త రాణి బ్రష్ చేసుకుంటుండగా ఆకస్మాత్తుగా నరేష్ ఇంట్లోకి వచ్చాడు. తన కుమార్తెను బడికి పంపకుండా మాన్పించేస్తారా.. పొలాన్ని కూతురు పేర రాయమంటారా? అని గొడవ పెట్టుకున్నాడు. బూతులు తిడుతూ పక్కనే ఉన్న కర్రతో రాణి తలపై బలంగా మోదాడు. ఆ దెబ్బకు రాణి కింద పడిపోయింది. అత్తపై కూర్చుని రాయితో తలపై బలంగా కొడుతుండడంతో రాణి పెద్దగా అరిచింది. అరుపులు విన్న కూతురు స్వర్ణలత బయటికి వచ్చి చూసేసరికి రాణి కింద పడిపోయి ఉంది. స్వర్ణలతను తోసుకుంటూ నరేష్ బయటకు పరారయ్యా డు. స్థానికులు 108కు ఫోన్ చేసి విజయవాడ జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి రాణి అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నరేష్ కోసం గాలిస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఓ అండ్ ఎం టెండర్లలో

అవినీతిపై హైకోర్టులో కేసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) పరిధిలో ఇటీవల పిలిచిన మంచినీటి రిజర్వాయర్ల ఓ అండ్ ఎం కాంట్రాక్టు టెండర్లలో అవినీతి వ్యవహారాలు జరిగాయని పలువురు కాంట్రాక్టర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇద్దరు కాంట్రాక్టర్లు హైకోర్టులో నాలుగు కేసులు వేశారు. కాంట్రాక్టర్ గుత్తికొండ శేషుకుమార్ 3, కాంట్రాక్టర్ కొల్లి భూపతిరెడ్డి ఒక కేసు వేశారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈ విద్యాసాగర్ పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నారు. ఇటీవల ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించడంతో ఆయన రూటు మార్చారు. వీఆర్ఎస్‌ను వెనక్కి తీసుకుని లాంగ్ లీవు పెట్టాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

హైటెక్ బరులు

- జిల్లాలో కోడి పందేల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు
- అంపాపురంలో 12 ఎకరాల్లో భారీ సెట్టింగ్
- ఎల్ఈడీ తెరలు, విద్యుత్ దీపాలు, వీఐపీ గ్యాలరీలు
- రికార్డు స్థాయిలో పందేల నిర్వహణకు ప్రణాళిక
- హోటళ్లలో రూమ్‌లు బుక్ చేసుకున్న పందెం రాయుళ్లు
- చేతులు మారనున్న కోట్ల రూపాయల నగదు

సంక్రాంతి పండుగ వేళ కోడి పందేల నిర్వహణకు హైటెక్ హంగులతో బరులు సిద్ధమవుతు న్నాయి. బాపులపాడు మండలం అంపాపురంలో 12 ఎకరాల వెం చర్‌లో భారీగా ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఎల్ఈడీ తెరలు, విద్యుత్ దీపాలు, వీఐపీల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను రెడీ చేస్తున్నారు. రికార్డు స్థాయిలో పందేల నిర్వహణకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్ప టికే పందెం రాయుళ్లు హను మాన్‌జంక్షన్‌లో హోటల్ రూమ్ లను బుక్ చేసుకున్నారు. ఈ ఏడాది కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయి.



విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో ఫెన్సింగ్ వేసి బరిని సిద్ధం చేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి-హనుమాన్‌జంక్షన్‌రూరల్ /విజయవాడ రూరల్: సంక్రాంతి కోడి పందేలకు హైటెక్ హంగులతో బరులు రెడీ అవుతున్నాయి. ఒక వైపు అధికారులు ఊరుకునేది లేదంటూ హెచ్చరిస్తు న్నా.. మరో వైపు నిర్వాహకులు ఉరిమే ఉత్సాహంతో చకచకా బరులను సిద్ధం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రా ల్లో పేరెన్నికగన్న బాపులపాడు మండలం అంపాపురం ప్రధాన బరి కాగా, కె.సీతారాంపురం, బిళ్లనపల్లి గ్రామాల్లో చిన్నపాటి బరులను సిద్ధం చేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం, జక్కంపూడిలో పందేలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న 12 ఎకరాల వెంచర్‌లో ఏర్పాటు చేస్తున్న బాపులపాడు మండలం అంపాపురం బరికి హైటెక్ హంగులతో సొబగులద్దుతున్నారు. భారీ సెట్టింగులు, ఎల్ఈడీ తెరలు, వీఐపీ ట్రీట్మెంట్లతో ప్రధాన బరి సిద్ధమవుతుండగా, పక్కనే మరో మూడు బరులను రెడీ చేస్తున్నారు. పేకాట, గుండాట, కోసుల నిర్వహణ, బిర్యానీ పాయింట్ల ఏర్పాట్లకు పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అన్నిరకాల వినోదాలు అందించేందుకు నిర్వాహకులు కార్యాచరణ మొదలుపెట్టారు. ఇప్పటికే రహదారులు శుభ్రం చేసి రంగులు వేస్తూ రాకపోకల మార్గాన్ని ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. రాత్రి పూట పందేలకు ఇబ్బంది లేకుండా భారీ ఎల్ఈడీ లైట్లు, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు ప్రత్యేకంగా జనరేటర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు కోడిపందేల బరితో ప్రత్యేకత చాటుకుంటున్న అంపాపురం మరోసారి రూ.కోట్లలో పందేలు నిర్వహించేందుకు సన్నద్ధమ వుతోంది. పండగ మూడు రోజులు గతంలో జరిగినట్లే భారీగా పందేలు నిర్వహించడంతో పాటు విజేతలకు భారీ నజరానాలు, బహుమతులు ఇచ్చేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకుల్లో ఒకరు తెలిపారు. పందెం రాయుళ్ల విజయవాడ, గన్నవరం లాంటి ప్రాంతాలతో పాటు హనుమాన్‌జంక్షన్ లాంటి గ్రామాల్లో సైతం హోటళ్లలో గదులు బుక్ చేసుకుని పందేల కోసం ఎదురుచూస్తున్నారు.

జక్కంపూడి బరిని ధ్వంసం చేసిన కొత్తపేట పోలీసులు

కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి ప్రాంతంలో ఆఘమేఘాల మీద సిద్ధం చేసిన కోడి పందేల బరిని పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. సుమారు ఎకరం పరిధిలో భూమిని చదును చేసిన విషయాన్ని తెలుసుకున్న ఎస్సై హరిప్రసాద్ సిబ్బందితో బరి వద్దకు చేరుకుని ట్రాక్టర్లతో చదును చేసిన ప్రాంతాన్ని దున్నించారు.

తిరుమలలో తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

» పుష్ప, విద్యుత్ దీపాలంకరణలో కనువిందు చేస్తున్న క్షేత్రం

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. 12.05 గంటల సమయంలో తిరుప్పావై పాశురాలతో ఆలయంలోని బంగారువాకిలి తలుపులు తెరిచారు. అనంతరం 12.25 గంటల సమయంలో వైకుంఠద్వారం వద్ద అర్చకులు పూజలు, హారతి సమర్పించి తోమాలపటంతో ప్రదక్షణగా గర్భాలయానికి చేరుకుని మూల విరాట్టుకు పుష్ప సమర్పణ చేశారు. తర్వాత ధనుర్మాస ప్రత్యేక కైంకర్యాలు, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. కాగా, శుక్రవారం వేకువజాము అభిషేకం, అలంకారం, తోమాల, అర్చన, నైవేద్యం నిర్వహించి 4.30 గంటలకు వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రారంభించనున్నారు. సాధారణంగా వైకుంఠ ఏకాదశి ముందురోజు మధ్యాహ్నం నుంచే తిరుమలలో వీఐపీల హడావుడి నెలకొంటుంది. కానీ, తిరుపతిలో సర్వదర్శన టోకెన్ల జారీ క్యూలైన్లలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందిన నేపథ్యంలో రాజకీయ ప్రముఖులంతా గురువారం తిరుపతిలో జరిగిన సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనల్లోనే ఉండిపోయారు. దీంతో గురువారం రాత్రి 7 గంటల వరకు కూడా తిరుమల సాధారణంగానే కనిపించింది. టోకెన్లు, టికెట్లు పొందిన భక్తులతో తిరుమలలో ఒక మోస్తరు రద్దీ కనిపించింది. శుక్రవారం నుంచి మొదలయ్యే వైకుంఠ ద్వార దర్శనాలు ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి వరకు కొనసాగనున్నాయి. మరోవైపు తిరుమలలో స్థానికులకు గురువారం వేకువజాము 4.50 గంటల నుంచి సాయంత్రం వరకు 1,700 టోకెన్లు జారీ చేశారు. తిరుపతిలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని స్థానికేతరులెవ్వరూ తిరుమలలోని టోకెన్ల జారీ కౌంటర్ వద్దకు రాకుండా పోలీసులు జాగ్రత్త పడ్డారు. ఇక, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణలు కనువిందు చేస్తున్నాయి.


విద్యుద్దీప కాంతుల్లో తిరుమల శ్రీవారి ఆలయం

అదనపు బాదుడు లేకుండానే!

» సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసులు
» ప్రైవేటు బస్సుల్లోనూ ఆర్టీసీ రేట్లు తీసుకునేలా ప్రయత్నిస్తున్నాం
» రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెల్లడి

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అదనపు బాదుడు లేకుండా ఈసారి సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వచ్చిన తొలి సంక్రాంతికి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో పండగకు ప్రత్యేక సర్వీసులు ఉంటే ప్రయాణికులపై అదనపు బాదుడు ఉండేది. ఈసారి అటువంటి అదనపు చార్జీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం' అని ఆయన వివరించారు. ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని చెప్పారు. రాయలసీమలో కొన్ని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని చేసిన విజ్ఞప్తికి గడ్కరీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతా

» 31,590 ఎకరాలు అన్యాక్రాంతం: చైర్మన్ అజీజ్

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. బోర్డు ఆస్తుల్లో 31,590 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయన్నారు. వాటిని కొన్నవారు వెనక్కి ఇవ్వాల్సిందేనన్నారు. వక్ఫ్ భూముల ఆక్రమణలపై 40 ఫిర్యాదులు వచ్చాయని, దర్యాప్తునకు ఆదేశించామన్నారు.

జీవో 117 రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించింది. దీనిలో భాగంగా ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు గురువారం సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు విడుదల చేశారు. వీటి ఆధారంగా రాబోయే 2నెలల పాటు క్షేత్రస్థాయిలో మరోసారి అధ్యయనం చేస్తారు. ఫిబ్రవరి చివరి నాటికి ఈ కసరత్తును పూర్తిచేసి జీవో 117 పూర్తిగా రద్దు చేస్తారు. ఆ తర్వాత కొత్తగా జారీచేసే జీవో ఆధారంగా ఏప్రిల్‌లో ఉపాధ్యాయ బదిలీలు ఉంటాయి. విద్యారంగంలో సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోతో ప్రాథమిక విద్యా నిట్టనిలువునా చీలిపోయింది. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో తల్లిదండ్రులు ప్రైవేటు బడుల బాట పట్టారు. నాటి సీఎం జగన్ అనాలోచిత నిర్ణయం ఊరి బడికి ఉరిగా మారింది. ఈ జీవోతో ప్రాథమిక విద్యావ్యవస్థకు నష్టం వాటిల్లుతుందని ఉపాధ్యాయులు, మేధావులు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ ఈ జీవోకు స్వస్తి పలికేందుకు ప్రక్రియను ప్రారంభించింది.

ఐదు రకాల పాఠశాలలు

కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలను ప్రతిపాదించారు. శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్‌లో ప్రీప్రైమరీ 1, 2 తరగతులు ఉంటాయి. వీటిని మహిళా, శిశు సంక్షేమ శాఖ నడుపుతుంది. ఫౌండేషనల్ స్కూల్‌లో ప్రీప్రైమరీ 1, 2, 1-2 తరగతులుంటాయి. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో ప్రీప్రైమరీ 1, 2, 1- 5 తరగతులు ఉంటాయి. మోడల్ ప్రైమరీ స్కూల్‌లోనూ ప్రీప్రైమరీ 1, 2, 1-5 తరగతులుంటాయి. వీటిలో ప్రతి తరగతికి ఒక్కో టీచర్ చొప్పున ఉంటారు. ఉన్నత పాఠశాల్లో 6-10 తరగతులుంటాయి. ఇక ప్రాథమిక పాఠశాలల్లో వేటిని మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చాలో గుర్తించేందుకు మండల స్థాయి, క్లస్టర్ స్థాయిలో కమిటీలను నియమించారు. ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపాలిటీ వార్డుల్లో ఈ స్కూళ్లను ఏర్పాటుచేస్తారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు వెనక్కి తీసుకొస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6-8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30, అంతకంటే తక్కువగా ఉంటే అక్కడి తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, దాన్ని ప్రాథమిక పాఠశాలగా మారుస్తారు. ఈ తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 60, అంతకంటే ఎక్కువ ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 30 నుంచి 60 మధ్యలో ఉంటే బడిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. ప్రాథమికోన్నత పాఠశాలకు 3కి.మీ. పరిధిలో ఉన్నత పాఠశాల లేకపోతే అక్కడ దాన్ని కొనసాగిస్తారు. లేదంటే విద్యార్థులకు రవాణా చార్జీలు ఇస్తారు.

11వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యనభ్యసిస్తున్న 11వ తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 19 వరకు పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. గతేడాది దసరా సెలవుల్లో 10, 11, 12వ తరగతుల విద్యార్థులు 8వేల మంది ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నారని వెల్లడించారు. ఈసారి 10 ట్రేడుల్లో జరిగే ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని డీఈవోలు, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, జీసీడీవోలను ఆదేశించారు.

టీచర్ల కేటాయింపు ఇలా...

కొత్త పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల కేటాయింపులోనూ మార్పులు చేయనున్నారు.

- ఫౌండేషనల్ స్కూల్‌లో 1-30 మంది విద్యార్థులకు ఒక సెకండరీ గ్రేడ్ టీచర్‌ను, 31- 60 మంది వరకు రెండో ఎస్జీటీని కేటాయిస్తారు.
- బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో 1- 20 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని, 21- 60 మందికి ఇద్దరు ఎస్జీటీలను కేటాయిస్తారు.
- మోడల్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 60కి చేరితే ప్రతి తరగతికి ఒక టీచర్‌ను ఇస్తారు. విద్యార్థుల సంఖ్య 120 దాటితే హెచ్‌ఎం పోస్టు, 150 దాటితే ప్రతి అదనపు 30 మంది విద్యార్థులకు మరో ఎస్జీటీని కేటాయిస్తారు.
- ఉన్నత పాఠశాలల్లో సెక్షన్ల వారీగా టీచర్లను కేటాయిస్తారు. కనీసం 5 సెక్షన్లు ఉంటే ఒక హెచ్‌ఎం, ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్‌ను ఇస్తారు. గరిష్ఠంగా 31 సెక్షన్లు ఉంటే హెచ్‌ఎంతో పాటు మొత్తం 31 మంది టీచర్లుంటారు.
- ఉన్నత పాఠశాలల్లో 76, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే హెచ్‌ఎం, పీఈటీ పోస్టులు ఇస్తారు. అదే విద్యార్థుల సంఖ్య 75, అంతకంటే తక్కువగా ఉంటే ఆ పాఠశాలలో సీనియర్ టీచర్ హెచ్‌ఎంగా వ్యవహరిస్తారు. జిల్లాలో అదనంగా పీఈటీలు ఉంటే కేటాయిస్తారు.
- ఉన్నత పాఠశాలల్లో 400 మంది విద్యార్థులు దాటితే రెండో పీఈటీ, 751 దాటితే మూడో పీఈటీ పోస్టు ఇస్తారు.
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా మ్యూజిక్, ఆర్ట్ అండ్ డ్రాయింగ్, క్రాఫ్ట్‌లో ఎవరైనా ఒక టీచర్‌ను ఉన్నత పాఠశాలలకు కేటాయిస్తారు.

బాలకృష్ణ, అనిత, మంద కృష్ణ పైనే పోస్టులు పెట్టా

» మిగతా పోస్టులు.. ఫోన్ల గురించి తెలియదు
» అర కొర సమాధానాలతో సరిపెట్టిన వర్రా రవీంద్రరెడ్డి
» ముగిసిన పోలీసు కస్టడీ.. మరోసారి పిలిచే యోచన

కడప, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'సినీనటుడు.. ఎమ్మెల్యే బాలకృష్ణ, హోంమంత్రి అనిత, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కుటుంబసభ్యులపై మాత్రమే సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టా. మిగతా వాటి గురించి నాకు తెలియదు' అని వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్టు తెలిసింది. కడప సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న రవీంద్రరెడ్డిని పులివెందుల పోలీసులు రెండ్రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విచారణ సాగింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. సజ్జల భార్గవరెడ్డి ఆయన తండ్రి రామకృష్ణారెడ్డి అభయంతోనే పోస్టులు పెట్టానని రెండో రోజు విచారణలోనూ రవీంద్రరెడ్డి చెప్పారు. బూతు కంటెంట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేసిన వెంటనే రవీంద్రరెడ్డి వైసీపీ కీలక నేతలకు ఫోన్లు చేశాడు. ఆ పోస్టులు, కాల్ రికార్డులను చూపి పోలీసులు ప్రశ్నించగా.. ఆ నంబర్లు ఎవరివో.., వాళ్లెవరో తనకు తెలియదని చెప్పినట్టు తెలిసింది. పోస్టులు పెట్టినందుకు డబ్బులు ఇచ్చారా అని ప్రశ్నించగా.. 'సజ్జల భార్గవరెడ్డి, రామకృష్ణారెడ్డి సూచనల మేరకే పోస్టులు పెట్టాం. ఎన్నికల ముందు వైజాగ్, తాడేపల్లిలో జరిగిన సోషల్ మీడియా సమావేశాలకు హాజరయ్యాను. దీనికి సజ్జల కూడా వచ్చారు. ఎన్నికల ముందు టీడీపీ, జనసేనపై పోస్టులు పెట్టాలని చెప్పారు. పోస్టులు పెట్టు.. నీకు పార్టీ అండగా ఉంటుంది, రాజకీయ భవిష్యత్తు ఉంటుంది అన్నారు. వారి సూచనల మేరకు పోస్టులు పెట్టాను' అని వర్రా సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. కాగా, మాజీ సీఎం జగన్ తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల, సునీతలపై పోస్టులు పెట్టిన వెంటనే పులివెందుల కీలక నేతలకు వర్రా ఫోన్ చేశాడు. వాటి గురించి పోలీసులు ప్రశ్నించగా.. తెలియదని సమాధానం ఇచ్చాడు. సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు పెట్టాక ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి, ఎంపీ గత పీఏలు లోకేశ్, రమణారెడ్డిలతో వర్రా మాట్లాడాడు. దీనిపై ప్రశ్నించగా గుర్తులేదని చెప్పాడు. వర్రా రవీంద్రరెడ్డి విచారణకు పూర్తిగా సహకరించకపోవడంతో మరోసారి కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు కోర్టులో పిటిషన్ వేయనున్నారని తెలిసింది.

సునీల్‌కుమార్‌తో నీకు సంబంధమేంటి?

» ఆ రోజు సీఐడీ ఆఫీసులో ఎందుకున్నావ్?
» రఘురామకు చిత్రహింసల కేసులో.. తులసిబాబుపై పోలీసుల ప్రశ్నలవర్షం
» విజయ్‌పాల్‌తో కలిపి విచారణ
» తులసిబాబును రిమాండ్‌కు పంపిన కోర్టు
» కోర్టుకు వచ్చిన గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే రాము.. పార్టీ వర్గాల్లో కలకలం

ఒంగోలు క్రైం/గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌తో నీకున్న సంబంధం ఏమిటి.. ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా అని 'ప్రైవేటు వ్యక్తి' తులసిబాబును విచారణాధికారి, ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రశ్నించినట్లు తెలిసింది. రఘురామ గుండెలపై కూర్చొని దాడి చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తులసిబాబును.. సీఐడీ విశ్రాంత ఏఎస్పీ విజయ్‌పాల్‌ను కలిపి ఆయన బుధవారం సుదీర్ఘంగా విచారించారు. ఇప్పటికే సేకరించిన పక్కా ఆధారాలతోపాటు సాంకేతిక సాక్ష్యాలతో బుధవారం రాత్రి తులసిబాబును ప్రశ్నించినట్లు సమాచారం. రఘురామ రాసిన లేఖతో పాటు సీఐడీ కార్యాలయంలో జరిగిన కస్టోడియల్ టార్చర్‌పై అనేక సాక్ష్యాలను అతడి ముందుంచినట్లు తెలిసింది. వాటిని చూసిన అతడికి ముచ్చెమటలు పట్టినట్లు సమాచారం. 'ఆ రోజు సీఐడీ కార్యాలయంలో ఎందుకు ఉన్నావు? సీఐడీ లీగల్ అడ్వయిజర్‌గా నిన్ను ఎవరు నియమించారు..? మీ సొంత గ్రామమైన బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం రాంకూరులో అగ్రిగోల్డ్ నిధులు ఎలా మళ్లించారు' అని ఎస్పీ ప్రశ్నించినట్లు తెలిసింది. వీటికి తులసిబాబు నుంచి సరైన సమాధానాలు రాలేదని సమాచారం. ఈ క్రమంలో పోలీసులు తమ వద్ద ఉన్న పక్కా ఆధారాలతో అతడిని బుధవారం రాత్రి పదిన్నర గంటలకు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. గురువారం ఉదయం విజయ్‌పాల్‌ను, సాయంత్రం తులసిబాబును పటిష్ఠ భద్రత మధ్య గుంటూరుకు తరలించారు. తులసిబాబును రాత్రి 11 గంటల సమయంలో గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వాదనల అనంతరం అతడిని 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. రాత్రికి రాత్రే అతడిని జిల్లా జైలుకు తరలించారు. ఇంకోవైపు.. ఈ కస్టోడియల్ టార్చర్ కేసులో తులసిబాబు కాక మిగతా ముగ్గురి పాత్రపైనా పోలీసులు దృష్టిసారించారు. కస్టడీలో ముఖానికి మాస్కులు ధరించి ఉన్న నలుగురు ఎవరనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో విజయ్‌పాల్ నుంచి కొంత సమాచారం సేకరించినట్లు తెలిసింది. తులసిబాబును కూడా పోలీసు కస్టడీకి కోరే అవకాశం ఉంది. కాగా.. గుంటూరు కోర్టుకు గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. తులసిబాబు వెంట రావడం చర్చనీయాంశమైంది. పీవీ సునీల్‌కుమార్‌కు ప్రధాన అనుచరుడిగా ఉన్న ఇతడు ఆ తర్వాత వెనిగండ్ల రాముకు సన్నిహితుడిగా మారారు. తాజా పరిణామాలు టీడీపీ వర్గాల్లో ఇది కలకలం రేపుతున్నాయి.


మేజిస్ట్రేట్ నివాసం నుంచి తులసిబాబును జైలుకు తరలిస్తున్న పోలీసులు

'తులసి' ఓవరాక్షన్‌పై పోలీసు యాక్షన్

ఒంగోలులో తమపై రెచ్చిపోయిన తులసిబాబు అనుచరులపై పోలీసు యాక్షన్ మొదలైంది. రఘురామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తులసిబాబు బుధవారం తన అనుచరులతో భారీ సంఖ్యలో కార్లతో ర్యాలీగా విజయవాడ నుంచి ఒంగోలు వచ్చారు. వారంతా ఇక్కడి ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట హల్‌చల్ చేశారు. కార్యాలయంలోకి దౌర్జన్యంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో వారిని కొందరు బెదిరించారు. 'యూనిఫాంతో గుడివాడ రండి.. మీ అంతు చూస్తాం.. ఎస్పీ కార్యాలయం ఊరి బయట కట్టుకోండి' అంటూ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై విరుచుకుపడ్డారు. దీంతో అక్కడ విధుల్లో ఉన్న ఎస్ఐ ఒకరు తాలూకా పోలీసు స్టేషన్‌లో తులసిబాబు అనుచరులపై ఫిర్యాదు చేశారు. 20 మందికి పైగా గుంపు వచ్చి తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని.. జిల్లా కార్యాలయం ప్రధాన ద్వారాన్ని నెట్టుకుంటూ లోపలికి చొరబడే ప్రయత్నం చేశారని అందులో పేర్కొన్నారు. ఈ మూకలో కృష్ణా జిల్లాకు చెందిన సత్యసాయి అలియాస్ సాయి ఉన్నట్లు వెల్లడైందన్నారు. గురువారం ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే 10 మందిని గుర్తించారు.

నేడు గుంటూరులో ముఖ్యమంత్రి పర్యటన

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం గుంటూరు నగరానికి రానున్నారు. జాతీయ రియల్ ఎస్టేట్ అభివృద్ధి మండలి(ఎన్ఆర్ఈడీసీవో) ఆధ్వర్యం లో మూడు రోజుల పాటు జరిగే ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతిలో నిర్మాణ రంగం, పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై ప్రసంగిస్తారు. ఉదయం 11 గంటలకు సీఎం చంద్రబాబు ప్రాపర్టీ షో జరిగే చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణానికి చేరుకొంటారని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు.

తక్షణ సాయం 151.77 కోట్లు ఇవ్వండి

» కేంద్ర బృందాన్ని కోరిన ప్రభుత్వం


కరువు పరిస్థితులపై కేంద్ర బృందంతో సమావేశమైన సిసోడియా

అమరావతి, తాడేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వచ్చిన కరువు పరిస్థితులను అధిగమించేందుకు, రైతులను ఆదుకునేందుకు తక్షణ సాయంగా 151.77 కోట్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈమేరకు రెవెన్యూ, విపత్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా కేంద్ర బృందానికి నివేదిక ఇచ్చారు. గురువారం ఇక్కడి విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో కేంద్ర బృందంతో ఆయన సమావేశం నిర్వహించారు. గత కొద్దిరోజులుగా కేంద్ర బృందం కరువు పీడిత ప్రాంతాలైన అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, అనంతపురం, కర్నూలు, తదితర జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యాక తాడేపల్లిలో సిసోడియాతో భేటీ అయ్యింది. కరువు ప్రభావంతో పత్తి, జొన్న, వేరుశనగ, ఎర్రశనగలు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని కేంద్ర బృందానికి సిసోడియా తెలిపారు. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో 54 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించామన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రెటరీ పెరిన్‌దేవి చెప్పారు.

వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాంకు ముందస్తు బెయిల్

» టీడీపీ నేత ఆత్మహత్య కేసులో మంజూరు చేసిన హైకోర్టు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కారంపూడి రవీంద్ర ఆత్మహత్య వ్యవహారంలో పోలీసులు నమోదు చేసిన కేసులో వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మరికొందరికి హైకోర్టు పలు షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తు అధికారి సంతృప్తి మేరకు రూ.10వేల చొప్పున ఒకొక్కరు రెండు పూచీకత్తులు సమర్పించాలని నిందితులను ఆదేశించింది. చార్జ్‌షీట్ దాఖలు చేసేంత వరకు ప్రతీవారం దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం తీర్పు ఇచ్చారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ అమలుపై ఆదేశాలివ్వండి

» హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో దివ్యాంగులకు 4శాతం రిజర్వేషన్ అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారం పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని స్త్రీ, శిశు, దివ్యాంగుల శాఖ ముఖ్య కార్యదర్శి, తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగులకు 4శాతం రిజర్వేషన్ అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఇండియన్ డిసేబుల్డ్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుంటుపల్లి సతీశ్ గోవింద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

వేళకాని వేళలో సినిమా ప్రదర్శనా?

- 16 ఏళ్లలోపు పిల్లల పరిస్థితి ఏమిటి?
- 15 నిమిషాల వ్యవధిలో జన నియంత్రణ ఎలా?
- తెలంగాణ హైకోర్టు ప్రశ్నలు
- 'గేమ్ ఛేంజర్'పై పిటిషన్‌లు.. నేడూ విచారణ

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వేళకాని వేళలో అత్యంత ప్రజాదరణ కలిగిన సినిమాల ప్రదర్శనకు అనుమతివ్వడం ఎందుకని హైకోర్టు ప్రశ్నించింది. తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రదర్శించే సినిమాలకు వెళ్లే 16 ఏళ్లలోపు పిల్లల పరిస్థితి ఏమిటి? వారి ఆరోగ్యంపై చెడు ప్రభావం పడటం ఎంతవరకు సమంజసమని వ్యాఖ్యానించింది. 16 ఏళ్ల లోపు పిల్లలను రాత్రివేళ సినిమాలకు రానివ్వకుండా అడ్డుకోవాలని వ్యాఖ్యానించింది. రాత్రి సమయాల్లో భారీగా వచ్చే జనాలను అదుపు చేయడం ఎవరి బాధ్యత? పోలీసులపై ఇది అదనపు భారం కాదా పేర్కొంది. ఒక షోకు మరో షోకు మధ్య కేవలం 15 నిమిషాల వ్యవధి మాత్రమే ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 15 నిమిషాల వ్యవధిలో వందల మంది వాహనాలను తీసుకుని వెళ్లడం, వందల వాహనాలను పార్కింగ్ చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. ప్రస్తుత పిటిషన్‌లకు ప్రజాప్రయోజన వ్యాజ్య స్వభావం ఉందని, అదనపు షోలు, బెనిఫిట్ షోలు, రేట్లపెంపుపై ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని పేర్కొంటూనే గేమ్ ఛేంజర్ సినిమాకు అదనపు షోల ప్రదర్శనకు, టికెట్ల రేట్ల పెంపునకు అనుమతిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీచేయడాన్ని సవాల్ చేస్తూ గురువారం హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో వేర్వేరు పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారించింది.

మోహన్‌బాబుకు ఉపశమనం

- జర్నలిస్టుపై దాడి కేసులో కఠిన చర్యలు తీసుకోవద్దన్న సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి కేసులో సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. ఈ కేసులో తదుపరి విచారణ జరిగే వరకు మోహన్‌బాబుపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసు శాఖను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించి మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేయడంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాల ధర్మాసనం ఆ పిటిషన్‌ను గురువారం విచారించింది. మోహన్‌బాబు తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. ఘటన జరిగిన పరిస్థితులను వివరించారు. క్షణికావేశంలో మోహన్‌బాబు మైక్ విసిరారని తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పడానికి, అవసరమైతే నష్టపరిహారం చెల్లించడానికి మోహన్‌బాబు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. బాధిత జర్నలిస్టును మోహన్‌బాబు ఇప్పటికే స్వయంగా పరామర్శించారని కూడా తెలియజేశారు. ఇందుకు, జర్నలిస్టు తరఫు న్యాయవాది స్పందిస్తూ.. మోహన్‌బాబు చేసిన దాడి వల్ల బాధిత జర్నలిస్టు ముఖానికి శస్త్ర చికిత్స జరిగిందని, ఐదు రోజులు ఆస్పత్రిలోనే గడిపారని తెలిపారు. అనంతరం.. రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. మోహన్‌బాబు జర్నలిస్టును బెదిరించలేదని, ఆయనను జైల్లో ఉంచాల్సిన కేసు కాదని అన్నారు.

ఏసీబీ విచారణకు కేటీఆర్

- ఆరున్నర గంటల విచారణ.. 50కి పైగా ప్రశ్నలు
- ఫార్ములా-ఈపై పలు కోణాల్లో విచారించిన అధికారులు



హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు.. తెలియదు అన్న సమాధానాలు.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచటం కోసం తాము కృషి చేస్తే ఇప్పుడు రంధ్రాన్వేషణ ఏమిటంటూ నిలదీత.. అడిగిన ప్రశ్నలే మళ్లీ ఎన్నిసార్లు అడుగుతారు.. కావాలంటే, అరెస్టు చేసుకోండని సవాల్.. చివరికి.. 'మీరిక వెళ్లొచ్చు' అని అధికారులు చెప్పినప్పుడు.. ముఖంలో ఆశ్చర్యంతో కూడిన ఆనందం.. ఏసీబీ విచారణ సందర్భంగా కేటీఆర్‌లో కనిపించిన భిన్న స్పందనలు ఇవీ. ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు గురువారం ఆరున్నర గంటలకుపైగా విచారించి 50కి పైగా ప్రశ్నలు సంధించారు. ఉదయం పది గంటల సమయంలో ఏసీబీ కార్యాలయానికి తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి వెళ్లిన కేటీఆర్ సాయంత్రం ఐదు తర్వాత బయటకు వచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఒక గదిలో కూర్చోబెట్టి, ఆయన కన్పించే విధంగా మరికొంత దూరంలో న్యాయవాది రాంచందర్‌రావును కూర్చోపెట్టారు. విచారణ పూర్తిగా సీసీ కెమెరాలతో కవర్ అయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. విచారణ ప్రక్రియను ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి పర్యవేక్షించగా జాయింట్ డైరెక్టర్ రుతిరాజ్, అడిషనల్ ఎస్పీ శివరాం శర్మ, సీఐయూ యూనిట్ డీఎస్పీ మాజిద్‌ఖాన్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఫార్ములా-ఈ రేసు ఒప్పందం, క్యాబినెట్ ఆమోదం తీసుకోకపోవడం, డబ్బుల బదిలీ, సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, స్పాన్సరర్ కంపెనీతో సాన్నిహిత్యం తదితర విషయాలపై ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన ఐఏఎస్ అధికారి దానకిషోర్ వాంగ్మూలం, సహనిందితుడైన ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ వాంగ్మూలం ఆధారంగా కూడా ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది.

పలు కోణాల్లో ప్రశ్నలు

ఫార్ములా-ఈ రేసు తొలి ఒప్పందం ఏ విధంగా జరిగింది? దీనికి స్పాన్సరర్‌గా గ్రీన్కో కంపెనీకి చెందిన ఏస్ నెక్ట్స్‌జెన్‌ను ఎందుకు ఎంపిక చేశారు? వారికి క్రీడల నిర్వహణలో ఎలాంటి అనుభవం లేకున్నా.. వారినే ఎంపిక చేయడానికి కారణాలేమిటి? టెండర్లకు వెళ్లకుండా ఆ కంపెనీకే ప్రత్యక్షంగా అవకాశం ఎలా ఇచ్చారు? చలమలశెట్టి అనిల్‌కు మీకు మధ్య ఉన్న అనుబంధం ఏమిటి? అనే ప్రశ్నలను కేటీఆర్‌ను అడిగినట్లు తెలుస్తోంది. ఫార్ములా-ఈ కారు రేసు 9వ సెషన్ పూర్తయిన తర్వాత 10వ సెషన్‌కు సంబంధించి స్పాన్సరర్ తప్పుకుంటున్నట్లు మీకు ఎవరు చెప్పారు? త్రైపాక్షిక ఒప్పందం నుంచి స్పాన్సరర్ తప్పుకుంటే ఆ కంపెనీపై చట్టపరమైన చర్యలకు ఎందుకు వెళ్లలేదు? లీగల్ నోటీసు ఇద్దామని పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ చెబితే మీరేమన్నారు? లీగల్ నోటీసు ఎందుకు వద్దన్నారు? అంటూ ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. అయితే, ఈ ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇవ్వకుండా ఎదురు ప్రశ్నలు వేశారని సమాచారం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచటం కోసం తాను ఫార్ములా-ఈ కారు రేసును తీసుకొస్తే అందులో మీరు బొక్కలెతుకుతున్నారని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది. ఏస్ నెక్ట్స్‌జెన్ విషయంలో నాటి అధికారుల సూచన మేరకే వ్యవహరించానని, ఎఫ్‌ఈఓతో పురపాలకశాఖ మరో ఒప్పందం చేసుకోవడంలో తప్పేముందని కేటీఆర్ ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. క్యాబినెట్ అనుమతి లేకుండా నిర్ణయం ఎలా తీసుకున్నారని ప్రశ్నించగా, క్యాబినెట్ అనుమతి లేకుండానే ఈ ప్రభుత్వం రేసును రద్దు చేసింది కదా! అని కేటీఆర్ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పురపాలకశాఖ, ఎఫ్‌ఈఓ మధ్య ఒప్పందం జరిగితే పురపాలకశాఖ నిధులు వాడాలి కానీ, హెచ్ఎండీఏ నిధులు సుమారు రూ.46 కోట్లు ఎందుకు విదేశీ కంపెనీకి విదేశీ కరెన్సీ రూపంలో పంపించారు అని ప్రశ్నించగా, నిధుల ఖర్చు సంగతి అధికారులదని, విదేశీ కంపెనీకి వెళ్లిన డబ్బు అక్కడే ఉందని వారు చెబుతుంటే ఇక నిధులు దుర్వినియోగం అయ్యింది ఎక్కడ అని కేటీఆర్ బదులిచ్చారు.

టెన్షన్‌లో కేటీఆర్!

విచారణ ప్రారంభించినప్పటి నుంచి కేటీఆర్ కొంత టెన్షన్‌గానే ఉన్నారని, పలుమార్లు అధికారులు విరామం ఇచ్చి ప్రశ్నలు అడిగినా ఆయనలో అసహనం కన్పించిందని, లంచ్ టైంలోనూ ముభావంగా ఉన్నారని సమాచారం. విచారణ ముగిసిన తర్వాత మీరు వెళ్లిపోవచ్చు అని ఏసీబీ అధికారులు చెప్పినపుడు కేటీఆర్ ముఖంలో ఆశ్చర్యం, ఆనందం కనిపించిందని.. మంచినీళ్లు తాగి ఆయన ఏసీబీ ఆఫీసు నుంచి బయటకు వచ్చేశారని తెలిసింది.

సంక్రాంతి తర్వాత మరోసారి విచారణ

తొలిరోజు విచారణలో ఏమీ బయటపడకపోవడంతో కేటీఆర్‌ను మరోసారి విచారణకు పిలవాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో మూడో నిందితుడైన బీఎల్ఎన్ రెడ్డి విచారణ కూడా ముగిసిన తర్వాత కేటీఆర్‌ను సంక్రాంతి పండుగ అనంతరం మళ్లీ పిలవవచ్చని తెలుస్తోంది.

'సంక్రాంతికి వస్తున్నాం' టికెట్ ధరల పెంపు

వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా టికెట్ల ధరలు పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నెల 14న విడుదల కాబోతున్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షోలకు, 15వ తేదీ నుంచి ఐదు ప్రదర్శనలకు అనుమతి లభించింది. మల్టీప్లెక్స్‌లలో అదనంగా రూ.125, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.100 పెంచుకోవచ్చని రాష్ట్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

సవాలు విసిరిన పాత్ర



- ప్రగ్యా జైస్వాల్

'నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర కావేరి. నేను ఇప్పటివరకు పోషించిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర నాకు నటిగా సవాలు విసిరింది' అని 'డాకు మహారాజ్'లో తన పాత్ర గురించి వివరించారు ప్రగ్యా జైస్వాల్. నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి తెరకెక్కించిన చిత్రమిది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈనెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రగ్యా జైస్వాల్ మీడియాతో ముచ్చటిస్తూ 'బాలకృష్ణగారితో వరుసగా సినిమాలు చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. బాలకృష్ణగారికి సినీ పరిశ్రమలో ఎంతో అనుభవం ఉన్నప్పటికీ, ఇంకా కొత్తగా నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. బాబీ కొల్లి అద్భుతమైన దర్శకుడు. నా పుట్టిన రోజైన జనవరి 12న ఈ చిత్రం విడుదల అవుతుండటం నా అదృష్టం' అని అన్నారు.

మనసుల్ని హత్తుకునే సినిమా



దర్శకుడు సుకుమార్ తనయ సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకురాలు. సుకుమార్ సతీమణి సబితా సమర్పణలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, శేష సింధూరావు నిర్మించారు. ఈ నెల 24న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను మహేశ్‌బాబు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ "ఇది అందరి మనసుల్ని హత్తుకునే సినిమాలా ఉంది. చిత్రబృందానికి నా అభినందనలు" అని చెప్పారు.

ప్రతీ పాటకు ఆ పద్ధతి సరికాదు



'సలార్', 'రాధేశ్యామ్', 'సీతా రామం' వంటి సూపర్ హిట్ సినిమాల్లో రాసిన పాటలతో గుర్తింపు తెచ్చుకున్న గీత రచయిత కె.కె(కృష్ణకాంత్). ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న 'రాజా సాబ్', 'ఫౌజీ' చిత్రాలకు పాటలు రాస్తున్న కె.కె.. గురువారం మీడియాతో ముచ్చటించారు. "డైరెక్ట్‌గా పాటలు రాయడం కంటే డబ్బింగ్ సినిమాలకు పాటలు రాయడం సవాలుతో కూడుకున్నది. సినిమాకు ఓ పాట లేదా రెండు పాటలు రాయడం కంటే సింగిల్ కార్డ్ రాయడం మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పుడు ప్రతీ మ్యూజిక్ డైరెక్టర్ హుక్ లైన్స్ కోరుతున్నాడు. ఆ ఒత్తిడి గీత రచయితలందరిపై ఉంటోంది. అయితే, ఈ హుక్ లైన్ ట్రెండ్ అన్ని పాటలకు సరికాదు" అని చెప్పారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో వేధింపులు....



ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తు తెలియని వ్యక్తి చంపేస్తానంటూ వేధింపులకు గురిచేస్తున్నాడంటూ నటి నిధి అగర్వాల్ హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసభ్య సందేశాలు పంపడమే కాకుండా, తనని, కుటుంబ సభ్యులను చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.. తరచు ఇన్‌స్టాగ్రామ్‌లో వస్తున్న వేధింపులతో మానసిక వేదనకు గురవుతున్నానని, నిందితుడిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

చిత్రజ్యోతి

SINCE 1965

సినిమాకు కథే ప్రాణం



'మంచి కథే సినిమాకు ప్రాణం. మొదట్నుంచి ఆ కథను నమ్ముకునే సినిమాలు తీశాను.. 'తల్లి మనసు' చిత్రం కూడా ఇంటిల్లిపాది చూసే విధంగా చక్కగా రూపుదిద్దుకుంది' అని సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య అన్నారు. రచిత మహాలక్ష్మీ, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకత్వంలో ముత్యాల సుబ్బయ్య తనయుడు ముత్యాల కిశోర్ నిర్మించిన చిత్రం 'తల్లి మనసు'. ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య పాత్రికేయులతో మాట్లాడుతూ 'దర్శకుడిగా 50 సినిమాలు తీశాను. మంచి కథలను ఎంచుకోవడమే కాదు, వాటికి తగ్గ మంచి టైటిల్స్ పెట్టి, ప్రేక్షకుల ఆదరణతో నా సినీ ప్రయాణం సాగింది. నా దగ్గర, చిత్ర పరిశ్రమలో దర్శకత్వ శాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న వి.శ్రీనివాస్‌ని ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. ప్రేక్షకుల మనసులను హత్తుకునేలా ఉంటుందీ చిత్రం. ఫీల్ గుడ్ మూవీ అని సెన్సార్ సభ్యులు కూడా ప్రశంసించారు. తల్లి లేకుండా ప్రపంచమే లేదు. అలాంటి తల్లి భావోద్వేగం, తపనను ఈ చిత్రంలో చక్కగా ఆవిష్కరించాం. కథకు తగ్గట్టు మూడు పాటలు ఉంటాయి' అని తెలిపారు.

ఆనందమాయే



హాస్యనటుడు బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్రహ్మా ఆనందం'. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్స్‌గా నటించారు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. గురువారం చిత్ర బృందం 'ఆనందమాయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. శాండిల్య పీసపాటి సంగీత సారథ్యంలో మనీషా, యశ్వంత్‌నాగ్ ఆలపించారు. సాయికిరణ్ సాహిత్యం అందించారు.


सत्यमेव जयते
GOVERNMENT OF GUJARAT
The Sky Adorned with Kites
Shri Narendra Modi
Hon'ble Prime Minister, India
Shri Bhupendrabhai Patel
Hon'ble Chief Minister, Gujarat
International KITE FESTIVAL
— 11th to 14th —
January, 2025
INTERNATIONAL Kite FESTIVAL 2025
11 to 14 January, 2025
Every year, the International Kite Festival turns Gujarat's sky into a living celebration. Traditional Indian designs and artistic creations from 47 countries with 143 international kite flyers will rise to create a spectacle unlike any other. It's more than a festival. It's where cultures connect, hearts soar, and the sky becomes alive.
Be where the action is
AHMEDABAD
11th - 14th January, 2025
SOU-Ekta Nagar
12th January, 2025
SURAT
13th January, 2025
RAJKOT
12th January, 2025
SHIVRAJPUR
13th January, 2025
VADODARA
12th January, 2025
DHORDO
13th January, 2025
To visit IKF, scan QR code
TOURISM CORPORATION OF GUJARAT LIMITED
Udyog Bhavan, Block No. 16, 4th Floor, Sector - 11, Gandhinagar - 382 010, Gujarat
www.gujarattourism.com • Toll-Free Number: 1800 203 1111

పోలీసుల వైఫల్యమే

బాధ్యత లేకుండా వ్యవహరించారు

» ప్రత్యక్ష సాక్షుల ఆవేదన

తిరుపతి, జనవరి9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు పోలీసులే ప్రధాన కారణమని బైరాగపట్టెడ కేంద్రంలో చావును దగ్గరగా చూసిన బాధిత భక్తులు ఆరోపిస్తున్నారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నిమిషం ఆలస్యమైతే మమ్మల్ని కూడా శవాలుగా ఇంటికి తీసుకెళ్లేవారు. మాతో పాటు వచ్చిన బంధుమిత్రులు 12 మంది గాయాలతో చికిత్స పొందుతున్నారు. తొక్కిసలాట తలుచుకుంటేనే నోటి వెంట మాట రావడం లేదు' అని వాపోయారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకే: మంగతాయారు, వైజాగ్



ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కావాలనే పోలీసులు అలా చేశారనిపించింది. పార్కు లోపలకు పోలీసులు వచ్చి కంట్రోల్ చేసుంటే ఇంత దారుణం జరిగి వుండేది కాదు. వైజాగ్ నుంచి 23 మంది వస్తే, 12 మందికి గాయాలయ్యాయి. తోపులాటలో నేను కింద పడిపోయా. నన్ను ఎవరో బయటకు లాగడంతో బతికి బయటపడ్డా. ఎన్నోసార్లు వైకుంఠ దర్శనానికి వచ్చాం గానీ ఎప్పుడూ ఇలాంటివి చూడలేదు. బైరాగపట్టెడలో జనం తక్కువగా ఉంటారని ఎవరో చెబితే అక్కడకు వెళ్లాం. క్రమంగా జనం పెరిగి, పోలీసులు పత్తా లేకపోవడం వలనే ఇంతటి ఘోరం జరిగిపోయింది.

పోలీసులు వెటకారమాడారు: దేవి, హైదరాబాద్



పార్కులో ఎటు చూసినా జనం. ఒక్క పోలీసూ లేడు. లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంది. ఇంతలో ఒక పెద్ద కప్ప జనాల్లోకి వచ్చింది. జనం మీదకు దూకుతుంటే పాము వచ్చిందనుకుని 'గోవిందా.. గోవిందా' అంటూ ఒకరిపై ఒకరు పడ్డారు. ఇంత జరిగినా పోలీసులు రాలేదు. వాళ్ల మనుషులను తీసుకొచ్చే క్రమంలో క్యూ లైన్లో తొక్కిసలాట జరిగింది. చచ్చిపోయేందుకు వస్తారా? అని పోలీసులు భక్తులను వెటకారంగా అన్నారు. పోలీసులు కంట్రోల్ చేసుంటే ఇంత ఘోరం జరిగేది కాదు.

దైవ దర్శనం కోసం వచ్చి శవంతో వెళ్తున్నాం

» మంత్రుల బృందం ఎదుట మృతుల కుటుంబీకుల ఆవేదన

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9(ఆంధ్రజ్యోతి): తన భార్య రజనితో పాటు మరో ఐదుగురు తొక్కిసలాటలో మృతి చెందడానికి కారణం అధికారుల తప్పిదమేనని విశాఖకు చెందిన లక్ష్మణరెడ్డి మంత్రుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నపళంగా క్యూలైన్‌లోకి భక్తులను విడిచి పెట్టడం వల్లే తొక్కిసలాట జరిగిందని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. 2000 మంది భక్తులు ఉన్న పార్కులో కనీస సౌకర్యాలు లేవని, అక్కడ లైట్లు లేవని వాపోయారు. 'ఎంతో భక్తితో వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చాం. ఇప్పుడు నా తమ్ముడి భార్య రజని శవంతో వెళుతున్నా సార్' అంటూ లక్ష్మణరెడ్డి సోదరి నాగవేణి మంత్రుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, రజని చనిపోవడంతో చంటి బిడ్డలు అనాథలుగా మిగిలిపోయారని విలపించారు. తిరుపతి తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబ సభ్యులను గురువారం స్విమ్స్‌లో మంత్రులు పరామర్శించారు.

నాకు దిక్కెవరు సార్

విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన కె.శాంతి మృతితో ఆమె భర్త వెంకటేశ్ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. 'నాకు దిక్కెవరు సార్' అంటూ ఆవేదన చెందారు. 'గత 15 ఏళ్లుగా స్వామి మాల వేసుకుని వస్తున్నాం. ఈ రోజు అలాగే వచ్చాం. దేవుడు మమ్మల్ని ఇలా రోడ్డున పడేసి నా భార్యను చంపేయడం బాధాకరం' అని కన్నీటి పర్యంతమయ్యారు.

పెను విషాదానికి 'తెరిచిన గేటు'

(మొదటి పేజీ తరువాయి)

నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకోవడం మొదలైంది. మధ్యాహ్నం 2గంటలకు ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారింది. దీంతో పోలీసులు పక్కనే ఉన్న పద్మావతి పార్క్ గేట్లు తెరిచి భక్తులను అందులోకి అనుమతించారు. సరిగ్గా పార్క్ గేటు ముందు నుంచే క్యూలైన్ మొదలవుతుంది. దీంతో పార్క్‌లో ఉన్నవారికే తొలుత టోకెన్లు అందుతాయని భావించిన భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ పార్క్‌లోకి చేరుకున్నారు. ఆ తర్వాత పార్క్ గేట్లను పోలీసులు మూసేశారు. దీంతో కొత్తగా వచ్చినవారు గేట్లు ఎక్కిదూకి మరీ పార్కు లోపలికి వెళ్లడం మొదలుపెట్టారు. గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచీ టోకెన్ల జారీ ఉంటుందని తొలుత టీటీడీ ప్రకటించింది. అయితే... బుధవారం అర్ధరాత్రి 12 గంటలకే మొదలు పెడతారని ప్రచారం జరిగింది. రద్దీ పెరుగుతూనే ఉండడంతో 9 గంటలకే టోకెన్లు ఇస్తారని కూడా ప్రచారం జరిగింది. బుధవారం సాయంత్రానికి దాదాపు రెండు వేల మంది భక్తులు పార్క్‌లోకి చేరుకున్నారు. వీరిలో కొందరు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోగా... మరికొందరు మూసివున్న పార్క్ గేట్ల ముందే ఎప్పుడెప్పుడు అవి తెరుస్తారా అని ఎదురు చూస్తున్నారు. రాత్రి 8 గంటల సమయంలో పార్క్‌లో ఉన్న భక్తుల్లో ఒక మహిళ అస్వస్థతతో సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో ఆమె భర్త... తమను బయటకు పంపాలని పోలీసులను ప్రాధేయపడ్డారు. పార్క్‌కు ఉత్తర, పశ్చిమ దిక్కుల్లో రెండు చిన్న గేట్లు ఉన్నాయి. వాటిని తెరిచి అస్వస్థతకు గురైన మహిళను బయటికి పంపితే సరిపోయేది. కానీ... ఇక్కడే పోలీసులు దిద్దుకోలేని పొరపాటు చేశారు. చిన్నగేట్లను కాకుండా... క్యూలైన్లలోకి దారితీసే ప్రధాన గేటును తెరిచి, ఆ మహిళను బయటికి పంపేందుకు ప్రయత్నించారు. రాత్రి 8.20గంటల సమయంలో పార్క్ ప్రధాన గేట్లను కొద్దిగా తెరిచారు. అప్పటికే అక్కడ గుంపుగా నిలబడి ఎదురుచూస్తున్న భక్తుల్లో కొందరు ఇది గమనించి... 'టోకెన్లు ఇస్తున్నారు. గోవిందా గోవింద' అని గట్టిగా అరిచారు. దీంతో పార్క్‌లో విశ్రాంతి తీసుకుంటున్న వారూ, అక్కడక్కడా కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నవారూ ఒక్కసారిగా లేచి గేట్ల వైపు పరుగులు తీశారు. పోలీసులు వీరిని అదుపుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. భక్తుల గోవింద నామ ఘోష మధ్య పోలీసుల హెచ్చరికలు ఎవరికీ వినిపించలేదు. గేట్లను మూసేందుకు చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. ఆతృత, అత్యుత్సాహం నిండిన భక్తులు బలవంతంగా గేట్లను నెట్టారు. ఇవతలవైపు పరిమిత సంఖ్యలో ఉన్న పోలీసులకు వారిని అదుపు చేయడం సాధ్యం కాలేదు. దీంతో ఒక్కసారిగా గేట్లు పూర్తిగా తెరచుకున్నాయి. వెల్లువెత్తిన ప్రవాహంలాగా జనం ముందుకు ఉరికారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగింది. కిందపడిన వాళ్లు మళ్లీ లేవలేకపోయారు. క్యూలైన్‌లోకి చేరడమే లక్ష్యంగా... జనం ముందుకు కదిలారు. ఈ తొక్కిసలాటలో ఊపిరాడక చాలామంది విలవిలలాడారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. కొన్ని నిమిషాల పాటు పూర్తిగా గందరగోళం! పోలీసులు కూడా కొద్దిసేపు అసహాయులుగా మిగిలిపోయారు. ఇదంతా బుధవారం రాత్రి 8.30-9 గంటల మధ్య జరిగింది.

ఇవీ లోపాలు...

ప్రాథమిక విచారణలో గుర్తించింది ఇవే...

1) టోకెన్ల కోసం వచ్చే భక్తులను వారి సంఖ్యను బట్టి వివిధ కేంద్రాలకు మళ్లించక పోవడం.
2) పద్మావతి పార్కు మెయిన్ గేటును అనాలోచితంగా, పరిణామాలను ఊహించకుండా తెరవడం.
3) పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులను పార్కులో కూర్చోబెట్టడం.
4) టోకెన్ల జారీపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం.

టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చారు

మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షలు, గాయపడిన వారికి రూ. 5 లక్షలు ఇవ్వాలి: జగన్

తిరుపతి(జీవకోన)/తిరుపతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటన టీటీడీ పరువు ప్రతిష్ఠలను దిగజార్చిందని, ఇందుకు చంద్రబాబు ప్రభుత్వమే ప్రధాన కారణమని మాజీ సీఎం జగన్ ఆరోపించారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసీ కూడా కౌంటర్ల వద్ద ఎలాంటి బందోబస్తు ఏర్పాటు చేయలేదు. తొక్కిసలాట ఘటనకు టీటీడీ అధికారులు, చైర్మన్, కలెక్టర్, ఎస్పీతో పాటు చంద్రబాబు కూడా బాధ్యుడే. పోలీసులంతా కుప్పం పర్యటనలో ఉన్నందున తిరుపతిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ఈ ఘటనపై పెట్టిన సెక్షన్లను చూస్తుంటే కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉంది' అని ఆయన ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు, గాయపడిన వారికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని జగన్ డిమాండ్ చేశారు.

పరామర్శ ఇలాగేనా?

» జుగుప్సాకరంగా వైసీపీ శ్రేణుల ప్రవర్తన
» మాట వరసకు కూడా వారించని జగన్
» ఇదే సీన్‌లో కేడర్ అలిస్తే వారించిన పవన్


స్విమ్స్ వద్ద జగన్ అనుచరుల హడావిడి

తిరుపతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటనలో పెనువిషాదంలో ఉన్న బాధితులను పరామర్శించేందుకు వచ్చిన వైసీపీ అధినేత జగన్.. తన పర్యటనను పరామర్శ పేరుతో పరిహాసం చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతిలో ఉండగానే గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జగన్ తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. కలెక్టరేట్ ముందు హైవేలో ట్రాఫిక్ జామ్ కావడంతో కాసేపు కారు దిగి రోడ్డుపై నడిచి నాటకీయతకు తెరలేపారు. దీంతో వాహనాలు క్లియర్ చేయడానికి పోలీసులు తిప్పలు పడాల్సివచ్చింది. తర్వాత ఆయన కారెక్కి స్విమ్స్‌కు బయలుదేరుతుండగా తమ నాయకుడిని ఆస్పత్రికి రానివ్వకుండా కావాలనే అడ్డుకుంటున్నారంటూ వైసీపీ శ్రేణులు స్విమ్స్ సర్కిల్లో నానాయాగీ చేశారు. పోలీసులు వారిని పంపేశారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో జగన్ స్విమ్స్‌కు చేరుకున్నారు. అప్పటికే తరలించిన యువతతో 'సీఎం..సీఎం...' అంటూ వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేయించారు. జగన్‌తో పాటు వారంతా ఆస్పత్రి లోపలికి చొచ్చుకుపోయారు. సంబరాలకు వచ్చినట్టు ఊగిపోయారు. ఐసీయూలో కూడా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. వారు సెల్ఫీలు తీసుకుంటున్నా పట్టించుకోకుండా జగన్ పరామర్శ కొనసాగించారు. ఆయన వెంట వైసీపీ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఆర్కే రోజా, పిల్లి సుభాష్ చంద్రబోస్, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు. ఇదిలావుంటే జగన్ ఆస్పత్రి లోపల ఉండగా పవన్ బయట మీడియాతో మాట్లాడేందుకు వస్తున్న సమయంలో జనసేన కార్యకర్తలు, అభిమానులు కూడా గట్టిగా అరవడంతో జనసేనాని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇక్కడ మనుషులు చచ్చిపోతుంటే ఏమిటీ అరుపులు. దయచేసి మౌనంగా ఉండండి' అని పవన్ చెప్పడంతో అందరూ సైలెంటయ్యారు. కాగా, జగన్ మీడియాతో మాట్లాడుతుండగా వైసీపీ శ్రేణులు నినాదాలు చేస్తున్నప్పటికీ వారిని ఆయన ఏమాత్రం వారించలేదు. తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు.

సీసీ కెమెరాలు పరిశీలించి విచారణ

» నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు: హోంమంత్రి అనిత
» మృతుల ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తాం: మంత్రి అనగాని
» అందరం వచ్చి అండగా నిలుస్తున్నాం: మంత్రి ఆనం
» మెరుగైన వైద్యం అందిస్తున్నాం: మంత్రి సత్యకుమార్

తిరుపతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటనలో ఏదైనా కుట్రకోణం ఉందా అనే దృష్టితో కూడా విచారణ జరిపిస్తామని రాష్ట్ర హోంమంత్రి అనిత చెప్పారు. ఆమెతోపాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణ రెడ్డి, కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ గురువారం తిరుపతికి విచ్చేసి తొక్కిసలాట బాధితులను పరామర్శించారు. అనంతరం హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ టికెట్లు పొందే ప్రతి చోట సీసీ కెమెరాలున్నాయని, వాటిని పరిశీలించి, ఘటనపై పూర్తి విచారణ చేసిన తర్వాత సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. వెంటనే రూ.25లక్షలు వారికి చేరే ఏర్పాట్లు చేశామని, వారి స్వగ్రామాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. మళ్లీ బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తామన్నారు. ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ బాధితులకు కొండంత భరోసా ఇవ్వాల్సిన సమయమని, అందుకే అందరం వచ్చి అండగా నిలుస్తున్నామని చెప్పారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఘటనపై నివేదిక కోరామని, దాని ఆధారంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

కుట్ర కోణంపై దర్యాప్తు

» ముందుగా వైసీపీ సోషల్ మీడియాలో ఆ వీడియోలు
» టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు ధ్వజం



అనంతపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటన వెనుక కుట్ర కోణంపై ప్రభుత్వం దర్యాప్తు చేస్తోందని టీటీడీ బోర్డు సభ్యుడు, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చెప్పారు. అనంతపురంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆయాసంతో బాధపడుతున్న వృద్ధురాలికి సాయపడే సమయంలో కొంతమంది అరుపులే తొక్కిసలాటకు కారణమనే వాదన వినిపిస్తోందన్నారు. తొక్కిసలాట వీడియోలు వైసీపీ సోషల్ మీడియాలో ముందుగా ఎలా వచ్చాయనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోందన్నారు. కుట్రదారులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. సామాన్య భక్తులకు భగవంతుని దర్శనం సులభతరం చేసేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లూ చేస్తోందని చెప్పారు. మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లు జారీ చేశామని తెలిపారు. తిరుపతి ఘటన నేపథ్యంలో వైసీపీ శవ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. జగకు ముందు నుంచి ఇలాంటివి చేయడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ చేస్తున్న రాజకీయాలను ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. మృతుల, క్షతగాత్రుల కుటుంబాలకు పరామర్శలు, ఆర్థికసాయం చేయాలి గానీ, రాజకీయ కోణంలో చూడటం పద్ధతి కాదని హితవు పలికారు. ఇప్పటికైనా జగన్‌లో మార్పు రావాలని భగవంతున్ని కోరుకుంటున్నానన్నారు.

సీఎంగా ఉన్నప్పుడు ఏనాడైనా పరామర్శకు వెళ్లారా?

» పదవి లేనప్పుడే జగన్‌కు జనం కనిపిస్తున్నారు
» ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉందని అనుమానం: టీడీపీ

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ ఏనాడైనా పరామర్శకు వెళ్లారా? అని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. గురువారం ఇక్కడ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య విలేకరులతో మాట్లాడారు. 'జగన్ సీఎంగా ఉండగా తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 21 మంది చనిపోతే చూడటానికి వెళ్లలేదు. అన్నమయ్య ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయి 33 మంది చనిపోతే పరామర్శకు వెళ్లలేదు. గోదావరిలో కచ్చులూరు వద్ద బోటు ప్రమాదంలో 39 మంది చనిపోతే కన్నెత్తి చూడలేదు. అధికారంలో ఉన్నప్పుడు ఈ ఘటనలు కనిపించలేదా' అని వర్ల రామయ్య ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటన వెనుక కుట్ర కోణం ఉందన్న అనుమానం తమకు ఉందన్నారు. 'భక్తులు ఒకేసారి తోసుకొని రావడం వెనుక గంజాయి మూక పదిహేను మంది ఉన్నారని తెలుస్తోంది. ముందున్న వారిని తోయడంతోపాటు గట్టిగట్టిగా కేకలు పెట్టి, అరిచి క్యూలైన్లలో గందరగోళం సృష్టించారని, వీరే ఈ తోపులాటకు కారణమయ్యారని గుర్తించారు. ఘటన జరిగిన నిమిషాల వ్యవధిలో జాతీయ మీడియాకు సమాచారం పంపారు. దీనిపై కూడా మాకు అనుమానం ఉంది. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం' అని వర్ల అన్నారు.

దర్శనానికి వెళ్తే వైకుంఠానికి పంపుతారా?: షర్మిల

తిరుమల వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్తే వైకుంఠానికి పంపుతారా? అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు మృతిచెందడంపై గురువారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట మృత్యురోదనలా? అని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాదిగా భక్తులు తరలివస్తారని తెలిసినా పటిష్ఠ చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. తొక్కిసలాట ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు ప్రభుత్వం నైతిక బాధ్యతను వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

తిరుపతి దుర్ఘటనకు ప్రభుత్వం, పాలకమండలిదే బాధ్యత

» విశాఖ సభలో ప్రజా సమస్యల ప్రస్తావనేదీ?: బీవీ రాఘవులు

తిరుపతి తొక్కిసలాట ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ పాలకమండలి బాధ్యత వహించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ దుర్ఘటన వెనుక ఘోర వైఫల్యం కనిపిస్తోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. విజయవాడలో రాఘవులు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ విషాద ఘటనకు బాధ్యులైనవారిని పట్టుకునేందుకు సమగ్ర, స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు 10 లక్షల మంది భక్తులు వస్తారని తెలిసినా కనీసస్థాయిలో భద్రత ఏర్పాట్లు చేయలేదు. ఒక మంత్రినైనా అక్కడ ఇన్‌చార్జిగా నియమించారా? పాలకమండలి చైర్మన్ ఏం చేస్తున్నారు? చనిపోయినవారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలి' అని డిమాండ్ చేశారు. కాగా, విశాఖ సభలో ప్రజల సమస్యలను ప్రస్తావించలేదని విమర్శించారు. 'విశాఖ ఉక్కు గురించి చంద్రబాబు, పవన్ ఒక్క మాటా మాట్లాడలేదు. ప్రధాని స్పష్టమైన ప్రకటన చేస్తారని ప్రజలు ఆశించారు. విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు సీఎం, డిప్యూటీ సీఎం వంత పాడటానికి సిద్ధమయ్యారని స్పష్టమవుతోంది' అని రాఘవులు ఆరోపించారు. 'నక్కపల్లి దగ్గర బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ప్రధాని శంకుస్థాపన చేశారు. నిర్వాసితుల సమస్యలకు మాత్రం పరిష్కారం చూపించలేదు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా బల్క్‌డ్రగ్ ప్రాజెక్టు చేపట్టడానికి ఒప్పుకోం' అని స్పష్టం చేశారు.

23 జిల్లాల్లో ముగిసిన రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ సదస్సుల నిర్వహణలో కీలకఘట్టం ముగిసింది. 23 జిల్లాల పరిధిలో గ్రామసభలు ముగిశాయి. 2.2 లక్షల పిటిషన్లు రెవెన్యూ శాఖకు చేరాయి. వీటికి త్వరలో పరిష్కారం చూపనున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. చిత్తూరు, శ్రీకాకుళం, అల్లూరి జిల్లాల్లో గ్రామసభలు పూర్తికాలేదు. మరికొంత సమయం ఇవ్వాలని కలెక్టర్లు కోరారు. 16,601 గ్రామాల్లో సభలు జరగ్గా.. 74 లక్షల మంది వీటిలో పాల్గొన్నారు.



ప్రపంచ తెలుగు మహాసభల్లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, కనుమూరి బాపిరాజు తదితరులు

తెలుగు మూలాలను చెప్పాలి

» మాతృభాషపై పట్టు ఉంటేనే మిగిలిన భాషలు
» ప్రపంచ తెలుగు మహాసభల్లో వక్తలు
» త్వరలో సాంస్కృతిక పర్యాటకం: మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం/రాజానగరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'మాతృభాషపై పట్టు ఉంటేనే మిగిలిన భాషలు సులభంగా నేర్చుకోవచ్చు. పిల్లలకు తెలుగు భాషా మూలాలను తెలియజెప్పాలి. జాతీయ విద్యా విధానంలో కూడా మాతృభాషలకే కేంద్రం ప్రాధాన్యమిస్తోంది. తెలుగు భాష పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని పలువురు ప్రముఖులు స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో గురువారం వర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల చివరి రోజు కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ 'తెలుగుభాష మూలాలను పిల్లలకు వివరించడం ద్వారా తెలుగు భాషను కాపాడుకోవాలి. భాష వల్ల జాతి పుడుతుంది. జాతిని అభివృద్ధి చేసుకోవాలంటే భాషను అభివృద్ధి చేసుకోవాలి. ప్రభుత్వ విధానాలు కూడా మారాలి. తల్లిదండ్రుల ఆలోచన విధానం మారాలి. తెలుగుభాష పట్ల పిల్లలకు మక్కువ కలిగించాలి. దురదృష్టవశాత్తూ తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నారు' అని అన్నారు.

త్వరలో తెలుగు మాండలికాల గ్రంథస్థం

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారని, కిందిస్థాయి నుంచి తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టడం కోసం త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ తెలుగు మాండలికాలను సేకరించి గ్రంథస్థం చేయించి భావితరాలకు అందిస్తామని చెప్పారు. తెలుగునాటక రంగాన్ని కాపాడతామని, నంది నాటకాలు ప్రారంభించి, పౌరాణిక నాటకాలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలో కాళీపట్నం రామారావు కథా నిలయం, తెలుగుభాష కోసం కృషిన సీపీ బ్రౌన్ పేరిట రాజమహేంద్రవరంలో సన్నిధానం శాస్త్రి మందిరం నడుపుతున్నారని, ఇంకా వివిధ ప్రాంతాల్లోని ప్రసిద్ధ గ్రంథాలయాలను అధ్యయనం చేయడానికి 'సాంస్కృతిక పర్యాటకం' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు.

ఆంగ్ల భాష అవసరమూ ఉంది.. కానీ: పురందేశ్వరి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ తెలుగుభాష, సంస్కృతి, చరిత్రను భావితరాలకు అందించాలన్నారు. కేంద్ర విద్యావిధానంలో మాతృభాషకు అధిక ప్రాధాన్యమిచ్చినట్టు తెలిపారు. భారతదేశంలో తెలుగుతో పాటు కేవలం ఆరు భాషలకు ప్రాచీన హోదా లభించిందన్నారు. ప్రపంచంలో ప్రజలు మాట్లాడే భాషల్లో తెలుగుకు 15వ స్థానం ఉండగా.. మన దేశంలోని భాషల్లో తెలుగుకు నాల్గవ స్థానం ఉందన్నారు. తారక రామారావు సీఎంగా ఉండగా తెలుగులోని ఉత్తర్వులు ఇవ్వాలనే ఆదేశించారని, ఇవాళ మళ్లీ అటువంటి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని చెప్పారు.

ఏటా తెలుగు సభల సంక్రాంతి: జీజీయూ కులపతి చైతన్యరాజు

గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో తెలుగు సభల సంక్రాంతిని ప్రతి ఏడాదీ నిర్వహిస్తామని జీజీయూ చాన్సలర్, చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ప్రకటించారు. తెలుగు భాషను ప్రోత్సహించాలని, 1 నుంచి 5 వరకు తరగతులు తెలుగు మాధ్యమంలోనే బోధించాలని, డిగ్రీ వరకు అభ్యసించే విద్యార్థులకు ఏ మాధ్యమంలో చదివినా తెలుగుకు అదనంగా పది మార్కులు వేస్తే ప్రోత్సాహకరంగా ఉంటుందని.. ప్రభుత్వాన్ని కోరుతూ సభలో తీర్మానించినట్టు చెప్పారు. సిలికాన్ మన బడి, ఆస్ట్రేలియా తెలుగు సంఘంతో కూడా జీజీయూ అవగాహన ఒప్పందం చేసుకుంటుందన్నారు. తెలుగు భాష ఔన్నత్యానికి సాధ్యమైనంత మేర శాయశక్తులా తాము కృషి చేస్తామని ప్రకటించారు.

తెలుగమ్మాయిలు పరికిణీలు పక్కన పడేశారు!

» గోనె సంచుల్లా పంజాబీ డ్రెస్‌లు దిగేస్తున్నారు
» మాడుగుల నాగఫణి శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు


మాట్లాడుతున్న నాగఫణి శర్మ

రాజమహేంద్రవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగమ్మాయిలు పరికిణీలు, పావడాలు వదిలేసి గోనెసంచుల్లా పంజాబీ డ్రెస్‌లు దిగేస్తున్నారని ద్విసహస్రావధాని మాడుగుల నాగ ఫణి శర్మ వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహా సభల్లో ఆయన గురువారం మాట్లాడారు. తెలుగుభాష, సంస్కృతిని వివరించే సమయంలో ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ తెలుగుకు ప్రాధాన్యత ఇచ్చారని, చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుభాష అభివృద్ధికి తన చేత అనేక కార్యక్రమాలు అమలు చేయించారని చెప్పారు. కవి, గేయరచయిత అందెశ్రీ మాట్లాడుతూ తెలుగు భాషకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో తాను మరేభాషనూ నేర్చుకోలేదన్నారు. ప్రస్తుత సమాజంలో మనుషుల్లో మానవత్వం కొరవడుతోందని, మాయమైపోతున్నాడమ్మా.. మనిషన్నవాడు అనే పాటను ఆలపిస్తూ అందరి హృదయాలను కదిలించారు.

శ్రీశైలం ఖాళీ!

(మొదటి పేజీ తరువాయి)

పడిపోయాయి. అయినా తెలంగాణ ప్రభుత్వం అడపాదడపా విద్యుదుత్పత్తి పేరిట నీటిని తోడేస్తోంది. బుధవారం ఇలా 19,070 క్యూసెక్కులు (దాదాపు 1.65 టీఎంసీలు) దిగువకు విడుదల చేయడంపై రాయలసీమ సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలంలో నీటి నిల్వలు 810 అడుగుల లెవల్‌కు తగ్గకుండా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ఆ దిశగా కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు.. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.810 టీఎంసీలు. 2024-25 నీటి సంవత్సరంలో (జూన్ 1 నుంచి మే ఆఖరి వరకు) 1,622.61 టీఎంసీల వరద వచ్చింది. గతేడాది తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండిపోయి.. పెట్టుబడి మట్టిపాలై ఆర్థికంగా చితికిపోయిన రాయలసీమ కరువు రైతులు ఈ ఏడాది సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు, కష్టాలూ ఉండవని భావించారు. నంద్యాల, కడప జిల్లాలకు, నెల్లూరు జిల్లాకు సాగు, తాగునీటి అవసరాల కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 203.30 టీఎంసీలు.. కర్నూలు, అనంతపురం జిల్లాలకు హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకం నుంచి 20.55 టీఎంసీలు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా 0.60 టీఎంసీలు కలిపి 224.45 టీఎంసీలను రాయలసీమ ప్రాజెక్టులకు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 26.86 టీఎంసీలు తీసుకుంది. శ్రీశైలం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.810 టీఎంసీలు. ఆపైన వరదొచ్చి క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు వరద వదిలేయాల్సి వచ్చినప్పుడు.. విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు వదిలేయవచ్చు. అప్పుడు ఎలాంటి నీటి ఇబ్బందులూ ఉండవని సాగునీటి నిపుణులు అంటున్నారు. అయితే.. నిల్వ చేసిన నీటిని విద్యుదుత్పత్తి పేరిట దిగువకు వదిలేయడం నీటి సమస్యలకు కారణమవుతోందని పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం విద్యుదుత్పత్తి కోసం 358.94 టీఎంసీలు (డ్యాం చేరిన మొత్తం వరదలో 22.12 శాతం), ఆంధ్రప్రదేశ్ కూడా 199.38 టీఎంసీలు (డ్యాం చేరిన మొత్తం వరదలో 12.28 శాతం) దిగువకు వదిలేశాయని ఇంజనీర్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 859.80 అడుగుల్లో 105.39 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. జూలై వరకు రాయలసీమ తాగునీటి అవసరాలు తీర్చాల్సిన అవసరం ఉంది. అదే క్రమంలో పర్యావరణ సమతుల్యత కాపాడడం, నల్లమల అభయారణ్యంలో వన్యప్రాణుల నీటి అవసరాల కోసం 810 అడుగుల లెవల్‌లో 90 టీఎంసీలకు తగ్గకుండా నీటి నిల్వను కొనసాగించాలని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పత్తి పేరిట నీటిని దిగువకు విడుదల చేయడం విమర్శలకు తావిస్తోంది. సీమ రైతాంగం తీవ్ర ఆందోళనకు లోనవుతోంది. జస్టిస్ బచావత్ (కేడబ్ల్యూడీటీ-1) అవార్డు, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) సూచనల మేరకు రాబోయే ఖరీఫ్ ప్రారంభం వరకు 854 అడుగుల లెవల్‌కు తగ్గకుండా.. క్యారీ ఓవర్ కింద 60 టీఎంసీలు తగ్గకుండా నిల్వను కొనసాగించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రూల్ కర్వ్, క్యారీ ఓవర్ అమలు చేసేలా కృష్ణా బోర్డుపై రాయలసీమ జిల్లాల ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

శ్రీశైలం డ్యాంలో పదేళ్లుగా జనవరిలో నీటి నిల్వలు..

సంవత్సరం	నీటి మట్టం (అడుగుల్లో)	నీటి నిల్వ (టీఎంసీలు)
2015	832.10	51.69
2016	859.70	104.89
2017	868.80	136.93
2018	837.90	58.81
2019	872.60	152.83
2020	875.00	163.58
2021	857.20	97.82
2022	828.90	48.40
2023	853.30	87.65
2024	859.80	105.39

సాగర్‌లో నీరున్నా.. శ్రీశైలాన్ని ఖాళీచేస్తారా?

బొజ్జా దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు

నాగార్జునసాగర్‌లో 248.49 టీఎంసీలు ఉండగా.. శ్రీశైలంలో ఉన్నది కేవలం 105.39 టీఎంసీలే. ఈ పరిస్థితుల్లో శ్రీశైలంను ఖాళీ చేయడం ఎంతవరకు సబబు? దీనిపై ప్రజాప్రతినిధులు స్పందించాలి. సాగర్ ఆయకట్టుకు 264 టీఎంసీలు మాత్రమే వాడుకోవాలని ట్రైబ్యునల్ స్పష్టంగా చెబుతోంది. ఇందుకు విరుద్ధంగా విద్యుదుత్పత్తి పేరిట దిగువకు నీటిని వదిలేయడం సరికాదు.



ఆస్పత్రిలో బాధితునితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్



ఆస్పత్రిలో భక్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్



గోడు వింటున్న మంత్రులు అనిత, ఆనం, అనగాని, పార్థసారథి





తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

బాధ్యత లేదా?

- తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికారులపై సీఎం సీరియస్
- అక్కడికక్కడే ఐదుగురిపై వేటు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనలో అధికారుల తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బాధ్యత లేదా?.. తమాషా అనుకుంటున్నారా? అంటూ తీవ్ర స్వరం వినిపించారు. ఐదుగురు అధికారులపై అక్కడికక్కడే వేటు వేశారు. ఆరుగురిని బలిగొన్న తొక్కిసలాట ఘటన జరిగిన తిరుపతిలోని బైరాగిపట్టెడ కేంద్రం వద్ద విధుల్లో విఫలమైన డీఎస్పీ రమణకుమార్, ఆ కేంద్రం ఇంచార్జి, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. పర్యవేక్షణ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్‌ను బదిలీ చేస్తున్నట్టు వెల్లడించారు. చంద్రబాబు గురువారం మధ్యాహ్నం విజయవాడ నుంచి విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడినుంచి నేరుగా బైరాగిపట్టెడ చేరుకుని, టోకెన్ల జారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం స్విమ్స్ పద్మావతి ఆస్పత్రి చేరుకుని తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అటు తర్వాత టీటీడీ పరిపాలనా భవనం చేరుకుని అధికారులతో సమావేశమై సమీక్షించారు. చివరగా సాయంత్రం అక్కడే మీడియాతో సమావేశమయ్యారు. "బుధవారం విశాఖలో ప్రధాని రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడులతో పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేసిన కార్యక్రమంలో పాల్గొని సంతోషంగా విజయవాడ తిరిగి వచ్చీ రాగానే తిరుపతి ఘటన తెలియడంతో మనసు వికలమైంది. అందుకే వెంటనే బయల్దేరి తిరుపతి వచ్చాను. దిద్దుబాటు నిర్ణయాలు, చర్యలు తీసుకునే ముందు ప్రత్యక్షంగా లోటుపాట్లు తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఘటనా స్థలాన్ని పరిశీలించాను. గాయపడిన వారితోనూ, అధికారులతోనూ మాట్లాడి వివరాలు తెలుసుకున్నాను. తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు టీటీడీ నుంచీ రూ. 25 లక్షలు వంతున ఆర్థిక సాయం తక్షణం అందజేస్తాం. మృతుల కుటుంబాలలో ఇంటికి ఒకరికి చొప్పున టీటీడీలో కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తమిళనాడుకు చెందిన మృతురాలి కుటుంబంలో ఒకరికి ఆ రాష్ట్రంలోని టీటీడీ సంస్థల్లో ఎక్కడైనా ఉద్యోగం ఇస్తాం. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన తిమ్మక్క, ఈశ్వరమ్మ అనే మహిళలకు రూ. 5 లక్షలు తక్షణమే ఆర్థిక సాయం అందజేస్తాం. వారు కోలుకునే దాకా మెరుగైన వైద్యం ప్రభుత్వమే అందిస్తుంది. సాధారణ గాయాలతో చికిత్స పొందుతున్న 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున తక్షణ సాయం అందిస్తున్నాం. చికిత్స పొందుతున్న వారు గాయపడినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీవారిని దర్శించుకునే తిరిగి వెళతామని పట్టుదల వ్యక్తం చేశారు. అందుకే వారిని శుక్రవారం వైకుంఠ ఏకాదశి రోజున టీటీడీ అధికారులే తీసుకెళ్లి దర్శనం చేయించి స్వస్థలాలకు చేర్చేలా ఆదేశాలిచ్చాం" అని వివరించారు. తిరుపతిలో తొక్కిసలాటపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. నివేదిక వచ్చాక ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామనీ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా దిద్దుబాటు చర్యలు తీసుకుంటామన్నారు.

బైరాగిపట్టెడలో కేంద్రం పెట్టడమే తప్పు

తిరుపతిలోని బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కును, మున్సిపల్ స్కూలును టోకెన్ల జారీకి ఎంపిక చేయడమే పెద్ద తప్పని సీఎం అభిప్రాయపడ్డారు. వేల మంది భక్తులు వచ్చినపుడు వారిని పార్కు ఆవరణలో ఉంచి గేట్లకు తాళాలు వేయడం సరికాదన్నారు. శ్రీవారి దర్శన టోకెన్ల కోసం ఆత్రుతగా వేలాది మంది గంటల తరబడి వేచిచూస్తున్నపుడు వారిలో భయాందోళనలు ఉంటాయని వివరించారు. అలాంటప్పుడు ఏ చిన్న పాటి ఘటన జరిగినా తోపులాటకు, తొక్కిసలాటకు దారి తీస్తుందన్నారు. బైరాగిపట్టెడలో కూడా అదే జరిగిందని తెలిపారు. అస్వస్థతకు లోనైన మహిళను పార్కు నుంచి వెలుపలికి తీసుకెళ్లడానికి గేటు తాళం తీయాలని ఆమె భర్త ప్రాధేయపడితే అక్కడ విధుల్లో వున్న డీఎస్పీ అనాలోచితంగా వ్యవహరించారనీ, అందుబాటులో రెండు చిన్న గేట్లు ఉన్నప్పటికీ వాటిని తెరవలేదన్నారు. ముందు జాగ్రత్త లేకుండా ప్రధాన గేటు తెరవడంతో క్యూల్లోకి వదులుతున్నారని భావించిన భక్తులు పెద్దసంఖ్యలో గేటు వద్దకు తోసుకొచ్చారని, దానివల్లే తొక్కిసలాట జరిగి ప్రాణనష్టం జరిగిందని చెప్పారు.

ఎప్పుడూ లేని సంప్రదాయాలు తెచ్చారు..

టీటీడీ గతంలో వైకుంఠ ఏకాదశికి, మరుసటి రోజైన వైకుంఠ ద్వాదశికి రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించేదని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఎంతమంది భక్తులు వచ్చినా తిరుమలలోనే వారికి టోకెన్లు జారీ చేయడం జరిగేదన్నారు. అయితే గత నాలుగైదేళ్లలో ఎప్పుడూ లేని సంప్రదాయాలను అమల్లోకి తెచ్చారన్నారు. తిరుపతిలో టోకెన్లు జారీ చేయడం అందులో ఒకటన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలను పది రోజులపాటు కల్పించడం కూడా గతంలో లేదన్నారు. దానికి శాస్త్రాలు అంగీకరిస్తాయో లేదో తనకు తెలియదని, తానేమీ ఆగమ పండితుడిని కానన్నారు. వీటిపై ఆగమ పండితులతో చర్చించి టీటీడీ పాలకవర్గం, అధికారులు తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తిరుపతిలో జిల్లా అధికార యంత్రాంగం, టీటీడీ యంత్రాంగాలు నడుమ మరింత సమన్వయం పెరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు యంత్రాంగాలూ పరస్పర సమన్వయం, సహకారాలతో వ్యవహరించేలా చూస్తామన్నారు. అదే సమయంలో టీటీడీలో సైతం ఛైర్మన్, ఈవో, జేఈవోలు కలసి కట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. తాను సీఎం అయినప్పటికీ అన్నింటిలో జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. టీటీడీకి సంబంధించిన నిర్ణయాలన్నీ బోర్డులో చర్చ జరగాలని, ఏది మంచిదో సమీక్షించి వాటిని అమలు చేయాలని స్పష్టం చేశారు.

2వేల మందిని కూడా కంట్రోల్ చేయలేరా?

తొక్కిసలాట ఘటనలో అధికారుల తీరును సీఎం చంద్రబాబు తీవ్రంగా తప్పుబట్టారు. 'మీరు ఏం ముందస్తు చర్యలు తీసుకున్నారు?' అంటూ టీటీడీ ఈవో శ్యామలరావును ప్రశ్నించారు. కింది స్థాయి అధికారిని ఇంచార్జీగా నియమించి జాగ్రత్తలు చెప్పానని ఈవో చెప్పబోతుండగా...సీఎం వినిపించుకోలేదు. 'మీరు కలెక్టర్ కదా...ఏం ఆదేశాలు ఇచ్చారు?' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను నిలదీశారు. 'ఏం తమాషా అనుకుంటున్నారా?' అంటూ ఎస్పీ సుబ్బరాయుడుపై ఆగ్రహించారు. రెండు వేల మంది భక్తులను కూడా కంట్రోల్ చేయలేరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ఎంతసేపటికి అంబులెన్స్ వాహనం వచ్చింది? వాహనం వున్నా గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించడంలో ఎందుకు ఆలస్యం జరిగిందని అధికారులను సీఎం ప్రశ్నించారు. కౌంటర్లు ఏర్పాటుచేసిన రామానాయుడు మున్సిపల్ స్కూల్ ఆవరణంలోకి వెళ్లి పరిశీలించారు. అక్కడ టీటీడీ జేఈవో గౌతమీపై మండిపడ్డారు. ఏటా జరిగేదే కదా...పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలుసు కదా...దానికి తగ్గట్టు ఎందుకు ముందస్తు ఏర్పాట్లు, చర్యలు తీసుకోలేదో చెప్పాలని నిలదీశారు. టెక్నాలజీని ఎందుకు వాడుకోలేదు? అంటూ ప్రశ్నించారు. ఘటన జరిగిన బైరాగిపట్టెడలోని పార్కు, స్కూల్లో కౌంటర్ల వద్ద అర గంటకు పైగా గడిపిన చంద్రబాబు తర్వాత స్విమ్స్ పద్మావతి ఆస్పత్రి చేరుకున్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

తిరుపతి స్విమ్స్ పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను చంద్రబాబు పరామర్శించారు. 42మంది గాయపడి ఆస్పత్రిలో చేరగా వారిలో 13మంది డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 29మంది చికిత్స పొందుతుండగా ఒక్కొక్కరి దగ్గరకు వెళ్లి సీఎం పలకరించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల పరంగా ప్రభుత్వం పూర్తి అండదండలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఘటన జరిగిన తీరు గురించీ అడిగి తెలుసుకున్నారు. వారి వ్యక్తిగత వివరాలు సైతం ఆరా తీశారు.

టీటీడీలో ప్రక్షాళన జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటన జరగడం వ్యక్తిగతంగా తనను చాలా బాధపెట్టిందని, క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. తిరుపతిలో జరిగిన దుర్ఘటనలో గాయపడిన క్షతగాత్రులను గురువారం స్విమ్స్‌లో ఆయన పరామర్శించారు. తొక్కిసలాట ఎలా జరిగింది? ఆ సమయంలో అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి బయట మీడియాతో మాట్లాడారు. టీటీడీ ఛైర్మన్, ఈవో, ఏడీఈవోల మధ్య గ్యాప్ ఉన్నట్టు తెలుస్తోందన్నారు. మృతుల కుటుంబాల ఇళ్లకు పాలకమండలి సభ్యులు వెళ్లి పరామర్శించాలని సూచించారు. 'కొండపై వీఐపీ సంస్కృతి ఆగిపోవాలి. అక్కడి అధికారులు కామన్‌మ్యాన్ ఫోకస్‌కు రావాలి. ఏకాదశి టోకెన్ల జారీలో 1100 మంది పోలీసులు, వంద మందికి పైగా పోలీస్ అధికారులు బందోబస్తు చేసినా ఇలాంటి దుర్ఘటన జరగడం విచారకరం. పోలీసులు ఉన్నారా? అంటే ఉన్నారు. ఇలాంటి తొక్కిసలాటలు జరిగినప్పుడు సహాయక చర్యలు ఎలా ఉండాలి? అనే డిజాస్టర్ మేనేజ్మెంట్ కనిపించలేదు. క్రౌడ్ మేనేజ్మెంట్ ఇప్పటికీ పోలీసులకు అలవాటు కాలేదు. నా కళ్లముందు ఇప్పుడే చూశా. మీడియా సమావేశం పెట్టేందుకు జన సమూహం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎంగా బాధ్యత తీసుకుని పోలీసులకు చెబితే కానీ జనాన్ని నియంత్రించలేకపోతున్నారు. గరుడసేవలో 4 లక్షల మంది భక్తులు వస్తే ఎలాంటి దుర్ఘటనలు జరగనప్పుడు, బైరాగపట్టెడ కేంద్రంలో 2,500 మంది వస్తే ఎందుకు జరిగింది? ఈవో, ఏడీఈవోలు బాధ్యత తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పాలకమండలి ఇది. భక్తులకు మెరుగైన సేవలందించడం మీ బాధ్యత. ఈ రోజు టీటీడీ అధికారులు విఫలమయ్యారు. మీరు సరిగ్గా చేయకపోవడం వలనే సీఎంతో పాటు నేను, ప్రభుత్వం మాట పడాల్సి వస్తోంది. తప్పు జరిగింది కాబట్టి పూర్తి బాధ్యత వహిస్తున్నాం. ప్రభుత్వం నుంచి టీటీడీ బోర్డు సభ్యుడు, పోలీస్ అధికారులు క్షమాపణ చెప్పి సంతాపం ప్రకటించాలి. తెల్లవారుజామున ఇచ్చే టికెట్ల కోసం ఎందుకు అన్ని గంటల పాటు కూర్చోబెట్టారు. తప్పు ఎక్కడ జరిగింది? పోలీసులు సకాలంలో ఎందుకు స్పందించలేదు? బైరాగపట్టెడ కేంద్రంలో ఎందుకు లైట్లు ఏర్పాటు చేయలేదు? భవిష్యత్తులో తొక్కిసలాట ఘటనలు జరగకుండా చూస్తాం. టీటీడీ అధికారులూ.. మనకు కావాల్సింది సగటు భక్తుడు ప్రశాంతంగా దర్శనం చేసుకుని క్షేమంగా ఇంటికి వెళ్లడం. ఇప్పటికైనా మేల్కొండి' అని పవన్ అన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

అధికారులపై చర్యలు ఎందుకంటే..

ప్రధాన గేటు తెరిచినందుకు.. డీఎస్పీ రమణకుమార్‌పై వేటు



బైరాగిపట్టెడలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రం వద్ద బందోబస్తు బాధ్యతలను తిరుపతిలో క్రైమ్ డీఎస్పీ రమణకుమార్‌కు అప్పగించారు. ఆ కేంద్రం వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, రోప్ పార్టీని సిద్ధంగా ఉంచుకోవడం, రద్దీ పెరిగినపుడు తొక్కిసలాట, తోపులాట జరగకుండా నియంత్రించడం, కింది స్థాయి అధికారులు, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి అవసరమైన ఆదేశాలు ఇవ్వడం, అవి అమలయ్యేలా చూడడం ఆయన ప్రధాన బాధ్యత. అయితే కేంద్రం వద్ద భక్తులు నిరీక్షిస్తున్న పద్మావతీ పార్కులో అస్వస్థతకు లోనైన ఓ మహిళను వెలుపలికి పంపడానికి అనాలోచితంగా ప్రధాన గేటు తెరవడంతో పరిస్థితి అదుపు తప్పింది. క్యూలైన్లలోకి పంపడానికే గేటు తెరిచారని భావించిన భక్తులు ఒక్కపెట్టున దూసుకురావడంతో తొక్కిసలాట జరిగి ప్రాణనష్టం సంభవించింది. ఈ కారణంగానే ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది.

రద్దీని పట్టించుకోని గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి



ఎస్వీ గోశాల డైరెక్టర్‌గా తిరుపతిలో పనిచేస్తున్న హరినాథరెడ్డిని టీటీడీ తరపున బైరాగిపట్టెడ కేంద్రానికి ఇన్‌చార్జిగా నియమించారు. అక్కడ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ దానికనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. అయితే భక్తుల రద్దీ పెరుగుతుండటం, గంటల తరబడి వేచివున్న భక్తులు అసహనంగా ఉన్నా ఆయన పట్టించుకోలేదు. పై అధికారులకు తెలిపి టోకెన్ల జారీని ముందస్తుగా మొదలుపెట్టడానికి అవకాశమున్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సకాలంలో భక్తులను క్యూలైన్లలోకి అనుమతించకపోవడం కూడా ఒత్తిడి పెరగడానికి కారణమైంది. ఈ వైఫల్యాలకు ఆయన్ను బాధ్యుడుగా గుర్తించిన సీఎం సస్పెన్షన్ వేటు వేశారు.

భద్రతా వైఫల్యానికి ఎస్పీ సుబ్బరాయుడు బదిలీ



శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో టోకెన్ల జారీ కేంద్రాలు ఏర్పాటు చేసినపుడు అక్కడ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షించాలి. టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగంతో, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలి. అయితే తొక్కిసలాటకు భద్రతా వైఫల్యమే కారణం కావడంతో సీఎం ఆయనపై బదిలీ వేటు వేశారు. ఆయన గతంలో చంద్రబాబుకు సెక్యూరిటీ అధికారిగా పనిచేశారు. సన్నిహిత అధికారిగా పేరుపడ్డారు. అలాంటిది ఆయనపై బదిలీ వేటు వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ చర్యతో తప్పు జరిగితే ఎవరినీ ఉపేక్షించేది లేదని సీఎం స్పష్టమైన హెచ్చరిక చేసినట్టయింది.

పర్యవేక్షణ బాధ్యతల్లో జేఈవో గౌతమి విఫలం



టీటీడీలో వైద్య, విద్య విభాగాలకు గౌతమి జేఈవోగా వ్యవహరిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్లను జారీచేసే వ్యవహారం మొత్తానికి ఆమెను ఇన్‌చార్జిగా నియమించారు. తిరుపతిలో టోకెన్ల జారీ సందర్భంగా అన్ని శాఖలు, విభాగాలను సమన్వయం చేసుకుని పర్యవేక్షించడంలో గౌతమి విఫలమైనట్టుగా ప్రభుత్వం భావించింది. దీంతో సీఎం ఆమె బదిలీకి ఆదేశించారు. గతంలో ఆమె వైసీపీ పెద్దలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా ఉన్న గౌతమిని ఎన్నికల కమిషన్ తప్పించింది. ఎన్నికల నిర్వహణతో సంబంధం లేని టీటీడీకి బదిలీ చేశారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోని సీవీఎస్వో శ్రీధర్



టీటీడీలో నిఘా, భద్రత విభాగానికి శ్రీధర్ బాధ్యుడు. చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా దేవస్థానం మొత్తానికీ భద్రత, నిఘా ఆయన కనుసన్నల్లోనే నడుస్తాయి. అయితే విభాగంపై ఆయనకు పెద్దగా పట్టులేదని, కింది స్థాయి అధికారులపై ఆధారపడతారనే ఆరోపణలున్నాయి. తాజాగా టోకెన్ల జారీ వ్యవహారంలోనూ భక్తుల రద్దీని ముందుగా పసిగట్టలేకపోవడం, ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఆయనకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. టోకెన్ జారీ కేంద్రాలను సక్రమంగా పర్యవేక్షించలేదని, పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయడంలో విఫలమయ్యారని భావించిన సీఎం ఆయనను బదిలీ చేయాలని ఆదేశించారు.

తొక్కిసలాట మృతుల్లో నలుగురు 'విశాఖవాసులు'

- వారిలో ముగ్గురు మహిళలు



గుడ్ల రజని



లావణ్య స్వాతి



కండిపల్లి శాంతి



నాయుడుబాబు

విశాఖపట్నం, తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన నలుగురు దుర్మరణం చెందారు. వారిలో ముగ్గురు మహిళలు విశాఖపట్నానికి చెందినవారు కాగా మరొకరు అనకాపల్లిలోని నర్సీపట్నానికి చెందిన వ్యక్తి. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని పెద్ద బొడ్డేపల్లిలో నివాసం ఉంటున్న బొడ్డేటి నాయుడుబాబు (54), తన భార్య మణికుమారి, ఇతర స్నేహితులతో కలిసి వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం మంగళవారం తిరుపతి బయలుదేరి వెళ్లారు. అక్కడ టికెట్ల కోసం క్యూలో జరిగిన తొక్కిసలాటలో నాయుడుబాబు కిందపడి మరణించారు. ఇక...విశాఖలోని కంచరపాలేనికి చెందిన కండిపల్లి శాంతి (35) భవన నిర్మాణ కార్మికురాలు. భర్త వెంకటరావు ఆటో డ్రైవర్. కుమారుడు మహేందర్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఆ ముగ్గురు వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం తిరుపతి వెళ్లారు. అక్కడ క్యూలో తండ్రీకుమారులు వెనక్కి ఉండగా, ఆమె ముందు వెళ్లారు. ఆ తొక్కిసలాటలో చనిపోయారు. విశాఖ రైల్వే న్యూకాలనీలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన సూరిశెట్టి లావణ్య స్వాతి (38) బంధువులతో కలిసి తిరుపతి వెళ్లారు. ఆమె భర్త సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు లాస్య, కీర్తిశ్రీ ఉన్నారు. బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో స్వాతి చనిపోయారు. మద్దిలపాలేనికి చెందిన గుడ్ల రజని భర్త లక్ష్మణరెడ్డి ఆటో డ్రైవర్. కుమారుడు హర్షిత్‌రెడ్డి అమెరికాలో చదువుతున్నాడు. ఏకాదశి టికెట్ల కోసం విశాఖ టీటీడీ కార్యాలయంలో వారు సంప్రదించారు. లభించకపోవడంతో భార్యాభర్తలు ఇద్దరూ ఆరో తేదీన తిరుపతి బయలుదేరి వెళ్లారు. తొక్కిసలాటలో చిక్కుకుని రజని మరణించారు.

మృతదేహాల తరలింపులో మంత్రుల చొరవ..

తిరుపతి తొక్కిసలాట ఘటనలో దుర్మరణం చెందిన వారి మృతదేహాలను స్వస్థలాలకు తరలించడానికి మంత్రులు ఏర్పాట్లుచేశారు. గురువారం బాధితులను పరామర్శించేందుకు మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణ రెడ్డి, పార్థసారథి, నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ తిరుపతిలోని రుయా ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడి మార్చురీ వద్ద మృతుల బంధువులను కలుసుకుని ఓదార్చారు. మృతదేహాలను సొంత గ్రామాలకు తరలించాలంటూ ఆదేశాలు జారీచేశారు. ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో అంత్యక్రియలకు అక్కడి ప్రభుత్వ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అనంతరం మంత్రులు ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. కాగా, తొక్కిసలాట అనంతరం రుయాకు తరలించిన వారిలో కొందరు గురువారం డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 8మందిని మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు పంపారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న 29 మంది బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈవో శ్యామలరావు, జేఈవో గౌతమి, కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్ బాధితులకు అందుతున్న చికిత్సపై వైద్యులను కలిసి ఆరా తీశారు.



టీటీడీ అధికారులు, మంత్రుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి ముందే మాటకు మాట

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని టీటీడీ పరిపాలనా భవన్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి(ఈఓ) శ్యామలరావు, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత తదితరులు హాజరయ్యారు. టీటీడీలోని కీలక అధికారులు కూడా ఈ భేటీకి వచ్చారు. టీటీడీలో 'ఉన్నతస్థాయి' వ్యక్తుల మధ్య సమన్వయం లేదనే అభిప్రాయాన్ని నిజం చేస్తూ.. ఛైర్మన్, ఈవోలు పరస్పరం తీవ్రస్థాయిలో వాదులాడుకున్నారు. "ఈవో నన్ను అసలు పట్టించుకోవడం లేదు. ఛైర్మన్ అనే గౌరవం కూడా చూపడం లేదు. ఏ చిన్న విషయాన్నీ నాతో చర్చించడం లేదు. మీరైనా కాస్త చెప్పండి" అని చంద్రబాబుకు బీఆర్ నాయుడు ఫిర్యాదు చేశారు. దీంతో రచ్చ మొదలైంది. ఈవో ఒక్కసారిగా సంయమనం కోల్పోయారు. 'నీకేం చెప్పడంలేదు. అన్నీ చెబుతూనే ఉన్నాం కదా' అంటూ ఛైర్మన్‌పై తీవ్ర స్వరంతో ఎదురు తిరిగారు. తర్వాత ఇద్దరూ 'నువ్వు' అంటే 'నువ్వు' అనుకుంటూ ఏకవచనంతోనే వాదులాటకు దిగారు. అక్కడే ఉన్న మంత్రులు, సీఎం విస్మయానికి గురయ్యారు. ఇంతలో మంత్రి అనగాని సత్యప్రసాద్ జోక్యం చేసుకుని... ఈవోను మందలించారు. "ఏం మాట్లాడుతున్నారు? ముఖ్యమంత్రి మన అందరికీ బాస్. ఆయన ముందు ఎలా మాట్లాడాలో తెలియదా? శ్రీవాణి ట్రస్టులో అంశాలు ఏమైనా ఉంటే నోట్ రూపంలో ఇవ్వండి. ఇక్కడెందుకు ప్రస్తావిస్తున్నారు!" అని అభ్యంతరం తెలిపారు.

చంద్రబాబు జోక్యం చేసుకుని 'సత్యప్రసాద్ నువ్వు ఆగు' అంటూ... ఈవో, ఛైర్మన్‌పై విరుచుకుపడ్డారు. "ఏం మాట్లాడుతున్నారు మీరు? ఇదేనా పద్ధతి? మీ పరిధి దాటి మాట్లాడుకుంటున్నారు. మీ ఫ్రస్టేషన్ ఎవరిపైన చూపిస్తున్నారు? అసలిక్కడ జరిగిందేమిటి? మీరు మాట్లాడుతున్నదేమిటి? ఒకచోట పనిచేస్తున్నప్పుడు ఓపిక, సమన్వయం ఉండాలి. అది మీకు ఎందుకు సాధ్యపడటం లేదు? నేనూ, చీఫ్ సెక్రటరీ సమన్వయంతో పనిచేసుకోవడం లేదా? మేం కోఆర్డినేషన్‌లో లేమా? ఒకరితో మరొకరం మాట్లాడుకోవడం లేదా? ఇద్దరం కలిసి పనిచేస్తేనే కదా రాష్ట్రం అభివృద్ధి చెందేది. ఇలా కొట్టుకుంటే ఎలా? ఇదేం భాష? ఇదేం వ్యవహారం. ఇది పద్ధతిగా లేదు. వెంటనే ఆపండి" అని తీవ్రస్వరంతో హెచ్చరించారు. ఇదే సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి వ్యవహార శైలి కూడా ప్రస్తావనకు వచ్చింది. "వాటన్నింటిపై తర్వాత మాట్లాడదాం. ఇది సందర్భం కాదు. సమయం వచ్చినపుడు అన్నీ పరిశీలిస్తాం. కానీ మీ పద్ధతి మార్చుకోవాలి. సమన్వయంతో పని చేయాల్సిందే" అని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఎవరికి వారే!

- ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో మధ్య సమన్వయ లోపం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

టీటీడీ... ఒక పెద్ద వ్యవస్థ! వేలాది మంది భక్తులు ఏడుకొండల వాడిపై పెట్టుకున్న విశ్వాసాన్ని కాపాడటం టీటీడీ బాధ్యత! ఇందులో టీటీడీ ఈవో, ఛైర్మన్, కొండమీద ఉండే అదనపు ఈవోలదే కీలక పాత్ర. అయితే... ఈ ముగ్గురి మధ్య సమన్వయం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తాజా ఘటనలతో అది నిజమే అని కూడా స్పష్టమవుతోంది. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై టీటీడీ రికార్డు స్థాయిలో 15 సమావేశాలు ఏర్పాటు చేయగా... అందులో ఈవో, ఛైర్మన్ కలిసి పాల్గొన్నది ఒకే ఒక్క భేటీలో అని తెలిసింది. ఈవో శ్యామలరావు, ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఎవరికి వారు 'సొంత నిర్ణయాత్మక శక్తి'గా ఎదగాలనుకునే క్రమంలో సమన్వయం కొరవడుతోందని, ఇతర పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయని ప్రభుత్వానికి ఇప్పటికే సమాచారం అందినట్లు తెలిసింది. ఇటీవల నాయుడు అమరావతికి వచ్చి ముఖ్యమంత్రిని కలిసి ఈవోపై ఫిర్యాదుల పరంపర కొనసాగించారు. ఈ సమస్యకు తెరదించాలనే ఉద్దేశంతో... చంద్రబాబు శ్యామలరావును పిలిపించి, నచ్చచెప్పారు. సమన్వయంతో పనిచేయాలని హితవు పలికారు. అంతటితో ఇద్దరి మధ్య వివాదం ముగిసిందనుకున్నారు. కానీ... గురువారం సీఎం సమక్షంలోనే వారిద్దరూ తీవ్రస్థాయిలో మాటల ఘర్షణకు దిగడం కలకలం రేపింది. దీంతో టీటీడీ వ్యవహారాలను సమగ్రంగా పరిశీలించాలని సీఎం భావిస్తున్నట్లు తెలిసింది.

సీఎంతో ఛైర్మన్ భేటీ

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సీఎం చంద్రబాబుతో గురువారం టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు ముప్పావుగంట భేటీ అయ్యారు. టీటీడీ పరిపాలనా భవనంలో సమీక్షకు ముందు... చంద్రబాబు వ్యానిటీ బస్సులో సుమారు గంటపాటు ఉన్నారు. అదే సమయంలో నాయుడు సీఎంతో భేటీ అయ్యారు. టీటీడీ ఉన్నతాధికారుల శైలి, బోర్డు తీరు, దర్శన కోటాలకు సంబంధించిన పలు అంశాలను వివరించినట్లు తెలిసింది. ఛైర్మన్ చెప్పిన వివరాలు విన్న అనంతరం... టీటీడీలో పాలకవర్గానికి, అధికార యంత్రాంగానికి నడుమ సమన్వయం, సయోధ్య లేవని సీఎం నిర్ధారణకు వచ్చారు. మీడియా సమావేశంలో ఒకింత సూటిగానే ఈ విషయం చెప్పారు. "ఛైర్మన్, ఈవో, జేఈవో కలసికట్టుగా పనిచేయాలని ఆదేశించాను. ఈగోలతో వ్యవహరించకూడదు. ఈగోతో గానీ, అసమర్థతతో గానీ, అనాలోచితంగా గానీ దేవుడి పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించడం తప్పు" అని చెప్పారు.

వారానికి 90 గంటలు పనిచేయాలి

» ఎల్అండ్‌టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు

ముంబై, జనవరి 9: ఉద్యోగ జీవితం, వ్యక్తిగత జీవితంపై ప్రముఖ సంస్థ లార్సన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 'వారానికి 90 గంటలు పనిచేయాలి. అవసరమైతే ఆదివారాలూ బాధ్యతలు నిర్వర్తించాలి. ఎంత కాలం అని భార్యలను చూస్తూ కూర్చుంటారు?. వాళ్లయినా మిమ్మల్ని ఎంత సేపని చూస్తారు..? ఇంట్లో కంటే కార్యాలయంలోనే ఎక్కువ సమయం ఉంటామని వారికి చెప్పండి. నేను ఆదివారమూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. మీతో పని చేయించుకోలేక పోతున్నందుకు చింతిస్తున్నాను. ఆదివారమూ మీతో పని చేయిస్తేనే నాకు సంతృప్తి' అని సుబ్రహ్మణ్యన్ మాట్లాడిన వీడియో బయటకు వచ్చింది. ఉద్యోగుల సమావేశం సందర్భంగా.. శనివారం తప్పనిసరిగా పనిచేయాలా? అన్న ప్రశ్న రావడంతో ఆయన ఈ సూచనలు చేశారు. కాగా, ఈ వీడియో ఎప్పటిదో మాత్రం తెలియలేదు. ఆయన వ్యాఖ్యలు మాత్రం వైరల్‌గా మారాయి. విమర్శలకు దారితీశాయి.

10% తగ్గనున్న వరి, గోధుమల దిగుబడి

న్యూఢిల్లీ, జనవరి 9: వాతావరణ మార్పుల కారణంగా దేశంలో వరి, గోధుమల ఉత్పత్తి 6నుంచి 10% క్షీణించే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర హెచ్చరించారు. ఇది రైతులతో పాటు లక్షలాది మంది పౌరుల ఆహార భద్రతపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పెరుగుతున్న భూతాపంతో నీటి లభ్యత క్రమంగా తగ్గుతుండటంతో సమీప భవిష్యత్తులో హిమాలయాలు, దిగువ మైదాన ప్రాంతాల్లో నివసించే 200 కోట్ల మందికి పైగా తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటారని భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ హెచ్చరించారు. పెరుగుతున్న అస్థిరతల కారణంగా వాతావరణంలో మార్పులను కచ్చితంగా అంచనా వేయడం కూడా కష్టంగా మారుతోందని వారు తెలిపారు.

బయోటెక్నాలజీ పరిశోధనల్లో మైలురాయి

» 10 వేల మంది భారతీయుల జీనోమ్ సీక్వెన్సింగ్ సమాచారం విడుదల

న్యూఢిల్లీ, జనవరి 9: భారత ప్రధాని నరేంద్ర మోదీ 10వేల మంది భారతీయుల జన్యుక్రమ విశ్లేషణ(జీనోమ్ సీక్వెన్సింగ్) సమాచారాన్ని గురువారం విడుదల చేశారు. జీనోమ్ ఇండియా డేటాలోని ఈ సమాచారం విడుదల బయోటెక్నాలజీ పరిశోధనల్లో ఓ మైలురాయిని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన జీనోమ్ కాన్‌క్లేవ్‌లో వర్చువల్‌గా పాల్గొన్న మోదీ ఈ సమాచారాన్ని విడుదల చేశారు. ఇండియన్ బయోలాజికల్ డేటా సెంటర్(ఐబీడీసీ) అధీనంలో ఉండే ఈ సమాచారాన్ని పరిశోధన సంస్థలు అనుమతితో వినియోగించుకోవచ్చు. అయితే, ఈ కార్యక్రమానికి వీడియో సందేశం పంపిన మోదీ.. ఐఐటీలు, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్(బీఆర్ఐసీ) వంటి 20 ప్రఖ్యాత సంస్థల కృషి వల్ల ఈ సమాచార సేకరణ జరిగిందని తెలిపారు. జన్యుపరమైన వ్యాధులు, అంటువ్యాధుల చికిత్సకు అధునాతన వైద్య విధానాల రూపకల్పనకు, వివిధ వర్గాలకు చెందిన ప్రజల జీవన విధానాలు, అలవాట్ల అధ్యయనానికి ఈ జీనోమ్ సీక్వెన్సింగ్ డేటా ఉపయోగపడుతుందని మోదీ పేర్కొన్నారు.

లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు..

రూ.5 లక్షల కోట్ల నష్టం

ఐదుగురి దుర్మరణం.. 1.37 లక్షల మంది తరలింపు

వాషింగ్టన్, జనవరి 9: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు అదుపులోకి రావడం లేదు. పాలిసాడ్స్ ఫైర్.. ఈటన్ ఫైర్.. సన్‌సెట్ ఫైర్.. ఇలా వేర్వేరు పేర్లతో ఆరు చోట్ల కార్చిచ్చు రగులుతూనే ఉంది. రెండ్రోజుల వ్యవధిలో వేల ఎకరాలు ఆహుతవ్వగా.. హాలీవుడ్ కొండలను అగ్ని చుట్టుముట్టింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు సహా.. పలువురు హాలీవుడ్ స్టార్ల ఇళ్లు బుగ్గిపాలవ్వగా.. ఐదుగురు పౌరులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి కడపటి వార్తలందేసరికి 2 వేలకు పైగా ఆవాసాలు దగ్ధమయ్యాయని, ఆస్తులు, వనరుల నష్టం విలువ రూ.5 లక్షల కోట్లు(57 బిలియన్ డాలర్లు)గా ఉంటుందని గుర్తించినట్లు తెలిపారు. 1.37 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. శుక్రవారం ఈ ప్రాంతంలో గాలుల వేగం మరింత ఎక్కువగా ఉంటుందని, కార్చిచ్చు ఇతర ప్రాంతాలకు విస్తరించే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

హాలీవుడ్ చుట్టూ..: లాస్ ఏంజెలెస్ కార్చిచ్చులో అతిపెద్దదైన పాలిసాడ్స్ ఫైర్ కారణంగా 15,800 ఎకరాలు, ఈటన్ ఫైర్ వల్ల ఆల్టడేన, పసాడెనా ప్రాంతాల్లోని 10 వేల ఎకరాలు, సన్‌సెట్ ఫైర్ 5 వేలకు పైగా ఎకరాలు, హర్రెస్ట్ ఫైర్ సైల్మర్‌లో 700 ఎకరాలు, లిడియా ఫైర్ 340 ఎకరాలను బుగ్గిపాలు చేయ గా.. ఉడ్లీ ఫైర్‌ను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు. సన్‌సెట్ ఫైర్ ప్రస్తుతం హాలీవుడ్ కొండలను చుట్టుముట్టిందని, వేగంగా విస్తరిస్తోందని, హెలికాప్టర్ల ద్వారా నీటిని చిమ్ముతున్నా అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం(గురువారం రాత్రి కడపటి వార్తలందేసరికి) హాలీవుడ్‌కు 8 మైళ్ల దూరంలో మంటలు కొనసాగుతున్నాయి. స్టూడియో సిటీ, రన్‌యాన్‌కెనాన్‌లో పలు ఇళ్లు దగ్ధమయ్యాయి. రియాల్టీ టీవీ స్టార్ పారిస్ హిల్టన్, నటులు యూజిన్ లెవీ, బిల్లి క్రిస్టల్, జాన్ గుడ్‌మన్ ఇళ్లు కూడా దగ్ధమయ్యాయి. స్టూడియోసిటీ పరిసరాల్లో చాలామంది సినీతారలు ఇళ్లను, సంపదను కోల్పోయారు. ఇప్పటి వరకు 2 వేల ఇళ్లు (లగ్జరీ విల్లాలు కలిపి) బుగ్గిపాలవ్వగా, రూ.5లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కతేల్చారు. ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉంటుందని, 2005లో నెలకొన్న కార్చిచ్చు తర్వాత ఇదే అతిపెద్ద వినాశకారిగా ఉందని పేర్కొన్నారు. 1.37 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, ఈ ప్రాంతంలో గాలిలో నాణ్యత(ఏక్యూఐ) దారుణంగా ఉందని వివరించారు.

ఆస్కార్ వేడుకలపై నీలినీడలు!

మాలిబు మొదలు.. శాన్ డియాగో కౌంటీ వరకు దక్షిణ కాలిఫోర్నియాలో 1.6 కోట్ల జనాభా ఉంటుం ది. ఈ ప్రాంతాలకు అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు 'శాంటాఅనా' గాలులు బలంగా వీస్తాయని, దీంతో.. పరిస్థితులు మరింత జటిలంగా మారే ప్రమాదాలున్నాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికలతో హాలీవుడ్‌లో జరగనున్న ఆస్కార్ వేడుకలపై నీలినీడలు కమ్ముకున్నాయని, పలు క్రీడలు(లీగ్‌లు), సాంస్కృతిక కార్యక్రమాలకు బ్రేకులు పడ్డాయని అమెరికా పత్రికలు పేర్కొన్నాయి. మాలిబులో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ ఇల్లు కూడా అగ్నికి ఆహుతైంది. ఈ లగ్జరీ ఇంటిని 1950లో నిర్మించారు. అయితే.. ఈ ఘటనపై తనకు సమాచారం లేదని బైడెన్ తెలిపారు.

ఏఐతో 9.2 కోట్ల ఉద్యోగాలు ఉష్!

» ఉద్యోగులను తగ్గించుకోనున్న 41 శాతం కంపెనీలు

» ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులపై ప్రభావం: డబ్ల్యూఈఎఫ్

న్యూఢిల్లీ, జనవరి 9: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. ప్రస్తుతం సాంకేతిక రంగాన్ని శాసిస్తోంది. పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలంటే ఏఐ ఆధారిత స్కిల్స్ తప్పనిసరి అనే పరిస్థితి నెలకొంది. ఇది మంచిదే అయినప్పటికీ.. రాబోయే రోజుల్లో ఈ కృత్రిమ మేధ(ఏఐ) వల్ల ఉద్యోగాలు భారీగా కోల్పోయే ప్రమాదం ఉందని 'వరల్డ్ ఎకానమిక్ ఫోరం ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' తాజా నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 41% కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకోవాలని భావిస్తున్నాయని తెలిపింది. ఏఐ వల్ల 2030 నాటికి 17 కోట్ల కొత్త ఉద్యోగాలు వస్తాయని అంచనా వేసిన ఈ నివేదిక.. 9.2 కోట్ల ఉద్యోగాలు పోతాయని తెలిపింది. ఏఐ టూల్స్ అభివృద్ధి, డిజైన్ చేసే నైపుణ్యం కలిగిన కొత్త వారిని నియమించుకోవడానికి 70% కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొంది. భవిష్యత్తులో ఏఐ, బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకు అధిక డిమాండ్ ఉంటుందని వెల్లడించింది. ఏఐ పాత్ర పెరిగినప్పటికీ.. సృజనాత్మక ఆలోచన, క్రియాశీలత వంటి మానవ నైపుణ్యాలు కూడా కీలకమేనని తెలిపింది. జనరేటివ్ ఏఐ, టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పులు.. పరిశ్రమలు, కార్మిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో వ్యాపారులు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని, నైపుణ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టి, స్థిరమైన ప్రపంచ శ్రామిక శక్తిని నిర్మించాల్సిన అవసరం ఉందని వరల్డ్ ఎకానమిక్ ఫోరం ప్రతినిధి టిల్ లియోపోల్డ్ చెప్పారు.

'ఇండీ' కూటమి లేనట్లేనా?

» కాంగ్రెస్‌కు 'చేయి'స్తున్న మిత్రపక్షాలు

న్యూఢిల్లీ, జనవరి 9: బీజేపీని ఓడించడమే లక్ష్యంగా గత లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆవిర్భవించిన 'ఇండీ' కూటమి ఉనికి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. ఒక్కో భాగస్వామ్య పార్టీ ఒక్కో తీరుగా వ్యవహరిస్తోంది. లోక్‌సభ ఎన్నికల వరకే ఈ కూటమి పరిమితమైతే.. దానిని మూసివేయడం మంచిదని జమ్మూకశ్మీరు సీఎం, ఎన్‌సీ సీనియర్ నేత ఒమర్ అబ్దుల్లా అన్నారు. కూటమి నాయకత్వం, భావి వ్యూహాలకు సంబంధించిన ఎజెండాపై స్పష్టత లేకుండా పోయిందని ఆక్షేపించారు. భాగస్వామ్య పక్షాలైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వేటికవి బరిలోకి దిగడం.. పరస్పరం విమర్శలు చేసుకుంటుండడం.. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, ఉద్ధవ్ శివసేన ఆప్‌కు మద్దతు ప్రకటించడం.. వారికి 'ఎక్స్' వేదికగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవిండ్ కేజ్రీవాల్ ధన్యవాదాలు తెలియజేయడం తెలిసిందే. ఇండీ కూటమి లోక్‌సభ ఎన్నికలవరకే పరిమితమని బిహార్‌లో ఆర్‌జేడీ యువనేత తేజస్వి యాదవ్ కొద్దిరోజుల కిందట అనడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మార్చి 14లోపు స్కీం సిద్ధం చేయండి

» రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్సపై కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 9: రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స విషయంలో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. క్షతగాత్రులకు సకాలంలో ఉచిత చికిత్స అందేలా మార్చి 14లోపు పథకం రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్ ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. ఆ పథకం విధి విధానాల కాపీని, అమలు తీరును వివరిస్తూ మార్చి 21కల్లా అఫిడవిట్ సమర్పించాలని నిర్దేశించింది. మోటారు వాహనాల (ఎంవీ) చట్టంలోని సెక్షన్ 162(2) ప్రకారం రోడ్డు ప్రమా ద బాధితులకు నగదురహిత చికిత్స అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన చాలామంది సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారని తెలిపింది. ప్రమాదం జరిగిన తర్వాత గంటలోపు సమయాన్ని 'గోల్డెన్ అవర్'గా ఎంవీ చట్టం నిర్వచించిందని, గాయపడినవారికి ఆ వ్యవధిలోపు చికిత్స అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. అయితే ఈ పథకంలో రోడ్డు ప్రమాద బాధితుల చికిత్సకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షలు ఇస్తామని కేంద్రం ప్రకటించిందని, ఈ మొత్తం సరిపోదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. ఆ అంశాలనూ పరిగణనలోకి తీసుకుని పథకానికి తుదిరూపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.